www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
మంగళవారం
17-09-2024
సంపుటి : 01 । సంచిక : 135 । పేజీలు : 12 । వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ
CMD

## ఈ శతాబ్దం మన దేశానికి బంగారు కాలం



- వచ్చే 25 ఏళ్లలో భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుతాం
- ప్రతిపక్షాలు నన్ను అనేకసార్లు ఎగతాళి చేశాయి
- వాటికి స్పందించకూడదని నిర్ణయించుకున్నా: మోదీ
- నమో భారత్ ర్యాపిడ్ రైల్ సహా వందే భారత్ రైళ్లను వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని

### తెలుగు రాష్ట్రాలకు మరో రెండు వందేభారత్ రైళ్లు

తెలుగు రాష్ట్రాలకు మరో రెండు వందేభారత్ రైళ్లు అందుబాట్లోకి వచ్చాయి. ప్రధాని మోదీ సోమవారం వీటిని వర్చువల్‌గా ప్రారంభించారు.దుర్గ్-విశాఖపట్నం మధ్య నడిచేది ఒకటి కాగా సికింద్రాబాద్-నాగ్‌పుర్ మధ్య నడిచేది మరొకటి. ఇప్పటికే విశాఖపట్నం- సికింద్రాబాద్, భువనేశ్వర్-విశాఖపట్నం, సికింద్రాబాద్- విశాఖ మధ్య వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయి. సికింద్రాబాద్-నాగ్‌పుర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులకు 19వ తేదీ నుంచి అందుబాటులోకి రానుంది.దుర్గ్-విశాఖపట్నం (20829) వందే భారత్.. దుర్గ్ నుంచి వారానికి 6 రోజులు(గురువారాలు మినహా) 05.45 గంటలకు బయలు దేరుతుంది. అదే రోజు 13.45 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో విశాఖపట్నం-దుర్గ్ (20830) వందే భారత్ విశాఖపట్నం నుంచి వారానికి 6 రోజులు (గురువారాలు మినహా) 14.50 గంటలకు బయలుదేరుతుంది.



# రాజీవ్ వల్లే దేశంలో సాంకేతిక విప్లవం



### ఆయన కంప్యూటర్‌ను పరిచయం చేయడం వల్లే కేటీఆర్ ఈ స్థాయికి చేరారు

- లేదంటే గుంటూరులో ఇడ్లీ, వడ అమ్ముకునే వారు..
- ప్రాణ త్యాగం అంటే ఇందిర, రాజీవ్ గాంధీలది
- పదవీ త్యాగం అంటే సోనియా, రాహుల్ గాంధీలది
- ఫామ్ హౌస్, ప్రగతి భవన్ కట్టుకున్న వారికి తెలంగాణ తల్లి విగ్రహం పెట్టడానికి పదేళ్లు సరిపోలేదా?
- డిసెంబర్ 9లోగా సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేసి చూపిస్తాం..
- ఎవడ్రా రాజీవ్ గాంధీ విగ్రహం తొలగించేది, ఎవడొస్తాడో చూస్తా
- రాజీవ్ గాంధీ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్:** దేశ ప్రజల కోసమే రాజీవ్ గాంధీ ప్రధాని పదవి చేపట్టారని, ప్రజలకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసిన నేత రాజీవ్ గాంధీ అని కొనియాడారు. 72,73వ రాజ్యాంగ సవరణ ద్వారా నేరుగా గ్రామాలకు నిధులు కేటాయించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆడబిడ్డలకు రాజ్యాధికారం ఇవ్వడమే కాకుండా.. ఐటీ రంగాన్ని దేశానికి పరిచయం చేసిన వ్యక్తి రాజీవ్ గాంధీ అన్నారు. తెలంగాణ సచివాలయ ప్రాంగణంలో భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ కాంగ్రెస్ ఇంఛార్జి దీపాదాస్ మున్షి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క, కొండా సురేఖ, ఎమ్మెల్యే లు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. "త్యాగం అంటే ఏంటో ప్రజలకు మిగతా2లో...



## విలీనమా? విమోచనమా? విద్రోహమా?

**సెప్టెంబర్ 17** తెలంగాణ చరిత్రను మలుపు తిప్పిన రోజు. సువర్ణ అక్షరాలతో లిఖించాల్సిన రోజు. అయితే ఈ రోజు చుట్టూ వివాదాలు అలుముకున్నాయి.

సెప్టెంబర్ 17ను ఒక్కొక్కరు ఒక్కో పేరుతో పిలుస్తున్నారు. విమోచనం, విద్రోహం, విలీన దినమని భిన్న వాదనలు వినిపిస్తున్నారు. 1948 సెప్టెంబర్17న సైనిక చర్యతో నిజాం రాజు పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి వచ్చిందన్నది నిజం. భారత ప్రభుత్వానికి లొంగిపోయాడు కాబట్టి తెలంగాణా స్టేట్ ఇండియన్ యూనియన్ లో విలీనమైందని కొందరి వాదన. నిజాం నిరంకుశ పాలన, నరరూప రాక్షసుడైన ఖాసీం రజ్వీ వంటి రజాకార్ల నుంచి తెలంగాణ ప్రజలు విముక్తి పొందారు కాబట్టి సెప్టెంబర్ 17ను విమోచన దినంగా పాటించాలని మరికొందరి వాదన. నిజాం రాష్ట్ర విలీనం కోసం వచ్చిన కేంద్ర సైన్యం నిజాం లొంగి పోగానే వెనక్కి వెళ్లకుండా 1951 దాకా ఎందుకున్నది? కమ్యూనిస్టులను అణచడానికేనని, అసలు ఆ హిడెన్ ఎజెండాతోనే సైన్యం వచ్చింది కాబట్టి అది విద్రోహ దినమని కమ్యూనిస్టులు అంటున్నారు. తాజాగా తెలంగాణ ప్రభుత్వం ప్రజాపాలన దినమని ఉత్తర్వులు జారీ చేసింది. ఇలా సెప్టెంబర్ 17 రాజకీయ చక్రబంధంలో చిక్కుకుంది. 75 ఏళ్లు గడిచినా ఈ వివాదం మాత్రం చల్లారడం లేదు. ఈనేపథ్యంలో హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం అయ్యిందా లేక తెలంగాణ ప్రజలకు సైనిక చర్యతో విమోచనం లభించిందా? లేక వామపక్షాలు చెబుతున్నట్లు విద్రోహం జరిగిందా? అనే అంశంపై వీ 3 న్యూస్ ఛానల్, విశ్వంభర దినపత్రికల అధినేత డా. కాచం సత్యనారాయణ ప్రత్యేక వ్యాసం 4 వ పేజీలో

## తెలంగాణ అస్థిత్వంతో పెట్టుకుంటే రాజకీయ సమాధే

- తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించటంపై కేటీఆర్ ఆగ్రహం
- నిరసనగా నేడు తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలాభిషేకాలకు పిలుపు



### ఎవరికి భయపడి విమోచన దినోత్సవం పేరు మార్చారు?

- ప్రశ్నించిన కేంద్రమంత్రి బండి సంజయ్
- పేరు మార్చినందువల్లే నేను రావట్లేదు





### అక్టోబర్‌లో కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తుల స్వీకరణ

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

అర్హులెవరో తదుపరి భేటీలో నిర్ణయిస్తాం: మంత్రి పొంగులేటి

## రాష్ట్రంలో గ్రీన్ పవర్ విప్లవం

**2035 నాటికి 40,000 మెగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తే లక్ష్యం**

గుజరాత్‌లోని గాంధీనగర్ సమ్మేళనంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి

పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు హైదరాబాద్‌కు రావాలని పిలుపు




**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో స్థిరమైన, విశ్వసనీయమైన గ్రీన్ పవర్ ప్రాజెక్టులను ప్రోత్సహించడానికి సమగ్ర గ్రీన్ పవర్ ఎనర్జీ పాలసీని అభివృద్ధి చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. తమ ప్రభుత్వం చేపట్టిన గ్రీన్ పవర్ మిషన్ లక్ష్యాన్ని సాధించడానికి వివిధ రంగాల్లోని పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు తమతో చేతులు కలపాలని మిగతా2లో...

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



### నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 100 | ₹ 122 |
| స్కిన్ | స్కిన్ లెస్ |
| ₹ 177 | ₹ 201 |

## వినాయకునికి నేడే వీడుకోలు



- నిమజ్జనాలకు అంతా సిద్ధం
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి
- శాంతియుతంగా జరిగేందుకు సహకరించాలని విజ్ఞప్తి
- అన్ని ఏర్పాట్లు చేశాం.. కమిషనర్ ఆమ్రపాలి

**విశ్వంభర, హైదరాబాద్:** నగరంలో మంగళవారం జరగనున్న వినాయక నిమజ్జనోత్సవాలకు సర్వం సిద్ధమైంది. ఖైరతాబాద్ బడా గణేశ్ సహా, వినాయక నిమజ్జనాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. సోమవారం ఖైరతాబాద్ గణేశుడిని దర్శించుకున్న ఆయన, స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, మొదటిసారిగా గణపతి మండపాలకు ఉచిత విద్యుత్ మిగతా10లో...



## ప్రపంచ ఫార్మా రాజధానిగా హైదరాబాద్

- జినోమ్ వ్యాలీలో అంతర్జాతీయ ప్రమాణాలు
- పరిశ్రమలకు మరింత ప్రోత్సాహం
- మంత్రి శ్రీధర్‌బాబు

**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ బ్రాండ్ ను ప్రపంచంలోనే ఫార్మా కంపెనీల రాజధానిగా తీర్చిదిద్దుతామ ని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం జీనోమ్ వ్యాలీలో ఫార్మా పరిశ్రమల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మిగతా2లో...

## ప్రపంచ ఫార్మా రాజధానిగా
# హైదరాబాద్

**(మొదటి పేజీ తరువాయి)**
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్ ఇమేజ్ అభివృద్ధికి గడిచిన 30, 40 సంవత్సరాలుగా కృషి చేస్తున్న ఫార్మా పరిశ్రమలకు మరింతగా ప్రోత్సాహం, సకల వసతులను కల్పిస్తూ మరిన్ని పెట్టుబడులు వచ్చే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కృషి చేస్తున్నామని తెలిపారు. భారీ పెట్టుబడులు : త్వరలో హైదరాబాద్‌లో ప్రముఖ ఫార్మా పరిశ్రమలైన లారస్ ల్యాబ్స్, కర్క ల్యాబ్స్ జాయింట్ వెంచర్‌గా సుమారు 300 ఎకరాల్లో రూ,2 వేల కోట్లతో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చినట్లు మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. వీటి ద్వారా వందలాది మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రపంచ ఫార్మా దృష్టిని మళ్లించడానికి జినోమ్ వ్యాలీకి ఆకర్షించేందుకు అత్యంత ప్రపంచ స్థాయి ప్రమాణాలతో వివిధ దశలలో తీర్చిదిద్దుతున్నామని మంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను ఫార్మా రంగంలో పెట్టుబడులకు స్వర్గధామంలా తయారు చేసి ఉపాధి అవకాశాలు, రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. అందుకే ఇవాళ జీనోమ్ వ్యాలీలోని వివిధ ఫార్మా కంపెనీల దిగ్గజాలతో మరిన్ని పెట్టుబడులు రాబట్టే విషయమై చర్చించినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జయప్రకాశ్ రెడ్డి, ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు, ఆయా ఫార్మా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఈ శతాబ్దం మన దేశానికి
# బంగారు కాలం

**అహ్మదాబాద్:** ఈ శతాబ్దం మన దేశానికి బంగారు కాలమని.. వచ్చే 25 ఏళ్లలో భారత్ ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుతామని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు. దేశాభివృద్ధి విషయంలో ఎలాంటి అవకాశాలు వదులుకోవడం లేదని స్పష్టం చేశారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన తొలి 100 రోజుల్లో ప్రతిపక్షాలు తనను అనేకసార్లు ఎగతాళి చేశాయన్నారు. ఎంతో అవమానించాయని, అయితే.. ప్రతిపక్షాల అవమానాలకు స్పందించకూడదని నిర్ణయించుకున్నానన్నారు. 100 రోజుల ప్రభుత్వ ప్రణాళికను పూర్తి చేయడంపైనే దృష్టి సారించానని తెలిపారు. సోమవారం గుజరాత్ లోని అహ్మదాబాద్ నుంచి వందేభారత్ రైళ్లను వర్చువల్‌గా ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ వంద రోజుల్లో రూ. 15 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయి. 3 కోట్ల ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చాం. వేగంగా ఆ పనులు చేపడతాం. గ్రామ, పట్టణ ప్రజల జీవనాన్ని మెరుగుపరచడంపై దృష్టి సారిస్తున్నాం" అని మోదీ పేర్కొన్నారు.. ఒకవైపు దేశంలోని ప్రతి పౌరుడు ప్రపంచంలో భారత్ కు బ్రాండ్ అంబాసిడర్ కావాలని కోరుకుంటుంటే.. మరోవైపు కొంతమంది మాత్రం తప్పుడు పనులు చేస్తూ.. దేశ సమైక్యతపై దాడి చేస్తున్నారని విమర్శించారు.

**నమో భారత్ ర్యాపిడ్ రైల్ ప్రారంభం..**
నమో భారత్ ర్యాపిడ్ రైల్ సహా పలు వందే భారత్ రైళ్లను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. గుజరాత్ అహ్మదాబాద్‌లో పలు అభివృద్ధి పనులకు ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా నాగ్‌పూర్-సికింద్రాబాద్, కొల్హాపూర్-పుణే, ఆగ్రా క్యాంట్ – వారణాసి, దుర్గ్-విశాఖపట్నం, పుణే – హుబ్బళి, విశాఖపట్నం-రాయ్‌పూర్ సహా భుజ్-అహ్మదాబాద్ మధ్య తొలి మెట్రో రైలును ప్రారంభించి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. తొలిసారిగా వందే భారత్ మెట్రో రైలును భారతీయ రైల్వేశాఖ ప్రవేశపెట్టింది. ప్రారంభానికి ముందు ఈ రైలుకు నమో భారత్ ర్యాపిడ్ రైలుగా నామకరణం చేశారు. రైల్వేశాఖ ప్రతిష్ఠాత్మకంగా వందే భారత్ రైలును తీసుకువచ్చింది. పట్టణ స్టేషన్ల మధ్య పనిచేసే సాంప్రదాయ మెట్రోలకు భిన్నంగా.. నమో భారత్ ర్యాపిడ్ రైలు అంతర నగర గమ్యస్థానాలను కవర్ చేస్తుంది. రైలులో సీటింగ్ కోసం కుషన్డ్ సీటింగ్ అమర్చారు. కోచ్‌లన్నింట్లో ఎయిర్ కండీషన్ ఉంటుంది. చూసేందుకు వందే భారత్ తరహాలో కనిపించినా.. రెండు చివర్లలో ఆటోమేటిక్ స్లైడింగ్ డోర్లు, ఇంజిన్స్‌తో వస్తుంది. రైలులో ప్రయాణానికి ముందు మాత్రమే ప్రయాణికులు టికెట్‌ను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇదిలా ఉండగా.. ప్రధాని నరేంద్ర మోదీ అహ్మదాబాద్‌లో రూ.8వేలకోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. అహ్మదాబాద్ చేరుకున్న ప్రధాని సీఎం భూపేంద్ర పటేల్, మంత్రులు ఘన స్వాగతం పలికారు.

## అక్టోబర్‌లో కొత్త రేషన్ కార్డులకు
# దరఖాస్తుల స్వీకరణ



**విశ్వంభర, హైదరాబాద్:** కొత్త రేషన్ కార్డులకు సంబంధించి అక్టోబర్‌లో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రకటించారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న అర్హులైన కుటుంబాలకు నిత్యావసర సరకుల కోసం రేషన్ కార్డు, ఆరోగ్యానికి ఉపయోగపడేలా హెల్త్ కార్డులను విడివిడిగా అందజేయబోతున్నామని తెలిపారు. హైదరాబాద్ ఎర్రమంజిల్ జలసౌధలో సోమవారం ఆయన అధ్యక్షతన కొత్త రేషన్ కార్డులు, హెల్త్ కార్డుల జారీపై మంత్రివర్గ ఉపసంఘం 4వ భేటీ జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్, సంయుక్త సంచాలకులు ప్రియాంక ఆల, ఇతర అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల సంఖ్య, కొత్త రేషన్ కార్డులు, హెల్త్ కార్డుల పంపిణీ, ఇతర మార్గదర్శకాలపై విస్తృతంగా చర్చించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ నేపథ్యంలో కొత్త రేషన్ కార్డులు, హెల్త్ కార్డులు జారీపై విధి విధానాలు, ప్రస్తుతం ఉన్న పరిస్థితులు, నిబంధనలు, ఏ విధంగా సాఫీగా ముందుకు వెళ్లాలన్న అంశాలపై తాము చర్చించామని ఉత్తమ్ తెలిపారు. రేషన్ కార్డుల జారీకి సంబంధించి తుది పక్రియ, ఖరారు ఈ నెలాఖరులో పూర్తి చేస్తామని చెప్పారు. ప్రస్తుతం 89.96 లక్షల రేషన్ కార్డులు ఉండగా, లబ్ధిదారులు 2 కోట్ల 81 లక్షల 70 వేల మంది ఉన్నారని ప్రస్తావించారు. అర్హులైన ప్రతి కుటుంబానికీ రేషన్ కార్డులు, హెల్త్ కార్డులు జారీ చేస్తామని మంత్రి ఉత్తమ్ భరోసా ఇచ్చారు. తెల్ల రేషన్ కార్డులకు ఎవరు అర్హులు అనే విషయంలో వచ్చే భేటీలో నిర్ణయిస్తామని మంత్రి పొంగులేటి ప్రకటించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి పారదర్శకంగా రేషన్ కార్డులు జారీ చేస్తామని తెలిపారు. రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ఎలా ఉండాలన్న అంశంపై రాజకీయ పార్టీలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు లేఖలు రాశామని చెప్పారు. ఇప్పటి వరకు 16 మంది ప్రజాప్రనిధులు తమ విలువైన సూచనలు, సలహాలు ఇచ్చారని మంత్రి పొంగులేటి వివరించారు. ఆ సహేతుకమైన సూచనలు, సలహాలపై కూడా ఈ భేటీలో చర్చించామని అన్నారు. ప్రధాన విపక్షం బీఆర్ఎస్ ఇచ్చే సూచనల విషయంలో తాము ఎలాంటి భేషజాలకు పోకుండా పరిగణలోకి తీసుకుంటామని స్పష్టం చేశారు. రేషన్ కార్డు, హెల్త్ కార్డులు రెండింటినీ స్మార్ట్ కార్డులు జారీ చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని పొంగులేటి పేర్కొన్నారు.

# రాజీవ్ వల్లే దేశంలో సాంకేతిక విప్లవం

**(మొదటి పేజీ తరువాయి)**
తెలియజేయాల్సిన బాధ్యత నాపై ఉంది. రూ.వేల కోట్ల సంపదను దేశం కోసం త్యాగం చేసిన నాయకుడు, స్వాతంత్ర్యం కోసం జైలుకు వెళ్లిన వ్యక్తి, స్వాతంత్ర్యం తర్వాత దేశాన్ని ఐక్యంగా ఉంచిన నేత నెహ్రూ. ఆయన కట్టిన ప్రాజెక్టులు ఇప్పటికీ ఆయన పనితనానికి సజీవ సాక్ష్యాలుగా ఉన్నాయి. నెహ్రూ అధికారంలో ఉన్నప్పుడు ఇందిరా గాంధీ ఏ బాధ్యత తీసుకోలేదు. కొందరు మాత్రం తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకొని మంత్రి పదవులు పొందుతున్నారు. బ్యాంకులను ప్రభుత్వపరం చేసి పేదలకు ఇందిరా గాంధీ మంచి చేశారు. లక్షల ఎకరాల భూములను పేదలకు పంచి పెట్టింది ఇందిరా గాంధీ కాదా? దేశంలో రిజర్వేషన్లు తెచ్చింది కాంగ్రెస్ పార్టీ కాదా?'అని అన్నారు.

"రాజీవ్ గాంధీ సాంకేతిక విప్లవం తీసుకురావడం వల్లే ఇప్పుడు మనం ప్రపంచంతో పోటీ పడగలుతున్నాం. ఆయన వల్లే కేటీఆర్ ఐటీ చదివి అమెరికా వెళ్లారు.రాజీవ్ గాంధీ దేశానికి కంప్యూటర్ పరిచయం చేసి ఉండకపోతే... కేటీఆర్ గుంటూరులో ఇడ్లీ,వడ అమ్ముకునే వారు.. లేకపోతే సిద్దిపేటలో చాయ్ అమ్ముకునే వారు.రాజీవ్ గాంధీ కంప్యూటర్ ను పరిచయం చేయడం వల్లే కేటీఆర్ ఈ స్థాయికి చేరారు.రాజీవ్ గాంధీ తర్వాత సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఏ పదవీ తీసుకోలేదు. పదవి త్యాగం అంటే వాళ్లది. తెలంగాణ బిడ్డ పీవీని ప్రధానిని చేసింది సోనియా గాంధీ కాదా? గాంధీ కుటుంబం గురించి కేసీఆర్ కుటుంబానికి తెలుసా? అడ్డగోలుగా మాట్లాడితే చూస్తూ ఊరుకుంటామనుకున్నారా" అని రేవంత్‌రెడ్డి హెచ్చరించారు.

"గత పాలకులు సచివాలయం ముందు తెలంగాణ తల్లి విగ్రహం పెడదామనుకున్నారట, గత పదేళ్లలో ఎందుకు పెట్టలేదు?'.మేం రాజీవ్ విగ్రహం పెడతామనాగానే వీళ్లకు తెలంగాణ తల్లి విగ్రహం గుర్తొచ్చిందట. దేశం కోసం ప్రాణాలు ఇచ్చిన రాజీవ్ గాంధీ విగ్రహం ఇక్కడ పెట్టడం సముచితం కాదా? అని తెలంగాణ ప్రజలను అడుగుతున్నా. రాజీవ్ గాంధీ విగ్రహం తొలగిస్తామని కొందరు మాట్లాడుతున్నారు. ఎవడ్రా తొలగించేది... ఎవడొస్తాడో చూస్తా" అని రేవంత్ రెడ్డి హెచ్చరించారు. పదేళ్లు మీకు సోయి లేదు కాబట్టే మేం సచివాలయంలో తెలంగాణ విగ్రహం ఏర్పాటు చేస్తున్నామన్నారు. తెలంగాణ పరిపాలనకు గుండెకాయ సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేసి చూపిస్తాం. డిసెంబర్ 9లోగా తెలంగాణ తల్లి విగ్రహం అక్కడ ఉంటుందని రాష్ట్ర ప్రజలకు మాట ఇస్తున్నానని సీఎం అన్నారు.

పదేళ్లు రాష్ట్రాన్ని దోచుకుని, పదవులు పంచుకున్న వాళ్లు కుటుంబ పాలన గురించి మాట్లాడుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. గడీలలో గడ్డి మొలవాల్సిందేనని ఆనాడు చాకలి ఐలమ్మ చెప్పిందన్నారు. ఐలమ్మ స్ఫూర్తితో



రాజీవ్ విగ్రహం సాక్షిగా చెబుతున్నా..మీ ఫామ్ హౌస్ లలో జిల్లెళ్లు మొలవాల్సిందే నన్నారు. అప్పటి వరకు కాంగ్రెస్ కార్యకర్తలు విశ్రమించరన్నారు. వెయ్యి ఎకరాల్లో ఫామ్ హౌస్, ప్రగతి భవన్ కట్టుకున్న వాళ్లు తెలంగాణ తల్లి విగ్రహం పెట్టడానికి పదేళ్లు సరిపోలేదా? అని ప్రశ్నించారు.కేసీఆర్ అధికారం పోయిందన్న అక్కసుతో అందుకే కొంతమంది చిల్లరగాళ్లను ఉసిగొల్పుతున్నారని మండిపడ్డారు. కాలకేయ ముఠా మిడతల దండుగా మారి తెలంగాణను మింగేసేందుకు మళ్లీ ఊళ్లమీదకు రాబోతోందన్నారు. తెలంగాణ ప్రజలారా అప్రమత్తం కండి, ఈ మిడతల దండును తెలంగాణ పొలిమేరలకు తరమాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# రాష్ట్రంలో గ్రీన్ పవర్ విప్లవం

**(మొదటి పేజీ తరువాయి)**
ఆహ్వానించారు. సోలార్ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపే వారంతా హైదరాబాద్‌కు రావాల్సిందిగా మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. తెలంగాణలో 2035 నాటికి 40,000 మెగావాట్ల గ్రీన్ పవర్‌ను ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. గుజరాత్ రాష్ట్రం గాంధీ నగర్‌లోని మహాత్మా మందిర్ కన్వెన్షన్ అండ్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ప్రారంభమైన 4వ ప్రపంచ గ్రీన్ పవర్ పెట్టుబడిదారుల సమ్మేళనం, ఎగ్జిబిషన్ సందర్భంగా ఏర్పాటైన సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రసంగించారు. రాష్ట్రంలో గ్రీన్ పవర్ ఉత్పత్తికి ఉన్న మార్గాలు, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఆయన వివరించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న నేటి ప్రపంచంలో ఆర్థిక, సామాజిక శ్రేయస్సుకు రెన్యూవబుల్ ఎనర్జీ పునాది లాంటిదని ఆయన పేర్కొన్నారు. భారతదేశం 500 గిగా వాట్ల గ్రీన్ పవర్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. తెలంగాణ డైనమిక్ ఆర్థిక వ్యవస్థ, ఐటీ, ఫార్మసిటికల్స్ తయారీ వంటి అభివృద్ధి చెందుతున్న పరిశ్రమలతో ఈ పరివర్తనకు తెలంగాణ ప్రభుత్వం నాయకత్వం వహించాలని




లక్ష్యంగా పెట్టుకుందన భట్టి విక్రమార్క అన్నారు.

**రాష్ట్రంలో గ్రీన్‌పవర్ ఉత్పత్తికి ఎన్నో అవకాశాలు**
తెలంగాణ రాష్ట్రంలో రాబోయే ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సిటీ, ఫోర్త్ సిటీ, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్‌ను ముందుకు తీసుకెళ్లాలని రాష్ట్ర ప్రభు త్వం భావిస్తోందని డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. ఇంటెలిజెన్స్ సిటీ, ఫ్యూచర్ సిటీ సుస్థిర సాంకేతికల చుట్టూ అభివృద్ధి కేంద్రీకృతమై ఉంది. కీలక పారిశ్రామిక కారిడార్లను అనుసంధానం చేయడానికి ప్రాంతీయ రింగ్ రోడ్డు, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్‌ను ముందుకు తీసుకెళ్లాలని రాష్ట్ర ప్ర భుత్వం భావిస్తున్నట్లు తెలిపారు. ఇవి గ్రీన్ పవర్ ఉత్పత్తికి అవకాశం కల్పిస్తాయని అన్నారు. తెలంగాణలో సమృద్ధిగా ఉన్న వనరులు, నైపుణ్యం కలిగిన కార్మికులు, టీఎస్ - ఐపాస్ వంటి వ్యాపార అనుకూల సంస్థలు గ్రీన్ పవర్ రంగాల్లో కంపెనీలు అభివృద్ధి చెందడానికి మంచి అవకాశాలను అందిస్తున్నాయి అన్నారు. 300 రోజులకు పైగా ఉండే సూర్యరశ్మితో సుమారుగా 26.4 గిగావాట్ల సామర్థ్యం అంచనా వేస్తున్నట్టు తెలిపారు. భారతదేశంలో బలంగా గాలులు వీచే మొదటి ఎనిమిది రాష్ట్రాల్లో ఒకటిగా తెలంగాణ ఉందన్నారు. రాష్ట్రంలో శ్రీశైలం, నాగార్జునసాగర్ లలో పంప్ ఆపరేషన్లతో రాష్ట్రంలో రెండు ప్రధాన హైడ్రో ప్రాజెక్టులు ఉన్నాయని, ఇక్కడ పంపుడ్ స్టోరేజీ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపట్టడానికి ఇంకా అవకాశాలు ఉన్నాయని ఉపముఖ్యమంత్రి భట్టి తెలిపారు. వీటితోపాటు రిజర్వాయర్లు, పాడుబడిన గనులు మొదలైన వాటిని ఉపయోగించి, నది వెలుపల పంపుడ్ స్టోరేజీ ప్రాజెక్టులను చేపట్టడానికి మరింత అవకాశం ఉందని వివరించారు. ఇతర గ్రీన్ పవర్ సంభావ్యతలో హైడ్రోజన్, జియో థర్మల్ ( సుమారు 1500 నుంచి 3,000 మెగావాట్ల) మినీ హైడల్ ( సుమారు 250 మెగావాట్ల) విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉందన్నారు.



# కేజ్రీవాల్ రాజీనామా నేడే?

**లెఫ్టినెంట్ గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరిన దిల్లీ సీఎం**

**దిల్లీ:** దేశ రాజధాని దిల్లీలో రాజకీయాలు వేడెక్కాయి. మరో రెండు రోజుల్లో దిల్లీ సీఎం పదవికి తాను రాజీనామా చేస్తున్నట్లు ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ ఆదివారం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, మంగళవారం తన పదవికి రాజీనామా చేసే అవకాశం ఉంది' అని ఆమ్ ఆద్మీ పార్టీ వర్గాలు తెలిపినట్లు సమాచారం. ఇందుకోసం కేజ్రీవాల్ మంగళవారం లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా అపాయింట్‌మెంట్ కోరినట్లు తెలుస్తోంది. సాయంత్రం 4:30 గంటలకు ఎల్జీని కేజ్రీ కలిసే అవకాశం ఉంది. ఆ తర్వాత తన రాజీనామాను సమర్పించొచ్చని సదరు వర్గాలు తెలిపినట్లు సమాచారం. కాగా, మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్ అరెస్టైన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో శుక్రవారం ఆయన తీహార్ జైలు నుంచి విడుదలయ్యారు. ఆ తర్వాత ఆదివారం ఆప్ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి తొలిసారి ప్రసంగించారు. ఈ సందర్భంగా తన రాజీనామా నిర్ణయాన్ని ప్రకటించారు. మరో రెండు రోజుల్లో శాసనసభా పక్ష సమావేశం నిర్వహించి తన స్థానాన్ని భర్తీ చేసే అంశంపై నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నట్లు తెలిపారు. దీంతో దిల్లీ తదుపరి సీఎం ఎవరన్నదానిపై ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ నడుస్తోంది.

**కొత్త ముఖ్యమంత్రి ఎవరు?**
ఇదే సమయంలో పలువురు నేతల పేర్లు తెరపైకి వచ్చాయి. అందులో ప్రముఖంగా వినిపిస్తున్న పేరు అతిశీ. కేజ్రీవాల్ జైల్లో ఉన్న సమయంలో అన్నీ తానై పార్టీ వ్యవహారాలు, ప్రభుత్వ బాధ్యతలను చక్కదిద్దారు. ప్రభుత్వంలోని మొత్తం 14 విభాగాలకు ఇన్‌ఛార్జి గా వ్యవహరిస్తున్న ఆమె.. కేబినెట్ మంత్రుల్లో అత్యధిక విభాగాలను కూడా చూస్తున్నారు. విద్య, ఆర్థికం, ప్రణాళిక, పీడబ్ల్యూడీ, వాటర్, పవర్, పౌర సంబంధాలు వంటి కీలక శాఖలను అతిశీ నిర్వహిస్తున్నారు. విద్యపై వేసిన స్టాండింగ్ కమిటీకి ఆమె ఛైర్ పర్సన్‌గానూ పనిచేశారు.అతిశీతోపాటు సౌరభ్ భరద్వాజ్, కైలాశ్ గెహ్లాట్, గోపాల్ రాయ్, ఎంపీ రాఘవ్ చద్దా పేర్లను ఆప్ పరిశీలిస్తున్నట్టు మీడియాలో వార్తా కథనాలు వెలువడ్డాయి. కేజ్రీవాల్ సతీమణి సునీతా కేజ్రీవాల్ పేరు కూడా తెరపైకి వచ్చింది. ఇక మనీశ్ సిసోడియా.. కేజ్రీవాల్ బాటలోనే పయనిస్తున్నారు. ప్రజలు తన నిజాయితీని ఆమోదిస్తే మాత్రమే తాను కూడా మళ్లీ ఉప ముఖ్యమంత్రిగా తిరిగి వస్తానంటూ తన నిర్ణయాన్ని ప్రకటించారు. మరోవైపు ఇక ఇవాళ ఉదయం కేజ్రీని సిసోడియా కలిశారు. రాజీనామా ప్రకటన తర్వాత ఆప్ చీఫ్‌తో సిసోడియా తొలిసారి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా దిల్లీ తదుపరి ముఖ్యమంత్రి ఎవరన్నదానిపై చర్చ జరిగినట్లు తెలిసింది

## గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం
# ఉత్తర్వులు జారీ

**విశ్వంభర, హైదరాబాద్:** గల్ఫ్ కార్మికుల సంక్షేమ కార్యక్రమాలపై తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఎక్స్‌గ్రేషియా 2023 డిసెంబరు 7 తర్వాత మరణించిన గల్ఫ్ కార్మికులకు వర్తింపజేయనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం అడ్వయిజరీ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వారి ఫిర్యాదుల కోసం ప్రత్యేకంగా ప్రవాసీ ప్రజావాణిని నిర్వహించనున్నారు. గురుకులాల్లో గల్ఫ్ కార్మికుల పిల్లలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు సీఎస్ శాంతికుమారి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**సెప్టెంబరు 17 ఇక ప్రజా పాలన దినోత్సవం..**
ప్రతి ఏటా సెప్టెంబరు 17ను ప్రజాపాలన దినోత్సవంగా జరపాలని తెలంగాణ ప్రభుత్వం జీవో జారీ చేసింది. దీనిపై ఇప్పటికే నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు వెలువరించింది. ఈ ఏడాది ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనుండగా మిగిలిన చోట్ల త్రివర్ణపతాకాలను ఎగురవేసే వారి వివరాలు పేర్కొంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారమే ఉత్తర్వులు జారీ చేశారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పట్టణ, గ్రామీణ సంస్థల్లోనూ మువ్వన్నెల జెండా ఎగురవేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## తెలంగాణ అస్తిత్వంతో పెట్టుకుంటే
# రాజకీయ సమాధే

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్ర సచివాలయం, తెలంగాణ అమర జ్యోతి మధ్యలో ఉండాల్సిన తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ గాంధీ విగ్రహాన్ని పెట్టడంపై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది తెలంగాణ అస్తిత్వాన్ని తాకట్టు పెట్టే సిగ్గుమాలిన చర్య అంటూ మండిపడ్డారు. కాంగ్రెస్ సీఎం రేవంత్ రెడ్డి చర్యకు నిరసనగా మంగళవారం రాష్ట్రంలోని అన్ని తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలాభిషేకాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ తల్లిని అవమానించేలా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన చర్యను ఎక్కడికక్కడ పార్టీ శ్రేణులతో సహా తెలంగాణ వాదులంతా వ్యతిరేకిస్తూ నిరసన తెలపాలని కోరారు. తెలంగాణ తల్లి విగ్రహం ఉండాల్సిన చోట రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయటంపై ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారని కేటీఆర్ తెలిపారు. వెంటనే రేవంత్ రెడ్డి తాను చేసిన తప్పును సరిదిద్దుకోవాలని సూచించారు. లేదంటే కచ్చితంగా తెలంగాణ ప్రజలు సరైన సమయంలో బుద్ధి చెప్పటం ఖాయమని హెచ్చరించారు.

తెలంగాణ అస్తిత్వం, తెలంగాణ ప్రజల ప్రయోజనాల కన్నా కూడా కాంగ్రెస్ నాయకులకు స్వప్రయోజనాలే ముఖ్యమైపోయాయన్నారు. తెలంగాణ ఉద్యమకారులమంటూ గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ నాయకులంతా దిల్లీకి గులామ్ లేనని తేలిపోయిందన్నారు. తెలంగాణ అస్తిత్వం తో పెట్టుకున్న వాళ్లెవరూ రాజకీయంగా బతికి బట్టకట్టలేదని ఈ సందర్భంగా కేటీఆర్ హెచ్చరించారు. ప్రాంతం వాడే మన అస్తిత్వాన్ని దెబ్బ తీస్తుంటే కచ్చితంగా తెలంగాణ ప్రజలు వారికి రాజకీయంగా సమాధి తవ్వటం ఖాయమని చెప్పారు.

**అధికారంలోకి రాగానే రాజీవ్ గాంధీ విగ్రహాన్ని గాంధీభవన్ కు తరలిస్తాం.**
కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ గాంధీ విగ్రహాన్ని పెట్టుకోవాలనుకుంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని...కానీ తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన స్థలంలో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయటాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. తెలంగాణ సచివాలయం, అమర జ్యోతి మధ్యలో తెలంగాణ తల్లి విగ్రహం ఉండాలని కేసీఆర్ 2023 జులైలోనే ఈ స్థలాన్ని ఎంపిక చేశారని కేటీఆర్ గుర్తు చేశారు. యావత్తు తెలంగాణ సమాజం కూడా తెలంగాణ తల్లి విగ్రహాన్ని సగర్వంగా గౌరవించుకునేందుకు కేసీఆర్ ఎంపిక చేసిన స్థలానికి ఆమోదముద్ర వేసిందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కుసంస్కారంతో తెలంగాణ ఉద్యమానికి సంబంధం లేని వ్యక్తి విగ్రహాన్ని ఆ స్థలంలో ఏర్పాటు చేసిందన్నారు. కాంగ్రెస్ చర్య ప్రతి తెలంగాణ వ్యక్తి మనసును గాయపర్చేలా ఉందన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ తల్లి విగ్రహం కోసం కేటాయించిన ఆ స్థలంలో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తొలగిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. సకల మర్యాదలతో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని గాంధీ భవన్ కు తరలిస్తామని తేల్చి చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లో తెలంగాణ తల్లి విగ్రహం కోసం ఏర్పాటు చేసిన స్థలంలో తెలంగాణ తల్లి విగ్రహం ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు.



**తెలంగాణకు బీఆర్ఎస్ మాత్రమే శ్రీరామరక్ష**

**తెలంగాణ అస్తిత్వం, తెలంగాణ ప్రయోజనాల విషయంలో బీఆర్ఎస్ మాత్రమే రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. దిల్లీ బాసుల మెప్పు కోసం కాకుండా....తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ ముందు నిలబడుతుందన్నారు. కచ్చితంగా తెలంగాణకు బీఆర్ఎస్ శ్రీరామరక్షగా నిలుస్తుందని స్పష్టం కేటీఆర్ చేశారు.**

## వినాయకుని సేవలో స్పీకర్ గడ్డం ప్రసాద్



**విశ్వంభర,వికారాబాద్ :** జిల్లా కేంద్రంలోని చౌదరి కాలనీ, రాజీవ్ గృహకల్ప, రామయ్యగూడ, శివ రాంనగర్ కాలనీ, న్యూ గంజ్ హనుమాన్ దేవాలయం, న్యూ గంజ్ శివాలయం, అలంపల్లి అనంత పద్మనాభ దేవాలయం, కొత్తగూడ హనుమాన్ దేవాలయాల సమీపంలోని వినాయక మండపాలను సందర్శించి గణనాథులను సోమవారం తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. మండపాల వద్ద ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంజుల రమేశ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అర్థ సుధాకర్ రెడ్డి, పట్టణ మహిళా అధ్యక్షురాలు పల్లవి శివానందం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు,యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మైసిగండి వినాయకుని లడ్డు రూ.3 లక్షల 50 వేలు



**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ మండలం మైసిగడ్డి గ్రామంలో ఘనంగా గణేష్ నిమజ్జనం జరిగింది. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ సెక్రటరీ చల్లా వంశీ చంద్ రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి, పీసీసీ కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మైసగంటి దేవస్థానం వద్ద నిలపిన భారీ గణనాథుని వద్ద జటావత్ రమేష్ మూడు లక్షల 50 వేల రూపాయలకు లడ్డూను వేలంలో దక్కించుకున్నారు. మైసమ్మ ఆలయం వద్ద ఒక లక్ష ఇరవై వేలు రామావత్ కళ్యాణ్, హనుమాన్ ఆలయం వద్ద 1,11,000 రాజారాం నాయక్, ముత్యాలమ్మ ఆలయం వద్ద ఒక లక్ష ఇరవై ఒక్క వేలు శంకర్ వేలంలో లడ్డులను దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తులసీరాం నాయక్, మండల అధ్యక్షుడు బిచ్చ నాయక్, గూడూరు శ్రీనివాస్ రెడ్డి, నరసింహ, గుజ్జల మహేష్ ఆయా కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

## విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జనం



**విశ్వంభర, కామారెడ్డి :** కామారెడ్డి పట్టణంలోని అతి వైభవంగా జరిగే గణేష్ నవరాత్రులు సోమవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జనం కు వెళ్లే గణపతులను సత్కరించడం జరిగింది. ఆయా సంఘాల ప్రెసిడెంట్లకు శాలువాలతో సన్మానం చేశారు. సోమవారం రాత్రి 10 గంటలకు ప్రారంభమైన గణేష్ నిమజ్జనం యాత్ర మంగళవారం రాత్రి 10 గంటల వరకు 24 గంటలు కామారెడ్డి పట్టణంలోని అతివేభవంగా దీనిని జిల్లా కలెక్టర్ అశోక్ సింగ్వాన్, జిల్లా ఎస్పీ సింధు శర్మ, మున్సిపల్ చైర్పర్సన్ ఇందుప్రియ పాల్గొని జండా ఊపి నిమజ్జరం ర్యాలీని ప్రారంభించారు. అతివైభవంగా హిందువులు గణేష్ ఉత్సవాలు హైదరాబాద్ తర్వాత కామారెడ్డి లో నిర్వహించడం జరుగుతుంది. నిమజ్జనం శాంతియుతంగా నిర్వహించడం కోసం జిల్లా ఎస్పీ సింధు శర్మ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రం రాంనగర్ కాలనీలో గణపతి నవరాత్రోత్సవ వేడుకలలో భాగంగా సోమవారం సాయంత్రం జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొని గణపతిని దర్శించుకున్న చౌటుప్పల్ ఏసీపీ పటోళ్ళ మధుసూదన్ రెడ్డి , రామన్నపేట సర్కిల్ సీఐ వెంకటేశ్వర్లు , మోత్కూరు ఎస్సై డి నాగరాజు , మరియు ఉత్సవ కమిటీ సభ్యులు దొంతరబోయిన భాస్కర్, మురళీకృష్ణ , జెట్ట కార్తీక్.

- విశ్వంభర, ఆత్మకూరు(ఎం)



భూపాలపల్లి జిల్లా కాలేశ్వరం లో అంతర్ రాష్ట్ర వంతెన వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ కిరణ్ ఖరె.

- విశ్వంభర, భూపాలపల్లి

## మా సొసైటీకి భూమి అప్పగించడాన్ని
# రాజకీయం చేయొద్దు

- వెయ్యి మంది జర్నలిస్టులు అప్పటి మార్కెట్ విలువ ప్రకారం రూ.2లక్షలు చెల్లించాం
- సుప్రీం కోర్టు ఆదేశించినా గత ప్రభుత్వాలు మాకు భూమిని కేటాయించలేదు
- సీఎం రేవంత్ రెడ్డి సుప్రీం ఆదేశాలను అమలు చేశారు
- జర్నలిస్టులను విభజించే ప్రయత్నాలను ఖండిస్తున్నాం
- జెఎన్ జె ఎంఏసీ హౌసింగ్ సొసైటీ సభ్యులు

**విశ్వంభర, హైదరాబాద్:** జెఎన్ జె ఎంఏసీ హౌసింగ్ సొసైటీ సభ్యులకు ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూమిని అప్పగించడాన్ని రాజకీయం చేస్తూ స్వయం ప్రకటిత సోషల్ మీడియా జర్నలిస్టుల వర్గం చేస్తున్న ప్రచారం వల్ల మేము తీవ్ర మనోవేదనకు గురవుతున్నామని సొసైటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మా సభ్యులకు స్థలాల కేటాయింపును అడ్డుకుంటామని వారు జారీ చేసిన బెదిరింపులను మేము ఖండిస్తున్నామన్నారు. మా సొసైటీ గురించి తప్పుడు సమాచారం ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.. మేము భూమి కేటాయింపు గురించి కొన్ని వాస్తవాలను అందించాలనుకుంటున్నామని సొసైటీ సభ్యులు తెలిపారు.

1960ల నుంచి వచ్చిన ప్రభుత్వాలు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కోసం భూమిని కేటాయించాయి. డాక్టర్ వై ఎస్ రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం 2008లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో JNJ MAC హౌసింగ్ సొసైటీకి 70 ఎకరాలు కేటాయించింది. సొసైటీలో ప్రింట్ ,ఎలక్ట్రానిక్ మీడియా (ప్రెస్ ఫోటోగ్రాఫర్‌లు మరియు వీడియోగ్రాఫర్‌లతో సహా) సొసైటీకి కనీసం ఐదేళ్ల అనుభవం ఉన్న 1000 మంది జర్నలిస్టులు ఉన్నారు. తీవ్రమైన ఆర్థిక సంక్షోభం ఉన్నప్పటికీ సభ్యులు ఒక్కొక్కరికి రూ. 2 లక్షలు సమీకరించాం. అప్పటి మార్కెట్ విలువ ప్రకారం రూ. 12.33 కోట్లను 2011లో రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాం. సుప్రీంకోర్టు 2017లో సొసైటీకి భూమిని అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. కె చంద్రశేఖర్ రావు నేతృత్వంలోని ప్రభుత్వం 2018లో 32 ఎకరాలను సొసైటీకి అప్పగించారు. మళ్లీ 2022లో మిగిలిన 38 ఎకరాలను అప్పగించాలని ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వీ రమణతో కూడిన ఎస్సీ ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

సీఎం ఎ రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం 2024 లో మా సొసైటీకి మిగిలిన 38 ఎకరాలను అప్పగించింది, సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేస్తానని ఇచ్చిన ఎన్నికల హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చింది.కోర్టు తీర్పు ఆలస్యం కావడంతో సభ్యులు ఈ రుణాలపై భారీ వడ్డీ చెల్లించారు. డెబ్బై మంది సభ్యులు మరణించారు, వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో వీధిన పడ్డాయి. కోవిడ్ మహమ్మారి తరువాత చాలా మంది ఉద్యోగాలు కోల్పోయారు.ప్రస్తుత ప్రభుత్వం సొసైటీకి అవాంఛనీయ ప్రయోజనాలను అందించిందని తప్పుడు సమాచారం ప్రచారం చేయడం సరికాదు. మేము మొత్తం మార్కెట్ విలువను 2011లో చెల్లించాం. 16 ఏళ్లు అవిశ్రాంతంగా న్యాయ పోరాటం చేసాం. జర్నలిస్టులను ప్రాంతీయ ప్రాతిపదికన విభజించే దుర్మార్గపు ప్రయత్నాలను కూడా మేము తీవ్రంగా ఖండిస్తున్నాము.సామాజిక మాధ్యమాలలో సొసైటీకి వ్యతిరేకంగా విద్వేష ప్రచారాన్ని వ్యాప్తి చేస్తున్న కొన్ని రాజకీయ పార్టీల అనుచరులను అలా చేయకుండా నిరోధించవలసిందిగా మేము విజ్ఞప్తి చేస్తున్నాం. మేము దశాబ్దాలుగా ఆయా పార్టీ వ్యవహారాలు, రాజకీయ పరిణామాలను కవర్ చేస్తున్నాం. సభ్యులు తెలంగాణ కోసం ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాటానికి సహకరించారని కిరణ్ కుమార్ బి, ఆర్ రవికాంత్ రెడ్డి, ఎన్ వంశీ శ్రీనివాస్, పీవీ రమణారావు, కే అశోక్ రెడ్డి అన్నారు.

## నేడే బాలాపూర్ గణేశ్ లడ్డూవేలం..!

### రూ.30లక్షల మార్క్ దాటేనా..?



**విశ్వంభర, బాలాపూర్:** వినాయక చవితి వేడుకలు ముగింపు దశకు చేరుకున్నాయి. మంగళవారంతో నవరాత్రి వేడుకలు ముగియనున్నారు. ఇప్పటికే హైదరాబాద్ జంట నగరాల్లో వినాయక నిమజ్జనాలు కొనసాగుతున్నాయి. పలుచోట్ల వినాయక లడ్డూ వేలాల నిర్వహణ జరుగుతున్నాయి. లడ్డూవేలం అనగానే అందరికీ బాలాపూర్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఏయేడాది కాయేడు రికార్డు ధరల పలుకుతూ లడ్డూ ప్రసాదం రూ.వందల నుంచి రూ.లక్షలకు చేరింది. మంగళవారం ఉదయం 9.30 గంటలకు వేలం జరుగనుండగా.. ఈ సారి రికార్డు ధర రానున్నట్లు అంచనా. బాలాపూర్‌లో గణేషుడికి భారీ లడ్డూ నైవేద్యంగా పెట్టే సంప్రదాయం 1980లో మొదలైంది. లడ్డూవేలాన్ని తొలిసారిగా 1994లో నిర్వహించారు.

ఆ సమయంలో రూ.450 ధర పలికింది. చివరి ఏడాది రికార్డు స్థాయిలో రూ.27లక్షలకు పెరిగింది. బాలాపూర్ లడ్డూ బరువు 21 కిలోలు. తాజాగా లడ్డూకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని తొలిసారిగా నిర్వాహకులు వేలంలో కొత్త నిబంధనను తీసుకువచ్చారు. లడ్డూ వేలంలో పాల్గొనే ఆసక్తి ఉన్నవారు ముందస్తుగా డబ్బును డిపాజిట్ చేయాలని నిబంధనను తెచ్చారు. ఈ సారి అయోధ్య రామమందిరం నమూనాలో ఏర్పాటు చేసిన మండపంలో బాలాపూర్ గణపతి కొలువుదీరి పూజలందుకుంటున్నారు. మంగళవారం చివరి పూజ అనంతరం బాలాపూర్ బొడ్రాయి దగ్గర వేలంపాటను బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితి నిర్వహించనున్నది. లడ్డూ వేలం ద్వారా వచ్చిన మొత్తాన్ని అభివృద్ధి పనులకు వినియోగించనున్నారు.

**బాలాపూర్ లడ్డువేలం ఇలా..**

1994లో తొలిసారిగా లడ్డువేలం జరిగింది. రూ.450కి కొలను మోహన్‌రెడ్డి అనే వ్యక్తి లడ్డూను వేలంలో దక్కించుకున్నారు. ఆ తర్వాత ఆయనే రూ.4500కి వేలంపాడారు. 1996లో నాలుగు రెట్లు పెరిగి రూ.18వేలకు చేరింది. 1998 వేలంలో లడ్డూ రూ.50 వేలు మార్క్‌ని దాటింది. కొలను మోహన్ రెడ్డి రూ.51 వేలకు లడ్డూ సొంతం చేసుకున్నారు. 2001లో బాలాపూర్ లడ్డూ రూ.లక్ష దాటింది. కందాడ మాధవరెడ్డి రూ.1.05 లక్షలకు వేలంలో దక్కించుకున్నారు. 2007లో లడ్డూ రూ.5లక్షల మార్క్ చేరింది. కొలను మోహన్ రెడ్డి రూ.5.07 లక్షలకు వేలంలో లడ్డూ దక్కించుకున్నారు. 2014లో ఏకంగా రూ.10లక్షలకు చేరింది. ఆ ఏడాది కళ్లెం మదన్ మోహన్ రెడ్డి రూ.10.32లక్షలకు దక్కించుకున్నారు. 2015లో స్కైలాబ్ రెడ్డి రూ.14.65 లక్షలకు, 2016లో నాగం తిరుపతి రెడ్డికి రూ.15.60 లక్షలకు వేలం పాడారు. 2022లో రికార్డు స్థాయిలో రూ.20 లక్షలు దాటింది. 2022లో వంగేటి లక్ష్మారెడ్డి వేలంపాటలో రూ.24.60లక్షలకు వేలంలో దక్కించుకున్నారు. ఇక చివరిసారిగా 2023లో దాసరి దయానంద్ రెడ్డి రూ.27 లక్షలకు దక్కించుకున్నారు. ఈ సారి రూ. 30లక్షలు దాటుతుందని అంచనా వేస్తున్నారు.

## రాజీవ్ గాంధీని కూడా అవమానించాడు రేవంత్

### ఎర్రోళ్ల శ్రీనివాస్



**విశ్వంభర, హైదరాబాద్ :** ప్రజల మనోభావాలకు విరుద్ధంగా సచివాలయం ముందు విగ్రహాన్ని ఏర్పాటు చేసి పరోక్షంగా రాజీవ్ గాంధీని కూడా అవమానించాడు రేవంత్ రెడ్డి అని బీఆర్ఎస్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్ మండిపడ్డారు. తన అహంకారం కోసం, తన రాజకీయ ప్రభావం కోసం, పార్టీలో ప్రతిష్ట పెంచుకోవడం కోసం, అధిష్టానం అడుగులకుమడుగులోత్తుతూ తెలంగాణ అస్తిత్వాన్ని రేవంత్ రెడ్డి ఢిల్లీకి తాకట్టు పెట్టాడని శ్రీనివాస్ నిప్పులు చెరిగారు.సోనియా గాంధీని బలిదేవత అని తిట్టిన ముఖ్యమంత్రి.. ఈ రోజు పార్టీ మెప్పుకోసం విగ్రహాలు ఏర్పాటు చేసే చౌకబారు ఎత్తుగడవేశారని ఎర్రోళ్ల శ్రీనివాస్ ధ్వజమెత్తారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని మేము ఏర్పాటు చేయలేదు అంటున్నావ్ ముఖ్యమంత్రి..! తెలంగాణ తల్లి స్వరాష్ట్ర ఉద్యమం నుంచి ఉబికి వచ్చిన ఉద్యమ ప్రతీక. ప్రతి గ్రామంలో, ప్రతి చౌరస్తాలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్టించాం. ఉమ్మడి రాజధాని కాలం ముగిసిన సందర్భంగా తెలంగాణ సచివాలయం ముందు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఘనంగా ప్రతిష్టించాలి అనుకున్నామని శ్రీనివాస్ తెలిపారు.మే 30, 2023 నాడు సీఎం హోదాలో కేసీఆర్ తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలిసి సందర్శించి, సమీక్షించి స్థలాన్ని కేటాయించామని శ్రీనివాస్ గుర్తు చేశారు. ఒకవైపు అంబేద్కర్ విగ్రహం, మరోవైపు అమరుల స్తూపం, సచివాలయం ఎదురుగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసి అపురూప దృశ్యాన్ని ఆవిష్కరించాలనుకున్నాం. కానీ, తెలంగాణ ఉద్యమంతో, చరిత్రతో, సంస్కృతితో ఎలాంటి సంబంధంలేని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని అక్కడ పెట్టి నువ్వు మరోసారి తెలంగాణ ప్రజల ఆత్మాభిమానంపై దెబ్బ కొట్టావు. ఎవరెన్ని చెప్పినా సచివాలయం ముందు రాజీవ్ గాంధీ విగ్రహం అసంబద్ధంగానూ, తెలంగాణ ప్రజల కళ్ళలో నలుసు మాదిరిగానూ మిగిలిపోతుందని ఎర్రోళ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు.

## గణేష్ నిమజ్జనం ప్రక్రియ పరిశీలించిన ఎస్పీ సన్ ప్రీత్ సింగ్



**విశ్వంభర, సూర్యాపేట:** సూర్యాపేట జిల్లా కేంద్రంలో సద్దుల చెరువు మినీ ట్యాంక్ బండ్ వద్ద గణేష్ నిమర్జనం ప్రక్రియను పరిశీలించిన జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ బందోబస్తు పరిశీలించారు. ఇబ్బందులు లేకుండా పర్యవేక్షణ చేయాలని అధికారులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా నిమర్జనం ప్రక్రియ జరుగుతున్నది, సిబ్బంది అందరూ అప్రమత్తంగా పని చేస్తున్నారు అన్నారు. భక్తులు, ఉత్సవ కమిటీలు శోభాయాత్ర సమయంలో నిమర్జనం సమయంలో అప్రమత్తంగా ఉండాలి అని కోరారు. ఎస్పీ వెంట అదనపు జానార్ధన్ రెడ్డి, డీఎస్పీ రవి, మున్సిపల్ కమీషనర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ వీర రాఘవులు, సూర్యాపేట పట్టణ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, పోలీసు, మున్సిపల్ అధికారులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మా హనుమాన్ నగర్ కమిటీ సభ్యులు ముఖ్య అతిథులు ఏలేటి ప్రవీణ్ రెడ్డి, వీరా రెడ్డి, బంగారు శ్రీధర్, గుర్లింగం, శంకరాచారి, సతీష్, వెంకటేశ్వర్లు , విజయ్, గోవర్ధన్ చారి, రవీంద్ర చారి, గోపాల్ రెడ్డి, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ తల్లి ఆలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే

**విశ్వంభర, డిండి:** డిండి మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో నిర్వహించిన పెద్దమ్మ తల్లి పండుగ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై, పెద్దమ్మ తల్లి ఆలయాన్ని సందర్శించి, అమ్మవారిని దర్శించుకున్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అనంతరం గ్రామస్తులు మరియు ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. పెద్దమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లపుడూ ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సీరాజ్ ఖాన్, మండల పార్టీ అధ్యక్షులు రాజేష్ రెడ్డి, మండల బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర్ రావు, మాజి మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటయ్య, మాజి ఎంపీపీ గోవింద్ యాదవ్, కర్ణకార్, వెంకట్ రెడ్డి, అంతిరెడ్డి, వెంకటయ్య, శ్రీనివాస్ రెడ్డి, యువజన విభాగ నాయకులు సాయి రాథోడ్, సుభాష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



## ఎత్తిపోతల ప్రాజెక్టును ప్రారంభించాలి

### మాజీ మంత్రి నాగం




**విశ్వంభర, నాగర్‌కర్నూల్ :** పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకంపనులను వెంటనే ప్రారంభించి సీఎం రేవంత్ రెడ్డి జిల్లాపై ఉన్న ప్రేమను నిరూపించుకోవాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు డాక్టర్ నాగం జనార్దన్ రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కుమ్మెర వద్ద వట్టెం పంపు హౌస్ మునిగిపోవడం వంద శాతం ప్రభుత్వం నిర్లక్ష్యమని, ప్రజలు చెప్పినా అధికా రులు పట్టించుకోలేదని విమర్శించారు.పెద్ద మోగర్లతో నీళ్లను తోడి మునిగిన మోగర్లను బయటకు తీయాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి పేరొస్తుం దని సీఎం రేవంత్ రెడ్డిప్రాజెక్టును పట్టించుకోవడం లేదని విమర్శించారు. త్వరలో తాను ప్రాజెక్టును సందర్శిస్తానని అన్నారు. హైడ్రాతో పేదలకు నష్టం కలిగించడం సరికాదన్నారు. కేటీఆర్ తనను మర్యాదపూర్వకంగా మాత్రమే కలిశారని స్పష్టం చేశారు.

## నిండు కుండలా మానేరు డ్యాం..

### రెండు గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల



**విశ్వంభర, కరీంనగర్ :** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కరీంనగర్ లోనిలోయర్ మానేర్ డ్యామ్ జలకళ సంతరించుకున్నది. వర్షాల కారణంగా ప్రాజెక్టుకు విపరీతమైన ఇన్‌ఫ్లోలు వస్తున్నందున ఎల్ఎమ్‌డీ నీటి నిల్వ సామర్థ్యం 24 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం 23 టీఎంసీలకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం ఇంజినీరింగ్ అధికారులు రెండు గేట్లు ఎత్తి మూడు వేల క్యూసెక్కుల నీటిని మానేరు వాగులోకి వదిలారు. మిడ్ మానేరు నుంచి వచ్చే ఇన్ ఫ్లో స్థాయిని బట్టి గేట్లు మూసివేసే అవకాశం ఉంది.సాయంత్రం లేదా రాత్రి క్లోజ్ చేసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కాగా, లోయర్ మానేరులో నీటిని చూసి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మానేరు నది పరివాహక ప్రాంతాల్లోని గ్రామాలలో నివసించే ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. మత్స్యకారులు, గొర్రెల కాపరులు, రైతులు నది దగ్గరకు వెళ్లవద్దని సూచించారు.

## లక్ష్మీనారాయణ చెరువులో నిమజ్జనం

**విశ్వంభర, ఘట్కేసర్:** ఘట్కేసర్ మున్సిపాలిటీ ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువులో గణపతి నిమజ్జనాలు సాగుతున్నాయి. రెండు భారీ క్రేన్లను ఏర్పాటు చేసి నిమజ్జనాలు నిర్వహిస్తున్నారు. ఎదులాబాద్ చెరువు నిండుకుండను తలపిస్తోంది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్, సివిల్ పోలీసులు కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు. సేఫ్టీ నిమిత్తం, చిన్నపిల్లలను అటువైపు అనుమతించడం లేదు.

## నేత్రపర్వంగా పద్మావతి అమ్మవారి ఆలయంలో పవిత్రోత్సవాలు

**విశ్వంభర, తిరుచానూరు:** పద్మావతి అమ్మవారి ఆలయంలో పవిత్రోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మొదటిరోజు పద్మావతి అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లను ఆలయం నుంచి యాగశాలకు వేంచేపు చేశారు. అనంతరం ద్వారతోరణ ధ్వజకుంభ ఆవాహనం, చక్రాధి మండలపూజ, చతుస్థానార్చన, అగ్నిప్రతిష్ఠ, పవిత్రప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం శ్రీకృష్ణస్వామి మండపంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. పసుపు, చందనం, పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లతో, వివిధ రకాల ఫలాలతో అభిషేకం చేశారు. అనంతరం అమ్మవారికి విశేషంగా అలంకారం చేశారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటి ఈఓ గోవింద రాజన్, ఏఈవో రమేష్, ఆలయ అర్చకులు బాబు స్వామి, సూపరింటెండెంట్ శేషగిరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు సుభాష్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.



# విలీనమా? విమోచనమా? విద్రోహమా?

## సెప్టెంబర్ 17పై భిన్నాభిప్రాయాలు..



సెప్టెంబర్ 17.. 1948.. తెలంగాణ ప్రజల బతుకును మార్చిన తేదీ ఇది. తెలంగాణ రాజకీయాల్లో ఈ తేదీకి ప్రాముఖ్యత ఎక్కువ. అందుకే సెప్టెంబర్ 17 వచ్చిందంటే.. రాజకీయ పార్టీలు ఎప్పుడూ లేని విధంగా యాక్టివ్ అవుతాయి. గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. సెప్టెంబర్ 17పై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశాయి. ఒక పార్టీ విలీనం అంటే.. మరో పార్టీ విమోచనం అని.. ఇంకో పార్టీ విద్రోహం అని సెప్టెంబర్ 17వ తేదీకి రాజకీయ రంగు పులుముతున్నాయి. భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయి. దీంతో అసలు సెప్టెంబర్ 17పై రాజకీయ పార్టీలు ఎందుకు ఇలా వ్యవహరిస్తున్నాయి అనే చర్చ జరుగుతోంది. దీంతో అసలు సెప్టెంబర్ 17వ తేదీని ఏమని జరుపుకోవాలనే చర్చ తెరపైకి వస్తోంది.

**స్వాతంత్ర్యం వచ్చినా నిజాం పాలనలోనే..**

1947, ఆగస్టు 15న బ్రిటీషు పాలన నుంచి భారత దేశానికి స్వాతంత్య్రం వచ్చినా.. తెలంగాణ స్టేట్ మాత్రం నిజాం పాలనలోనే ఉండిపోయింది. తాము స్వతంత్ర దేశంగానే కొనసాగుతామని కామన్‌వెల్త్ దేశాలకు ప్రతిపాదన పెట్టారు నిజాం. యూరోపియన్ దేశాలతో వ్యాపార సంబంధాల కోసం గోవాను లీజుకు తీసుకోడానికి పోర్చుగీసుతో ప్రయత్నాలు జరిపారు. హైదరాబాద్‌ను విలీనం చేయడానికి చర్చల మార్గాన్ని అనుసరించాలనే ప్రతిపాదన చేశారు ప్రధాని నెహ్రూ. చివరి ప్రయత్నంగా మాత్రమే సైనిక చర్యలు ఉండాలన్నారు. భారత ప్రభుత్వం, హైదరాబాద్ రాష్ట్రం మధ్య 1947లో 'స్టాండ్‌స్టిల్ ఒప్పందం' జరిగింది. ఏడాది కాలం పాటు ఎలాంటి మిలిటరీ చర్యలు లేకుండా యథాతథ స్థితి కొనసాగాలన్నది ఆ ఒప్పందం. అయితే నిజాం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా రజాకార్లు భారీ ర్యాలీ నిర్వహించారు. తర్వాత రజకార్ల ఆగడాలు పెరిగిపోయాయి. ప్రైవేట్ సైన్యం బరి తెగించింది. రజాకార్లకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటం జరిగింది. గ్రామాల్లో రైతుల సాయుధ దాడులకు దిగారు. దీంతో ఇరువైపులా ప్రాణనష్టం జరిగింది. మరోవైపు ఇయాక్ ఆలీ, ఖాసీం రజ్వీలు నిజాం నవాబుకు తెలియకుండానే ఫర్మానాలు జారీచేస్తూ సొంత నిర్ణయాలు తీసుకున్నారు. పరిస్థితి చేయి దాటడంతో భారత ప్రభుత్వం రంగంలోకి దిగాల్సి వచ్చింది.

**నిజాం సైన్యం, రజాకారులు, కమ్యూనిస్టులు ఏకమై భారత ప్రభుత్వంపై తిరుగుబాటు..**

1950లో భారత రాజ్యాంగం వచ్చాక ఆర్టికల్ 356 అమలులోకి వచ్చింది. కానీ, అంతకు ముందే ఆర్టికల్ 356 (సెక్షన్ 93 భారత రాజ్యాంగం- 1935 ) అమలు చేసి 1948 నుంచి 1952 వరకు హైదరాబాద్ రాజ్యంలో మిలిటరీ పాలన అమలు చేశారు. హైదరాబాద్ రాజ్యాన్ని కాపాడుకునేందుకు నిజాం సైన్యం, రజాకారులు, కమ్యూనిస్టులు ఏకమై భారత ప్రభుత్వంపై తిరుగుబాటు చేశాయి. దీనిని అనుసరించే తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రొఫెసర్ జయశంకర్ 'ఆర్ఎస్ఎస్ నుంచి ఆర్ఎస్యూ వరకు ఏకం కావాలి' అనే నినాదాన్ని ఎత్తుకున్నారు. హైదరాబాద్ రాజ్యం నిధులను భారత్ మొదటి,. రెండవ ప్లానింగ్ కమిషన్‌కు కేటాయించారు. భారత్- చైనా, భారత్-పాకిస్తాన్ యుద్ధ సమయంలోనూ ఈ నిధులను వాడుకున్నారు. హైదరాబాద్ కరెన్సీని భారత కరెన్సీగా మార్చటానికి 1948 నుంచి 1956 వరకు అంటే దాదాపు ఎనిమిది సంవత్సరాల సమయం పట్టింది. ఇక్కడ పనిచేసే 70 వేల మంది ఉద్యోగులను తొలగించి తమకు అనుకూలంగా ఉన్న మద్రాస్, బాంబే, కర్ణాటక నుంచి ఉద్యోగులను తెచ్చుకున్నారు. భారత ఆర్మీ హైదరాబాద్‌ను ఆక్రమించుకునేటపుడు ఏం జరిగింది? ఎంత ప్రాణ నష్టం జరిగింది? తెలుసుకోవడానికి నెహ్రూ సుందర్ లాల్ కమిటీనీ నియమించారు. 20 నుంచి 40 వేల మందిని చంపేశారని కమిటీ నివేదించింది. ఈ నివేదికను 2014లో బీబీసీ బహిర్గతం చేసింది. ఇదంతా తెలియని రాజకీయ పార్టీలు చరిత్రను వక్రీకరించే పనిలో పడ్డాయి. చరిత్రను సరిగా చదివితే ఇది విలీనమా? విమోచనమా? విద్రోహమా? దురాక్రమణనా? అనేది తెలుస్తుంది. గత తెలంగాణ ప్రభుత్వం రాజకీయ యుద్ధ వాతావరణంలో సమైక్యతా దినోత్సవమని ప్రకటించింది.

అంటే తెలంగాణ ప్రజలకు నిజమైన స్వాతంత్య్రం సెప్టెంబర్ 17న వచ్చిందన్న మాట. అయితే సంబరాలు చేసుకోవాల్సిన సెప్టెంబర్ 17 చుట్టూ తెలంగాణలో వివాదాలు అలుముకున్నాయి. సెప్టెంబర్ 17 రాజకీయ చక్రబంధంలో చిక్కుకుంది. 75 ఏళ్లు గడిచినా ఈ వివాదం మాత్రం చల్లారడం లేదు. ప్రతి ఏటా సెప్టెంబర్ న రచ్చే. సెప్టెంబర్ 17ను ఒక్కో పార్టీ ఒక్కోలా వేడుకలు నిర్వహిస్తోంది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని జరుపుతోంది. కాంగ్రెస్ పార్టీ విలీన దినోత్సవం జరుపుతుండగా.. వామపక్షాలు మాత్రం విద్రోహ దినంగా పాటిస్తున్నాయి. దీంతో అసలు సెప్టెంబర్ 17న ఏం జరిగింది.. హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం అయ్యిందా లేక తెలంగాణ ప్రజలకు సైనిక చర్యతో విమోచనం లభించిందా? లేక వామపక్షాలు చెబుతున్నట్లు విద్రోహం జరిగిందా? .. ఇవన్ని ప్రశ్నలే. నిజాం రాజు పాలన ఎలా ముగిసింది.. తెలంగాణ సాయుధ పోరాటం లక్ష్యమేంటి? హైదరాబాద్‌పై పోలీస్ యాక్షన్ ఎలా జరిగింది.?తెలంగాణ స్టేట్ ఇండియన్ యూనియన్‌లో కలవడంలో నెహ్రూ- పటేల్ పాత్ర ఎంత?. అసలు సెప్టెంబర్ 17న ఏంజరిగింది? అనే దానిపై భిన్న వాదనలున్నాయి...

సెప్టెంబర్ 17పై ఎవరికి వారు తమ వాదనకు బలం చేకూరేలా వ్యాఖ్యలు చేస్తున్నారు. 1948 సెప్టెంబర్17న సైనిక చర్యతో నిజాం రాజు పాలన నుంచి తెలంగాణా ప్రజలకు విముక్తి వచ్చిందన్నది నిజం. భారత ప్రభుత్వానికి లొంగిపోయాడు కాబట్టి తెలంగాణా స్టేట్ ఇండియన్ యూనియన్ లో విలీనమైందని కొందరి వాదన. ఈ వాదన చేసేవాళ్లంతా సెప్టెంబర్ 17ను విలీన దినోత్సవంగా జరపాలంటున్నారు. అయితే సెప్టెంబర్ 17న తెలంగాణా పూర్తిగా భారతదేశంలో విలీనం కాలేదు. సాంకేతికంగా 1950 జనవరి 26న రాజ్యాంగం అమలులోకి వచ్చేవరకు తెలంగాణా స్టేట్ నిజాం పాలనలోనే ఉంది. నిజాం ఉన్నా పౌరప్రభుత్వం ఏర్పాటు నుంచి సైనిక శక్తి అంతా భారత ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్లిపోయింది. దీంతో నిజాం నిరంకుశ పాలన, నరరూప రాక్షసుడైన ఖాసీం రజ్వీ వంటి రజాకార్ల తెలంగాణా ప్రజలు విముక్తి పొందారు కాబట్టి సెప్టెంబర్ 17ను విమోచన దినంగా పాటించాలని మరికొందరి వాదన.

**పరివర్తన ప్రక్రియ మొదలైన దినంగా భావించడం సమంజసం.**

స్వాతంత్య్ర ప్రకటనకు చాలా కాలం ముందు నుంచే అంటే 1944 నుంచి ముఖ్యంగా 1946 నుంచే ఇక్కడ భూస్వామ్య వ్యతిరేక, కమ్యూనిస్టు పోరాటం జరుగుతున్నది.నిజాం రాష్ట్ర విలీనం కోసం వచ్చిన కేంద్ర సైన్యం నిజాం లొంగి పోగానే వెనక్కి వెళ్లకుండా 1951 దాకా ఎందుకున్నది? కమ్యూనిస్టులను అణచడానికేనని, అసలు ఆ హిడెన్ ఎజెండాతోనే సైన్యం వచ్చిందని కాబట్టి అది విద్రోహ దినమని కమ్యూనిస్టులు అన్నారు.అప్పటికి బీజేపీగానీ దాని పూర్వరూపమైన జనసంఘ్ గానీ ఉనికిలో లేదు. దాని మాతృ సంస్థ అయిన ఆర్ఎస్ఎస్ అప్పటికే ఏర్పడినా అది మహారాష్ట్ర, ఉత్తర భారతంలోనే ఉంది గానీ తెలంగాణాలో లేదు. హిందూ మహాసభ, ఆర్య సమాజం వంటి సంస్థలలో ఆ భావజాలం కలిగిన వాళ్లు బీజ రూపంలో ఉన్నప్పటికీ ఇప్పటిలాగా సంఘటితంగా లేరు. మరి భూస్వామ్య వ్యతిరేక పోరాటంలోగానీ, రజాకార్ వ్యతిరేక పోరాటంలోగానీ లేని పార్టీ సెప్టెంబర్ 17 గురించి ఎందుకు మాట్లాడుతున్నది?రజాకార్ల సంస్థ అధ్యక్షుడు నవాబ్ బహదూర్ యార్ జంగ్ 'నేను పాలకుణ్ని' (అనల్ మాలిక్) అని ప్రతిపాదించింది నిజమే. హైదరాబాద్ రాష్ట్రాన్ని ముస్లింల స్వతంత్ర రాజ్యంగా నిలపాలని రజాకార్లు భావించింది నిజమే. వాళ్ల దౌర్జన్యాలు నిజమే. ఉస్మానలీ ఖాన్ ముస్లిం కావడమూ నిజమే. ఏదో మేరకు ఆయనకు రజాకార్ల భావాలుండడమూ నిజమే.కానీ, ఆయననుగానీ, రజాకార్లనుగానీ ముస్లిలందరికి ప్రతినిధులుగా భావించడం సమంజసమేనా? అట్లా భావించే బీజేపీ వాళ్లు ఆ రోజును ముస్లింల నుంచి విమోచన దినం అంటున్నారు. మతం రంగును పులుముతున్నారు. అయితే, ముస్లింలలో చాలామంది రజాకార్ల దుశ్చర్యలను ఖండించారు. అబిద్ హుస్సేన్, సప్రానిలాంటి ముస్లింలు సుభాష్ చంద్రబోస్ స్థాపించిన ఆజాద్ హింద్ ఫౌజ్‌లో చేరి జాతీయోద్యమంలో భాగమయ్యారు. షోయబుల్లాఖాన్ రజాకార్ల దుశ్చర్యలను ఖండించి హత్యకు గురయ్యాడు. బాకర్ అలీ మీర్జా, ముల్లా అబ్దుల్ బాసిత్, ఫరీద్ మీర్జా, నవాబ్ మంజూర్ జంగ్, నవాబ్ అహ్మద్ మీర్జా, మహ్మద్ హుస్సేన్ జాఫ్రీ, అబ్దుల్ మునీమ్‌లాంటి వాళ్లు రజాకార్ల దౌర్జన్యాలను ఖండించారు. మరికొందరు ఉస్మానలీఖాన్‌ను లొంగిపోవాలని కోరారు.కాబట్టి నిజాం, హరిసింగ్‌లాగే ఒక రాజు. ఆయన నుంచి విముక్తి ముస్లింల నుంచి విముక్తి కాదు. ఫ్యూడల్ వ్యవస్థ నుంచి రాచరిక వ్యవస్థ నుంచి విముక్తిగా భావించడమే సమంజసం.కమ్యూనిస్టులు జరిపిన సాయుధ రైతాంగ పోరాటం విజయవంతమై సోషలిస్టు రాజ్యం ఏర్పడాలని కాంక్షించారు. దాన్ని కేంద్ర సైన్యం అడ్డుకుంది కాబట్టి ఆ రోజును విద్రోహ దినం అన్నారు. అప్పటికి సోషలిస్ట్ వ్యవస్థ సాధ్యమయ్యే పనికాదు.అందువల్ల ఆ రోజును విమోచన దినమని, విద్రోహ దినమని భావించడం సమంజసంగా అనిపించడం లేదు. భూస్వామ్య వ్యవస్థ నుంచి పెట్టుబడిదారీ వ్యవస్థలోకి రాచరిక వ్యవస్థ నుంచి ప్రజాస్వామిక వ్యవస్థలోకి పరివర్తన ప్రక్రియ మొదలైన దినంగా భావించడం సమంజసం.



### మిలిటరీ యాక్షన్ తో లొంగిపోయిన నిజాం..

అప్పటి హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ చొరవ తీసుకుని మిలిటరీ యాక్షన్ మొదలుపెట్టారు. అప్పటి మేజర్ జనరల్ జేఎన్ చౌదురి పక్కా ప్లాన్ రూపొందించారు. సెప్టెంబరు 13న ఆపరషన్ పోలో మొదలైంది. భారత సైన్యం హైదరాబాద్ రాష్ట్రాన్ని ఒక్కోవైపు నుంచి చుట్టుముట్టింది. భారత సైన్యంతో గెలవడం సాధ్యం కాదనే భావించిన నిజాం రాజు.. తన ప్రధాని లియాక్ ఆలీని రాజీనామా చేయాలని ఆదేశించారు. కేబినెట్ ను రద్దు చేశారు. పటేల్ తరఫున భారత ఏజెంట్ కేఎం మున్షీకి ఇదే విషయాన్ని సెప్టెంబరు 17న నిజాం రాజు చెప్పారు. 1948 సెప్టెంబరు 17న నిజాం నవాబు సైన్యం భారత సైన్యానికి పరోక్షంగా లొంగిపోవడం, ప్రధాని సహా మొత్తం మంత్రివర్గం రద్దు కావడంతో భారత యూనియన్‌లో హైదరాబాద్ స్టేట్ లాంఛనంగా విలీనమైంది. డెక్కన్ రేడియోలో నిజాం నవాబు తన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఆ వెంటనే మేజర్ జనరల్ జేఎన్ చౌదురికి మిలిటరీ జనరల్‌గా బాధ్యతలు అప్పజెప్పారు. నిజాం నవాబును రాజ్‌ప్రముఖ్‌గా నియమించింది కేంద్ర ప్రభుత్వం. దాదాపు ఎనిమిది నెలల పాటు మిలిటరీ పాలనలో సాగిన హైదరాబాద్ రాష్ట్రానికి ఎన్నికలు లేకుండానే ఐసీఎస్ అధికారిగా ఉన్న వెల్లోడీని సీఎంగా నియమించింది. సీఎంగా వెల్లోడీ, రాజ్‌ప్రముఖ్‌గా నిజాం నవాబు 1950 జనవరి 26 వరకూ కొనసాగారు.

### చిచ్చుపెట్టిన బ్రిటీష్ ప్రభుత్వం..

**భారతదేశానికి స్వాతంత్ర్యం ఇచ్చిపోతూ బ్రిటీష్ ప్రభుత్వం ఒక చిచ్చుపెట్టిపోయింది. దేశంలో అప్పటికి నామమాత్ర స్వతంత్ర రాజ్యాలుగా ఉన్న సంస్థానాలకు ఆప్షన్లు ఇవ్వడమే ఆ చిచ్చు. ఆ సంస్థానాలు భారతదేశంలో కలవొచ్చు, పాకిస్తాన్‌లో కలవొచ్చు. స్వతంత్ర రాజ్యాలుగా ఉండవచ్చు అనేది ఆ ఆప్షన్లు.కేంద్ర ప్రభుత్వ చొరవ వల్ల వందలాది సంస్థానాలు భారతదేశంలో విలీనమయ్యాయి. రెండు రాజ్యాలు మాత్రం స్వతంత్ర రాజ్యాలుగా ఉంటామని అన్నాయి. అవి నిజాం రాష్ట్రం, కశ్మీర్. ముస్లింలు మెజారిటీగా ఉన్న కశ్మీర్ రాజ్యానికి హిందూవ్యక్తి హరి సింగ్ రాజు. తెలుగువారు మెజారిటీగా ఉన్న నిజాం రాష్ట్రానికి ముస్లిమైన ఉస్మానలీ ఖాన్ రాజు. కశ్మీర్ విషయంలో జరగని ఈ చర్చ నిజాం రాష్ట్రం విషయంలో ఎందుకు జరుగుతున్నదనేది గమనార్హం.**







**- డాక్టర్ కాచం సత్యనారాయణ**
**వీ3 న్యూస్, విశ్వంభర తెలుగు దిన పత్రిక చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్**

# వేడుకల్లో ఎవరి దారి వారిదే..




**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వంలో మొదటిసారిగా సెప్టెంబర్ 17 కార్యక్రమం జరగనుంది. దీంతో రేవంత్ సర్కార్ ఈ వేడుకను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం పేరిట నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో వేడుకలు నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, సాంస్కృతికశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తోపాటు రాష్ట్ర బీజేపీ నేతలు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌ను కూడా సీఎం రేవంత్ ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను వరుసగా మూడోసారి కూడా తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహిస్తోంది. పరేడ్ గ్రౌండ్ వేదికగా ఈ వేడుకలు నిర్వహించనుంది. కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు గజేంద్ర సింగ్ షెకవాత్, కిషన్ రెడ్డి, బండి సంజయ్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. అంతేకాదు ఈ వేడుకలకు సీఎం రేవంత్ రెడ్డిని కూడా ఆహ్వానించామని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను అత్యంత ప్రాధాన్యం కలిగిన రోజుగా గుర్తించి వేడుకను జరపడం సంతోషమేనని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. కానీ కేంద్రం నిర్వహిస్తున్న తెలంగాణ విమోచన దినోత్సవం పేరు మార్చడం సరికాదన్నారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రికి లేఖ రాశారు. " ప్రతిపాదిత ప్రజాపాలన దినోత్సవం వేడుకకు ఆహ్వానించినందుకు ధన్యవాదాలు. కానీ నిజాం ప్రైవేటు సైన్యమైన రజాకార్ల కిరాతక పాలన నుంచి హైదరాబాద్ ప్రాంతం స్వాతంత్ర్యం పొందేందుకు ఏళ్ల తరబడి పోరాటం జరిగింది. రజాకార్ల హింసల వల్ల వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ గడ్డపై పుట్టిన బిడ్డగా మీకు కూడా ఈ విషయం తెలుసు. వాళ్లందరి పోరాటాన్ని, త్యాగాలను స్మరించుకుంటూ.. ప్రస్తుత తరానికి వారి సాహసాలను తెలియజేసి జాతీయ భావనను కల్పించాలి. వేలాది మంది త్యాగాల వల్ల నిజాం పాలన నుంచి సికింద్రాబాద్ విముక్తి పొందగా.. దీనికి విమోచన దినోత్సవం అని కేంద్రం పేరు పెడితే దాన్ని మార్చడం సరికాదు. ఇది ప్రజల దృష్టిని మరల్చడమే అవుతుంది. తెలంగాణ చరిత్రను ప్రజల నుంచి దూరం చేసేందుకు జరుగుతున్న ప్రయత్నంలో తాను భాగస్వామ్యం కాలేనని" కిషన్ రెడ్డి లేఖలో తెలిపారు.

# హైదరాబాద్ పోలీసులకు బిగ్ డే!




విశ్వంభర, హైదరాబాద్: సెప్టెంబర్ 17 అంటే రాబోయే మంగళవారం హైదరాబాద్ పోలీసులకు పరీక్ష- గా మారనుంది. సెప్టెంబర్ 17న రాజకీయ పార్టీలు తెలంగాణ విమోచనం అని, విద్రోహం అని, విలీనం అని రకరకాల పేరుతో కార్యక్రమాలు చేస్తుంటే... ఈసారి ప్రభుత్వం అధికారికంగా ప్రజా పాలన దినో- త్సవం జరుపుతోంది. హైదరాబాద్ సహ అన్ని జిల్లాల్లో ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోంది. అదే రోజు బీజేపీ నేతృత్వంలో పరేడ్ గ్రౌండ్ లో సెప్టెంబర్ 17కు సంబంధించిన కార్యక్రమం ఉంది. ఇక పాత బస్తీలో మజ్లిస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీలు కూడా జరపబో- తున్నారు. మరోవైపు ఈసారి సెప్టెంబర్ 17నే హైద- రాబాద్ లో వినాయక నిమజ్జన కార్యక్రమం ఉంది. దాదాపు 25వేల మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. సిటీలో 15వేల మంది పోలీసులు, జిల్లాల నుండి మరో 10వేల మంది పోలీసులను కేటాయిం- చారు. మధ్యాహ్నం 1.30గంటల లోపు ఖైరతాబాద్ వినాయక నిమజ్జనం పూర్తయ్యేలా అధికారులు ని- ర్వాహకులతో చర్చలు జరిపారు. ఇక హుస్సేన్ సాగర్ వైపు వచ్చే మూడు కమిషనరేట్ల విగ్రహాలను వీలైనంత త్వరగా గంగమ్మ ఒడికి చేరేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఒకేరోజు ఇలా అన్ని కార్యక్రమాలు... పైగా అన్నీ హైదరాబాద్ లోనే ఉన్న నేపథ్యంలో తెలంగాణ పోలీసులకు పరీక్షగా తయారైంది. ముఖ్యంగా సిటీ పోలీసులు ఛాలెంజ్ గా తీసుకుంటున్నారు. ఏమాత్రం వైఫల్యం ఉన్నా మొత్తం డిపార్ట్మెంట్ కు, సీఎం వద్దే హోంశాఖ కూడా ఉన్న నేపథ్యంలో ఆయనకు చెడ్డ పేరు వస్తుందని... ఎట్టి పరిస్థితుల్లోనూ అలసత్వం వహించకూడదని పోలీస్ శాఖ నుండి ఆదేశాలు జారీ అయ్యాయి.

# లయన్స్ క్లబ్ సేవలు అమోఘం: సీఐ ప్రమోద్ కుమార్



**విశ్వంభర, ఆమనగల్లు:** జిల్లా అందత్వ నివారణ సంస్థ లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు రామ్ రెడ్డి లయన్స్ ఐ ఆసుపత్రి వారి సంయుక్త ఆధ్వర్యంలో ఆమనగల్ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య ఆరోగ్య శిబిరాన్ని క్లబ్ అధ్యక్షులు లయన్ పసుల లక్ష్మారెడ్డితో కలిసి సీఐ ప్రమోద్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు నేత్రదానం చేసి మరో ఇద్దరికి చూపు ప్రసాదించాలని త్వరలో లైన్స్ క్లబ్ వారి సహకారంతో నేత్రదాన అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరూ నేత్రదానం చేయడానికి ముందుకు వచ్చేలా అవగాహన కల్పిస్తామని ఆయన అన్నారు. నేటి సమాజంలో వృద్ధులైన వారికి వృద్ధాప్య దశలో ఉన్న తల్లిదండ్రులకు కంటి చూపు మందగించిన వారికి తమ కుటుంబ సభ్యులు పట్టించుకో కున్న లైన్స్ క్లబ్ వారు వారిని చేరదీసి షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటి పరీక్షలు చేయించడం చాలా గొప్ప సేవా కార్యక్రమమని వారు కొనియాడారు. నియోజకవర్గ స్థాయిలో లయన్స్ క్లబ్ వారు చేపట్టే ఉచిత కంటి వైద్య మెగా హెల్త్ క్యాంపు లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని ఏర్పాటు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ శిబిరంలో కంటి వైద్యులు ఏం చంద్రశేఖర్ 63 మంది కి కంటి పరీక్షలు నిర్వహించగా 23 మందిని ఆపరేషన్ నిమిత్తం రామ్ రెడ్డి లయన్స్ హాస్పిటల్ కి తరలించినట్లు పీఆర్ఓ పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ బి. యాదయ్య, జూలూరి రమేష్, కార్యదర్శి, దోనాదుల మహేష్, సంయుక్త కార్యదర్శి ఎంగలి బాలకృష్ణ, క్లబ్ సభ్యులు కర్నాటి కొండల్ రెడ్డి, కొరివి వెంకటయ్య, ఆస్పత్రి వైద్యులు డాక్టర్ పరీక్షిత్ నరేంద్ర, హెచ్ఈఓ తిరుపతిరెడ్డి, ఎం. చంద్రశేఖర్, వేణు, పీఆర్ఓ పాషా పాల్గొన్నారు.

## జయశంకర్ ఆశయాన్ని కొనసాగిస్తాం:

### ఎమ్మెల్సీ కోదండరాం: పెన్సిల్ స్కెచ్ ఫోటో బహుకరణ




**విశ్వంభర, ఎల్బీనగర్:** తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో నిరంతరం పోరాటం చేసిన ప్రొఫెసర్ కేశవరావు,జయశంకర్ ఆశయ సాధన కోసం తాము కృషి చేస్తామని ఎమ్మెల్సీ, తెలంగాణ జనసమితి అధ్యక్షులు కోదండరాం అన్నారు.సోమవారం తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ అధ్యక్షులు గోర శ్యాంసుందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి మారోజు రామాచారిలు కోదండరామ్‌కి ఆయన చిత్రపటాన్ని బహుకరించారు.ఈ సందర్భంగా వీరిని అభినందిస్తూ చిత్రపటాన్ని గీసిన అంద చేశారు. తెలంగాణ కోసం తెలంగాణ రాష్ట్రంలో సకల జనులందరూ సంతోషంగా ఉండే విధంగా తమ పార్టీ పోరాటం చేస్తుందని అన్నారు.

## అష్టలక్ష్మి దేవాలయా లడ్డును రూ. 2 లక్షలకు దక్కించుకున్న తోట శ్రీనివాస్ రేఖ దంపతులు



**విశ్వంభర, ఎల్ బినగర్:** అష్టలక్ష్మి దేవాలయం గణనాధుడి లడ్డుని రూ.2 లక్షలకు దక్కించుకున్న వాసవి కాలనీ చెందిన రిటైర్డ్ ఎస్ పి డి సి ఎల్ తెలంగాణ స్టేట్ డైరెక్టర్ తోట శ్రీనివాస్ రేఖ దంపతులు లడ్డు ని కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్, చైర్మన్ సోమా సురేష్ కుమార్ గుప్తా, ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి ఆయత అంజయ్య, కో చైర్మన్ నాగమల్ల శ్రవణ్ కుమార్, సెక్రెటరీ దాచేపల్లి శ్రీనివాస్, కమిటీ సభ్యులు చిలుక ఉపేందర్ రెడ్డి, గందె శ్రీకాంత్, గౌరిశెట్టి శ్రీనివాస్, గోవింద్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

## సమసమాజ నిర్మాణం విద్యతోనే సాధ్యం

### ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి, కేఎల్ఆర్



**విశ్వంభర, మహేశ్వరం:** నాణ్యమైన విద్య అందిస్తామని తల్లిదండ్రుల్లో విశ్వాసం కలిగించినప్పుడే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. తుక్కుగూడ కార్యాలయంలో టీచర్ల సమస్యలపై ఉపాధ్యాయ సంఘాల నేతలు కేఎల్ఆర్ ను కలిశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బడుల్లో మౌలిక వసతులకు స్కావెంజర్స్ నియామకానికి అనుమతులు వెంటనే ఇస్తున్నామని గుర్తు చేశారు. ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందిస్తున్నామని కేఎల్ఆర్ తెలిపారు. పదోతరగతి లోపు విద్యార్థులకు మంచి చదువు అందిస్తే విజ్ఞానంతోపాటు సంస్కారం వస్తుందన్నారు. ప్రజల మధ్య అసమానతలు తొలిగి పేదరికం పోవాలన్నా, ఉన్నతమైన విలువలతో కూడిన జీవితం గడపాలన్నా ఒక్క విద్యతోనే సాధ్యమన్నారు కేఎల్ఆర్. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సహా ఉపాధ్యాయ సంఘాలు పాల్గొన్నారు.

## రూ.1,13456 వేలం పాటలో దక్కించుకున్న పద్మావతి దంపతులు



**విశ్వంభర, ఎల్బీనగర్:** మనసురాబాద్ డివిజన్ వాసవి బృందావన్ అపార్ట్మెంట్ రాగాల ఎన్క్లేవ్ లో గణేష్ నిమజ్జనం కార్యక్రమంలో భాగంగా కనుకుర్తి పద్మావతి దంపతులు లడ్డూ వేలం పాటలో దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గణేష్ ని ఆశీస్సులు అందరిపై ఉండాలని అన్నారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం గణేష్ ని పండుగను ఎంతో ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. దాదాపు 60 ప్లాట్ల ఓనర్లు లడ్డూ వేలంపాట కార్యక్రమంలో పాల్గొన్నారు అని తెలిపారు. దాండియా, ఆటల పోటీలో నిర్వహించిన కార్యక్రమాన్ని విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మనిరాం, ట్రెజరర్ తాడిశెట్టి పశుపతిగుప్త, వైస్ ప్రెసిడెంట్ గుండా శోభన్ గుప్తా, జాయింట్ సెక్రెటరీ పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధి వెండి వినాయకుని వద్ద నిమజ్జనంలో పాల్గొన్న ఎమ్మెల్యే మురళి నాయక్ దంపతులు



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ పట్టణ కేంద్రం ఆర్టీసీ కాలనీ అనంతరం మార్వాడి బజార్ శ్రీ శ్రీకృష్ణుని మందిరంలో శ్రీ వెండి సిద్ది గణపతి నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా నిమజ్జన ఘట్టంలో భక్తిశ్రద్ధలతో గణనాధుని మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ వారి సతీమణి ఉమా, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీ గణపతి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తొమ్మిది రోజులు భక్తిశ్రద్ధలతో దేశంలోనే అతిపెద్ద పండగను అంగరంగ వైభవంగా జరుపుకునే గణపతి దైవ పూజ కార్యక్రమంలో పాల్గొని, మహబూబాబాద్ నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో, పశు సంపదతో కుటుంబాలు ఎప్పుడు చల్లగా ఉండాలని గణనాధుని, వేడుకున్నానన్నారు. కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషకరమన్నారు. కుటుంబ సభ్యులు భక్తులు శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

## నిధులు రాక పంచాయతీ కార్యదర్శుల అవస్థలు

**విశ్వంభర,రామన్నపేట:** ఫిబ్రవరి 2 నుంచి గ్రామపంచాయతీలలో ప్రత్యేక అధికారుల పరిపాలనలో క్షేత్ర స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు ఆర్థికంగా మానసికంగా అనేక కష్టాలను పడుతూ గ్రామపంచాయతీలలో పరిపాలనను అందిస్తూ గ్రామాలను అభివృద్ధి చేస్తున్నారు. ఇదిలా ఉంటే గ్రామపంచాయతీ అకౌంట్ లలో డబ్బులు లేక పంచాయతీ కార్యదర్శులు అప్పులు చేసి వడ్డీలకు డబ్బులు తెచ్చి జిల్లాలో 421 గ్రామపంచాయతీలను నడుపుతున్నారు. గత 6 నెలల నుండి 15వ ఆర్థిక సంఘం నిధులు రాక అలాగే సుమారు 20 నెలల నుండి గ్రామపంచాయతీలకు రావాల్సిన రాష్ట్ర గ్రాంట్స్ కూడా రాకపోవడంతో ట్రాక్టర్ ఈఎంఐ లు, రోజువారి ట్రాక్టర్ డీజిల్, ట్రాక్టర్ రిపేర్లు చేయుటకు, సానిటేషన్ నిర్వహణకు, మోటార్ రిపేర్లు, వీధి దీపాల నిర్వహణకు, సిబ్బంది వేతనాలకు, ఫాగింగ్ చేయుటకు, వాటర్ ట్యాంకుల నిర్వహణ, వీటన్నింటికి పంచాయతీ కార్యదర్శులు స్వంతంగా గ్రామపంచాయతీ కోసం అప్పులు చేసి గ్రామాలలో పరిపాలన అందిస్తున్నారు. నెలకొకసారి వచ్చే జీతాలను ఇటు గ్రామపంచాయతీకి, కుటుంబ పోషణకు ఎటు సరిపోకుండా ఆర్థికంగా కార్యదర్శులు కుదేలైపోతున్నారు. తాజా మాజీ సర్పంచ్ లు కూడా మేము ఖర్చు పెట్టిన డబ్బులను వెంటనే చెల్లించాలని కార్యదర్శులపై ఒత్తిడి తెస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ గ్రాంట్ల నిధులని విడుదల చేసి కార్యదర్శులను ఆర్థిక కష్టాలనుంచి విముక్తి కలిగించాలని ప్రతి పంచాయతీ కార్యదర్శి ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

## విగ్నేశ్వరుని ఆశీస్సులు అందరిపై ఉండాలి



**విశ్వంభర,ఎల్బీనగర్:** విగ్నేశ్వరుని ఆశీస్సులు అందరిపై ఉండాలని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు, టిపిసిసి ప్రతినిధి దేప భాస్కర్ రెడ్డి అన్నారు. సోమవారం ఆర్ కెపురం డివిజన్ పరిధిలోని వాసవి కాలనీ నివాసుల సంక్షేమ సంఘం వారి ఆధ్వర్యంలో మహా గణపతి 37వ నవరాత్రి మహోత్సవాలలో భాగంగా నిర్వహించిన పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా దేప భాస్కర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి వారికి బహుమతులను ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో వాసవి కాలని గణేష్ ఉత్సవ కమిటీ చైర్మన్ చిలుక ఉపేందర్ రెడ్డి, వాసవి కాలనీ అధ్యక్షుడు గౌరీశెట్టి చంద్రశేఖర్ గుప్త, ప్రధాన కార్యదర్శి అంజయ్య, కోశాధికారి కృష్ణయ్య, అష్టలక్ష్మి దేవాలయ అక్షయ ట్రస్ట్ సెక్రటరీ సుధాకర్ గుప్తా, దేవాలయ ప్రధాన కార్యదర్శి గంప జగన్, బంధం దామోదర్, గౌరిశెట్టి అరుణ్, గౌరీశెట్టి శ్రీనివాస్, కమిటీ సభ్యులు గౌరీ శంకర్, వనమా సుదర్శన్, తమ్మన్న శ్రీధర్, మాలే అనిల్, ఒరుగంటి వెంకటేశ్వర్లు, గ్రంథి రమేష్, గందే శ్రీకాంత్, డా!!. రాంకిషన్, తోడుపునూరి సతీష్, పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా గణేష్ నిమజ్జనం

### నిమజ్జనంలో పాల్గొన్న కార్పొరేటర్ అనిత యాదగిరి



**విశ్వంభర,మేడిపల్లి:** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 13వ డివిజన్ గౌతమ్ నగర్ కాలనీలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనమంగా నిర్వహించారు. గౌతమ్ నగర్ కాలనీ అధ్యక్ష కార్యదర్శుల ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గణనాథుని అన్న ప్రసాదాలు కాలనీ వాసులకు ఏర్పాటు చేశారు. గణేశుని కృప కటాక్షాలు అందరిపై ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ దానగల్ల అనిత యాదగిరి హాజరై అన్న వితరణ చేశారు. అందులో భాగంగా ఆదివారం గణేష్ నిమజ్జనం పురస్కరించుకొని అంగరంగ వైభవంగా ఆటపాటలతో, గణేష్ ని ఊరేగింపుగా తీసుకువెళ్లి బోనగిరి చెరువులో నిమజ్జనం చేశారు. గౌతమ్ నగర్ కాలనీ అధ్యక్షులు బొక్కి.దుర్గయ్య, ఉపాధ్యక్షులు ముత్యాలు, ప్రధాన కార్యదర్శి ఎండి. గఫర్, సారయ్య, వెంకటేష్, కాలనీ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని గణేశుని నిమజ్జనం నిర్వహించారు.

## గణపతి నవరాత్రులలో బుక్స్, పెన్నులు పంపిణీ చేసిన అక్క, చెల్లెలు



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ పట్టణంలో చివరిరోజుమండపాలు కిటకిటలాడుతూ కనిపించింది భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పురస్కరించుకొని శివాని, భవాని అక్క చెల్లెలు ఇద్దరు బీటెక్ విద్యార్థులు సరస్వతీ పూజ నిర్వహించి పిల్లలకు బుక్స్, పెన్నులను పంపిణీ చేశారు. ప్రజలందరూ చల్లంగా ఉండాలని దేవుని ఆశీస్సులు పొందారు.

## వాసవి కాలనీ లడ్డును రూ.4 లక్షల 92 వేలకు అందుకున్న ప్రసన్న సతీష్



**విశాలాంధ్ర, ఎల్బీనగర్:** వాసవి కాలనీ నివాసితుల సంక్షేమ సంఘం ఏర్పాటుచేసిన 37 వా గణపతి నవరాత్రి ఉత్సవములు గణనాథుడి లడ్డు ని రూ.4 లక్షల 92 వేలకు తోడుపునూరి ప్రసన్న సతీష్ కైవసం చేసుకున్నారు. గణనాధుని ఆశీస్సులు అందరిపై ఉండాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి కాలనీ అధ్యక్షులు గౌరిశెట్టి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి అంజయ్య, కోశాధికారి తాండూరు కృష్ణయ్య, గణేష్ ఉత్సవ కమిటీ కన్వీనర్ చిలుక ఉపేందర్ రెడ్డి, కో కన్వీనర్ సూరి గౌరీ శంకర్, గౌరిశెట్టి అరుణ్ కుమార్, అడ్వర్టైజ్మెంట్ కమిటీ చైర్మన్ వనమా సుదర్శన్, ఫైనాన్స్ కమిటీ చైర్మన్ తమన్నా శ్రీధర్, కల్చరల్ కమిటీ చైర్మన్ రమేష్ గ్రంథి, నిమజ్జన కమిటీ చైర్మన్ గందే శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి వరంగల్ జిల్లా మహిళా నిరుద్యోగులకు శుభవార్త

### మన అగ్రిటెక్ జాబ్స్ నోటిఫికేషన్ విడుదల

**విశ్వంభర, వరంగల్:** ఇంటర్ పాస్ ఐన మహిళలకి గ్రామానికొక ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నట్టు మన అగ్రిటెక్ సంస్థ ఎండి రమేష్ తెలిపారు. వ్యవసాయం ఆధునికరణ చేయడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన మన అగ్రిటెక్ సంస్థ ఎనుమాముల మార్కెట్ వరంగల్ ద్వారా రైతులకు అవగాహన మరియు సమాచారం అందించడం కొరకు గ్రామానికొక అభ్యర్థి పార్ట్ టైం మరియు ఫుల్ టైం కొరకు 17 సెప్టెంబర్ 2024 నుండి 21 సెప్టెంబర్ 2024 వరకు సెలెక్షన్స్ జరుగుతున్నాయి. ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని ఎండీ ప్రకటనలో తెలిపారు. అర్హత : ఇంటర్ పాస్, వయస్సు 35 సం.ల లోపు ఉండాలి. టచ్ ఫోన్ తప్పనిసరి, అదే గ్రామమై ఉండాలి, మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది. తెచ్చుకోవల్సిన ధృవీకరణ పత్రాలు: ఆధార్ కార్డు, పాన్ కార్డు, 2 పాస్ ఫోటోస్, బ్యాంకు పాసు బుక్. ఇవి అన్ని ఒక సెట్ జిరాక్స్ ఉండాలి. శాలరీ డీటెయిల్స్: పార్ట్ టైం ఫుల్ టైం జాబ్ ని బట్టి శాలరీ ఉంటుంది చేయవల్సిన వర్క్ : సంస్థ నుండి వాట్సాప్ కాల్స్ ద్వారా వచ్చే వ్యవసాయ సమాచారాన్ని ఆ యొక్క గ్రామ రైతులకు తెలియచేస్తూ మోటివేషన్ చేయాలి. గమనిక: సెలక్షన్ స్పాట్, ఒక గ్రామానికి ఒకరికి మాత్రమే అవకాశం ఉంటుంది. ముందు వచ్చి సెలక్షన్ ఐన వారిని ఫైనల్ చేయబడును. అడ్రస్: అపరాల యార్డ్, ఎనుమాముల గ్రైన్ మార్కెట్, వరంగల్ సంప్రదించవలసిన సైట్ : www.manaagritech.com



# 54 ప్రపంచ రికార్డులు సాధించిన సోనాలి ఆచార్జీ

## వెల్లడించిన ప్రపంచ రికార్డుల సమన్వయ కర్త లయన్ కె.వి.రమణారావు




**విశ్వంభర,బషీర్‌బాగ్:** శ్రీ వెంకటేశ్వర స్వామి బొమ్మను 7 అడుగులు వెడల్పు 9 అడుగుల ఎత్తుతో కేవలం 54 గంటలలో మండల ఆర్ట్ ద్వారా పూర్తి చేసి ప్రపంచంలోనే మొదటిసారిగా 54 ప్రపంచ రికార్డులను సోనాలి ఆచార్జీ సొంతం చేసుకున్నారని ప్రపంచ రికార్డుల సమన్వయ కర్త లయన్ రమణారావు తెలిపారు. ఈ కార్యక్రమానికి లముఖ్య అతిధిగా విచ్చేసిన డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి మాట్లాడుతూ సోనాలి ఆచార్జీ మంచి నర్తకిగా గాయనిగా, ఆర్టిస్టుగా మంచి పేరు ప్రఖ్యాతలు సాధించినా అంతటితో ఆగకుండా మండల ఆర్ట్ ద్వారా మొదటిగా ఒకేసారి 54 ప్రపంచ రికార్డులు సాధించారంటే ఆమె ఏకాగ్రతని, పట్టుదలని, కృషిని అభినందించాలి అని కొనియాడుతూ ఆమె సాధించిన ప్రపంచ రికార్డులతో భారతదేశానికి కీర్తి సాధించడంతో పాటు తెలంగాణ రాష్ట్రానికే వన్నె తెచ్చారని తెలిపారు. మాజీ ఐఏఎస్ అధికారి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రపంచ రికార్డుల సమన్వయకర్త లయన్ కె.వి.రమణారావు ప్రపంచంలోని అద్భుతమైన ప్రతిభ కలిగిన వారిని, ప్రపంచ వింతలను వివిధ ప్రపంచ రికార్డులలో నమోదు చేస్తూ మనదేశ కీర్తిని విశ్వ వ్యాప్తం చేస్తున్నారని, వివిధ రంగాల ప్రతిభా వంతులను గుర్తిస్తూ వారిని ప్రపంచ రికార్డులలో నమోదు చేస్తున్నారని తెలిపారు. మన దేశ కీర్తిని ప్రపంచ దేశాలకు చాటుతున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా సముద్రాల వేణుగోపాలాచారి లయన్ రమణారావు, మాజీ ఐఏఎస్ అధికారి సుబ్రమణ్యం, బుల్లితెర వెండితెర నటుడు శ్రీనివాస్, దైవజ్ఞశర్మ, సోనాలి ఆచార్జీ గురువులు సిరి స్వామిలు సోనాలి ఆచార్జీని సన్మానించి అభినందించారు.

# గెట్ వెల్ సూన్ రేవంత్ రెడ్డి

## తెలంగాణ భవన్ ప్రెస్ మీట్‌లో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



**విశ్వంభర,హైదరాబాద్:** కోరుట్ల నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ తెలంగాణ భవన్ ప్రెస్ మీట్‌లో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూటకు ఒకలా గా ప్రవర్తిస్తున్నాడని సస్య శ్యామలంగా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని 9 నెలల కాంగ్రెస్ పాలనలో 9 సంవత్సరాల వెనక్కి తీసుకు వెళ్లారని ప్రగతి పథంలో ఉండాల్సిన తెలంగాణను గాలికి వదిలేసి పనికిరాని మాటలు, చేష్టలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు, కేసీఆర్ పరిపాలనలో తెలంగాణ బంగారు తెలంగాణగా అభివృద్ధి చెందిందని, ప్రజ లకు ఉపయోగ పడే అభివృద్ధి పథకాలను పక్కనపెట్టి తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బ తీసే విధంగా ప్రవర్తిస్తున్నారని అన్నారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రి హోదాలో ఉండి నోటికి ఏది వస్తే అది మాట్లాడుతూ ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని అన్నారు. రేవంత్ రెడ్డిని ఉద్దేశిస్తూ మీరు తెలంగాణ రాష్ట్రానికి చిన్న వయసులోనే ముఖ్యమంత్రి హోదాను పొందారు మీరు అన్న, మీపదవి అన్న మాకుచాలా గౌరవం, కోలు కొని తెలంగాణ ప్రజలకు జనరంజకమైన పరిపాలన చేయాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు.

# మాట తప్పిన మీ మామ గుండెల్లో నిదురపో

## ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** నోరు దగ్గర పెట్టుకోని మాట్లాడాలని లేదంటే తెలంగాణ ప్రజలు నాలుక కొస్తారని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హరీష్ రావును హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు పెద్ద సన్యాసులన్నారు. తెలంగాణ ప్రజలు మిమ్మల్ని చీ కొట్టి అసెంబ్లీ, ఎంపీ ఎన్నికల్లో ఓడగొట్టి ఇంట్లో కూర్చోబెట్టిన మీకు బుద్ధి రాలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మీ డ్రైనేజీ వాసన నోరుతో సన్యాసి అనే పదాలతో నోరు పరేసుకొంటే జాగ్రత్త అని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రుణమాఫీ చేస్తే గుండెల్లో పండుకుంటా అన్న నువ్వు ఎక్కడ పడుకున్నావ్ అని ప్రశ్నించారు. గతంలో మీ మామ లక్ష రూపాయలు రుణమాఫీ చేస్తా అని చెప్పి మాట తప్పిన మీ మామా గుండెల్లో నిద్రపో అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రుణమాఫీ విముక్తి చేసిన ఘనత రేవంత్ రెడ్డిది అన్నారు. హరీష్ రావు సన్యాసి నువ్వు సిద్ధిపేటలో మెదక్‌లో నిలపడు చిత్తుగా ప్రజలు ఓడగొడతారని అన్నారు. రేవంత్ రెడ్డి పై మాట్లాడితే తస్మాత్ జాగ్రత్త అని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హెచ్చరించారు.

# మహా గణనాథుడిని దర్శించుకున్న బీజేపీ నాయకులు



**విశ్వంభర, మహేశ్వరం:** బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని బాలాపూర్ మహా గణనాథుడిని మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యులు, జేపీసీ కమిటీ మెంబర్ డి కె అరుణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్‌తో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ నవరాత్రులు పూజలు అందుకున్న మహాగణాధుడి ఆశీస్సులు తెలంగాణ ప్రజలందరిపై ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు కళ్లెం నిరంజన్ రెడ్డి. అరుణమ్మను ఘనంగా సత్కరించి లడ్డు ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొలన్ శంకర్‌రెడ్డి బడంగ్ పేట్ బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకట్ రెడ్డిజీహెచ్ఎంసీ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్ రెడ్డి బీజేపీ సీనియర్ నాయకులు పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నవారు శ్రీనివాస్ రెడ్డి, గడ్డం వెంకటేష్, కొంతం సంపత్ రెడ్డి, సమ్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కళ్లెం లక్ష్మారెడ్డి, జోరాల ప్రభాకర్, గుండె నాగార్జున, రావుల మల్లేష్, దొడ్డి శ్రీశైలం, రేసు నర్సింహారెడ్డి, గుండె గణేష్ బాబు, గడ్డం మధు తదితరులు పాల్గొన్నారు.



(విశ్వంభర, హైదరాబాద్): వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిదికి టీపీసీసీ అధికార ప్రతినిధి భవాని రెడ్డి లక్ష రూపాయల విరాళం అందించారు. గాంధీ భవన్ లో ఈరోజు టీపీసీసీ నూతన అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి లక్ష రూపాయల విరాళం చెక్కును ఆయనకు అందించారు. ఈ సందర్భంగా వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన భవాని రెడ్డి ని ఆయన అభినందించారు.



(విశ్వంభర, హైదరాబాద్): రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్రతో పాటు అసెంబ్లీ మాజీ స్పీకర్, శాసనమండలిలో బీఆర్ఎస్ పక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, బాల్క సుమన్, గాదరి కిశోర్, పార్టీ నాయకుడు రాకేష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# మృతుడు రవి కుటుంబానికి ఆర్థిక సాయం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ నాయకులు బూడిది రవి అనారోగ్యంతో మరణించగా విషయం తెలుసుకున్న స్థానిక మాజీ సర్పంచ్ జన్నాయికోడె నగేష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి మృతుడు బూడిది రవి పార్థీవ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య స్ఫూర్తితో మాజీ సర్పంచ్ జన్నాయికోడె నగేష్ వారి కుటుంబానికి 5000/-ల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మెన్ జిల్లాల శేఖర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పోతగాని మల్లేశం, మాజీ ఎంపీటీసీ దిగోజు నర్సింహా చారి, పాక్స్ డైరెక్టర్ నోముల వెంకట్ రెడ్డి, గౌడ సంఘం అధ్యక్షులు పంజాల నర్సయ్య, నాయకులు గుండెగాని అయిలయ్య, బొబ్బల అంజిరెడ్డి, ఎద్దు వెంకటేశ్వర్లు, పైళ్ళ దామోదర్ రెడ్డి, తవిటి రాములు, దొంతరబోయిన భాస్కర్, ఎలగందుల శ్రీను, ఎలగందుల మహేష్, తొండల అనిల్, గుండెగాని కిరణ్, యాస సుభాష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# రవి కుటుంబానికి కేహెచ్ఆర్ ఫౌండేషన్ ఆర్థిక సహాయం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో నిరుపేద కుటుంబానికి చెందిన బూడిది రవి అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రాత్రి మృతి చెందగా మాజీ ఎంపీటీసీ యాస కవిత ఇంద్రా రెడ్డి విషయాన్ని తెలుసుకొని మృతుని పార్థీవ దేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి కేహెచ్ఆర్ ఫౌండేషన్ ఫౌండర్ కొప్పుల హరిదీప్ రెడ్డి సహకారంతో 5000 రూపాయల ఆర్థిక సహాయంను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు కోరే వెంకన్న, మండల బీఆరెస్ నాయకులు ప్రతికంఠం పూర్ణచందర్ రాజు, కోరే భిక్షపతి, గడ్డం దశరథ, సోలిపురం అరుణ, గౌడ సంఘం అధ్యక్షులు పంజాల నర్సయ్య, బీఆరెస్ నాయకులు ఎండీ అజీమ్, నాతి రాజు, సోలిపురం శ్రీనివాస్ రెడ్డి, కొల లక్ష్మయ్య, బోడిగె వెంకన్న, గుండేగాని సత్తయ్య, కొండపల్లి అబ్బసాయిలు, సామ శ్రీనివాస్ రెడ్డి, నాతి స్వామి, భిక్షపతి, గుండేగాని మల్లయ్య, బూడిది స్వామి, వెంకన్న, పంజాల రాజు, తదితరులు పాల్గొన్నారు.

# ఏరియా ఆసుపత్రిని 100 పడకలుగా నిర్మాణం చేయాలి



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా నకిరెకల్ నియోజకవర్గం లోని రామన్నపేట ఏరియా ఆసుపత్రిని 100 పడకలకు నిర్మాణం చేయాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రిని కలిసి వినితిపత్రం అందజేసిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆధ్వర్యంలో రామన్నపేట కాంగ్రెస్ నాయకులు సోమవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామన్నపేట ఏరియా ఆసుపత్రిని 100పడకలకు పెంచాలని, వైద్యులను నియమించాలని కోరారు. అందుకు మంత్రిసానుకూలంగా స్పందించి, వెంటనే వైద్య, ఆరోగ్యశాఖ కమీషనర్‌తో చరవాణిలో మాట్లాడి, అందుకు అవసరమైన నివేదిక అందజేయాలని ఆదేశించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల ఓట్ల కోసం ఆర్భాటంగా ఆస్పత్రి భవనానికి శంకుస్థాపన చేశారని, కేవలంరాజకీయ లబ్ధి కోసమే శంకుస్థాపనలు తప్ప ఎలాంటి నిధులు మంజూరు కాలేదని తెలిపారు. రాష్ట్రంలో ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళ్తుందని అన్నారు. గత ప్రభుత్వం ఎలక్షన్స్ ఓట్ల కోసమే రాష్ట్ర వ్యాప్తంగా శంకుస్థాపనలు చేసి శిలాఫలకాలకే పరిమితమయ్యాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు గంగుల వెంకట రాజిరెడ్డి, గోదాసు పృథ్వీరాజ్, మాజీ ఎంపీటీసీ తిమ్మాపురం మహేందర్‌రెడ్డి, మాజీఎంపీటీసీ రెహన్, ఎండి అక్రమ్, నోముల ప్రవీణ్ కుమార్, పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు



**విశ్వంభర, మహేశ్వరం:** కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక మతాల మధ్య చిచ్చుపెట్టి ప్రజలను విడదీస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇవాళ ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని మిలాద్ ఉన్ నబీగా జరుపుకోవటం విశేషమన్నారు. వారం రోజుల పాటు పలు సేవ కార్యక్రమాలు పేదలకు పండ్లు, ఆహార పదార్థాలు పంచి ముస్లిం సోదరులు మానవత్వాన్ని చాటుకుంటున్నారని కేఎల్ఆర్ అన్నారు. వినాయక నిమజ్జనాలను సంతోషంగా జరుపుకోవాలని కే. లక్ష్మారెడ్డి ఆకాంక్షించారు. రూపాలు వేరైనా దేవుడు అందరికీ ఒక్కడే అన్నారు. కాబట్టి కలిసి అందరూ అన్ని పండుగలను జరుపుకోవాలని ప్రజలకు కేఎల్ఆర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి సహా మహేశ్వరం నియోజకవర్గం మైనార్టీ సెల్ ఛైర్మన్ షేక్ యుసూఫ్ ఖాద్రీ సహా పలువురు ముస్లిం సోదరులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# అమరవీరుల ఆశయాలను కొనసాగించాలి



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఎందరో మహానుభావులు అసువులు బాశారు. ఆ అమరవీరుల ఆశయలను కొనసాగించాలని యాదాద్రి భువనగిరి జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలన్నారు. సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలోని కామ్రేడ్ బొమ్మగాని ధర్మబిక్షం, కామ్రేడ్ గుర్రం యాదగిరిరెడ్డి, కామ్రేడ్ చాకలి ఐలమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి వారికి జోహార్లు అర్పించినారు. నిజాం నిరంకుశ పాలన ఫ్యూడల్ వ్యవస్థకు, దోపిడీకి, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా భూమికోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన అమరవీరుల అడుగుజాడల్లో ఆశయ సాధన కోసం నడవాలనినాడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి పిలిపించిన మహావీరులు రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూం మొహినుద్దీన్ పిలుపుని అందుకున్న గ్రామాలలో ప్రజలు కారంపొడి, రోకలీ బండలతో నిజం ప్రభుత్వం, దొరల, భూస్వాముల, పెత్తందార్ల కబంధ హస్తాల్లో ఉన్న ఒక్కొక్క గ్రామాన్ని విముక్తి చేయడంతో దాదాపు 3,000 గ్రామాలను విముక్తి చేయబడ్డాయని, భూస్వాముల నుండి10 వేల ఎకరాల వరకు భూమిని పేద ప్రజలకు పంపిణీ చేశారని ఆయన అన్నారు. మండల సీపీఐ కార్యదర్శి మారుపాక వెంకటేశం, మండల సహకార్యదర్శి బత్తిని నరేష్, మండల కార్యవర్గ సభ్యులు సోలిపూరం లింగారెడ్డి, జల్ది రాములు,జక్క దయాకర్ రెడ్డి, బొబ్బల లాల్ రెడ్డి, కసరబోయిన సత్తయ్య, సుంకరి రామచంద్ర, మారూపకస్వామి, ఎండి నహీం, సీపీఐ సీనియర్ నాయకులు బుచ్చిరెడ్డి, మండల కౌన్సిల్ సభ్యులు కూరెళ్ల మచ్చగిరి, మారుపాక మల్లేష్, అంభోజు రాములు, సుధ గాని పృధ్వి, తాళ్లపల్లి నరసయ్య, మరిపెల్లి రాములు, భాషాబోయిన జన్నయ్య, చంద్రయ్య, సుధా గాని ఆగయ్య, గోపనమైన గోపాల్, బత్తిని లింగయ్య, ఎస్ఆర్ చెంద్రమౌళి, కె రామనర్సయ్య, యువజన నాయకులు భాష బోయిన నరేందర్, బుర్ర ప్రవీన్ పాల్గొన్నారు.



(విశ్వంభర, మహబూబాబాద్): మహబూబాబాద్ పట్టణంలో నిమజ్జనానికి బయలుదేరిన వినాయకుడికి ఫారెస్ట్ ఆఫీస్ వద్ద స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్,మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రాంమోహన్ రెడ్డి,వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, మున్సిపల్ కమీషనర్ నోముల రవీందర్,డిఈ ఉపేందర్, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ చిట్యాల జనార్దన్, కౌన్సిలర్లు పోతురాజు రాజు, దండెబోయిన వెంకన్న, తాళ్లపల్లి జగన్, భూక్య శ్రీనివాస్, కోడి శ్రీనివాస్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాటం గురించి మాట్లాడే హక్కు బీజేపీకి లేదు



**విశ్వంభర, షాద్ నగర్:** షాద్ నగర్ పట్టణంలో సోమవారం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట 76వ వార్షికోత్సవ సభను ఏర్పాటు చేశారు. దీనికి ముఖ్యఅతిథిగా పాల్గొని సీపీఐ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం శ్రీను అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ నాడు జరిగిన భూమి భుక్తి విముక్తి పోరాటం గడీల పాలన నుండి నిజాం దేశ్ ముకుల నుండి తెలంగాణ ప్రజలకు విముక్తి కలిగించిన పోరాటం నేటికీ ప్రపంచ పోరాటాలకు అది స్ఫూర్తిదాయకమని ఆయన కొనియాడారు. నిజాము ముస్లిం కాబట్టి ఇది హిందువుల పోరాటం అని చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ వీలిన దినం జరపాలని డిమాండ్ చేయడం సిగ్గుమాలిన చర్య అని ఆయన మండిపడ్డారు. విలీన దినమని ఒక పార్టీ విద్రోహ దినమని మరో పార్టీ తెలంగాణ సాయుధ పోరాటానికి సంబంధంలేని నాయకులు, ఇప్పుడు గొంతెతి మాట్లాడే నాయకులు ఆనాడు జరిగిన పోరాటంలో ఎక్కడ ఉన్నారని ఆయన నిలదీశారు. ఆ పోరాటంలో పాల్గొన్నది కమ్యూనిస్టులు ప్రాణాలు అర్పించింది కమ్యూనిస్టులు కానీ ఆ పోరాటంలో పాల్గొనని జెండాలు, పార్టీలు ప్రజల ముందుకు వచ్చి వక్రీకరించి మాట్లాడి తెలంగాణ సాయుధ పోరాటం గురించి తప్పు త్రోవ పట్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో రంగారెడ్డి జిల్లాలో భవిష్యత్తులో వర్గ పోరాటాలనుమరింత ఉదృతం చేస్తామని ఆయన తెలిపారు. ఈ వార్షికోత్సవ సభలో సీపీఐ మండల కార్యదర్శిలు ఎండి షకీల్, గడ్డం జంగయ్య, చంద్రబాబు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్, నాయకులు శివ,విజయ్, ఆకాష్, సాయి, అజ్మత్ అలీ, డి ఎల్లయ్య, మైసయ్య పాల్గొన్నారు.

## క్రాంతి హిల్స్ సంక్షేమ సంఘం గణనాథుని శోభాయాత్ర

*గణనాథుని లడ్డు పాట రూ. 66000 వేల పాయలు*

*లడ్డు గ్రహీత: జి నాగేశ్వర్ రావ్ విద్యులత*



**విశ్వంభర ప్రతినిధి వనస్థలిపురం:** క్రాంతి హిల్స్ సంక్షేమ సంఘం వనస్థలిపురం గణేశుని శోభాయాత్ర ఘనంగా నిర్వహణ నవరాత్రులు వేదమంత్రాలతో పూజలందుకొన్న గణనాథుని లడ్డు జి నాగేశ్వరరావు విద్యులత కైవసం ఆయురారోగ్యాలు అష్ట ఐశ్వర్యాలు ఆర్థిక అభివృద్ధి కలగాలని బద్దం రామ్ రెడ్డి కొనియాడారు ఈ కార్యక్రమంలో కాలనీవాసులు చందాదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు శోభాయాత్ర కాలనీ మొత్తం తెలుగు సందర్భంలో మంగళ హారతులు కొబ్బరి కాయలతో స్వాగతం పలికారు ఈ కార్యక్రమంలో బద్దం రాంరెడ్డి వైస్ ప్రెసిడెంట్ ఎం వెంకట్రెడ్డి ఎం శ్రీనివాస్ గౌడ్ జనరల్ సెక్రటరీ కే సత్తిరెడ్డి జాయింట్ సెక్రటరీ హాజి ముస్తఫా హలీ బి గాలయ్య ట్రెజరర్ వి మనోహర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి శ్రీనివాస్ రెడ్డి లీగల్ అడ్వైజర్ సిహెచ్ ధనుంజయ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఎన్ నారాయణ వై లచ్చిరెడ్డి వి శరత్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు మంచి రోజులు రాబోతున్నాయ్



**విశ్వంభర, భూపాలపల్లి:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులకు మంచి రోజులు రాబోతున్నా యని, యేళ్ళ నాటి శని వదిలిందని, ప్రతీ జర్నలిస్ట్ తన హక్కులను సాకారం చేసుకోబోయే తరుణం మీడియా అకాడమి చైర్మెన్ కె శ్రీనివాసరెడ్డి ద్వారా ఆసన్నమయ్యే సమయం వచ్చిందనీ భూపాలపల్లి జిల్లా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) అధ్యక్షులు సతీష్ కుమార్ అన్నారు. హైదరాబాద్ లోని దేశోద్ధారక భవన్‌లో జరిగిన టీయూడబ్ల్యూజే (ఐజేయూ) స్టేట్ ఎమర్జెన్సీ ఎక్స్టెండేడ్ ఎక్జిక్యూటివ్ కమిటిలో మీడియా అకాడమీ చైర్మేన్ శ్రీనివాసరెడ్డికి జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కోనే సమస్యలైన ఇళ్ళ స్థలాలు, అక్రిడేషన్, హెల్త్ కార్డుల గూర్చి వివరించగా వారసానుకూలంగా స్పందించారు. అతీ త్వరలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా హైదరాబాదులో జర్నలిస్ట్ ఆత్మీయ సమ్మేళన కార్యకమం ఏర్పాటు చేసి, తెలంగాణలో జర్నలిస్టులు ఎదుర్కోంటున్న అన్ని సమస్యలకి ఆ సభా వేదిక ద్వారానే శుభవార్త తెలియజేస్తానని తెలపడం సంతోషకరమని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షులు క్యాతం సతీష్ కుమార్, ప్రదాన కార్యదర్శి సామంతుల శ్యాములు తెలిపారు.

## ప్రజాపాలన దినోత్సవ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి



**విశ్వంభర, భూపాలపల్లి:** సెప్టెంబర్ 17న జరుగబోయే తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమాన్ని ఎలాంటి ఇబ్బందులు రాకుండా మినిట్ టు మినిట్ పకడ్బందీగా నిర్వహించాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు.తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను పురస్కరిం చుకొని ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించనున్న వేడుకలకు మినిట్ టు మినిట్ షెడ్యూల్ తయారు చేశామని, అట్టి షెడ్యూల్ ప్రకారం వేడుకలు నిర్వహణ జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇట్టి వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పోదెం వీరయ్యను ప్రభుత్వం నియమించిందని తెలిపారు. ఉదయం 10 గంటలకు ముఖ్య అతిథిచే జాతీయ పతాక ఆవిష్కరణ ఉంటుందని పేర్కొన్నారు. అన్ని శాఖల అధి కారులు,ఉదయం 9గంటలకు ఐడీఓసీ కార్యాలయానికి హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ మున్సిపల్ పరిధిలో రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా భార్యకు తీవ్ర గాయాలైన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బీహార్ రాష్ట్రానికి చెందిన రాజేష్ (33) బోరంపేట్‌లో వాచ్మెన్ గా ఉంటూ కూరగాయల వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. సోమవారం తన భార్యతో కలిసి తన ద్విచక్ర వాహనంపై షాపూర్ నగర్ నుండి బౌరంపేట్ బయలుదేరాడు. ఉదయం బోరంపేట్ కమాన్ సమీపంలో మియాపూర్ నుండి బహదూర్ పల్లి వెళ్తున్న రెడీమిక్సీ లారీ ఢీ కొట్టింది. దీంతో లారీ చక్రాల కిందపడి రాజేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య గుడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి పోస్టుమార్టంకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## స్వచ్ఛత మెరవాలి పల్లెలు మురవాలి



**విశ్వంభర, భూపాలపల్లి:** స్వచ్ఛత మెరవాలి పల్లెలు మురవాలి. పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు.. గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం ప్రగతి సాధిస్తుంది. అవి ఆరోగ్యంగా ఉంటేనే దేశం కూడా సౌభాగ్యంగా ఉంటుందనే మహాత్ముడి కలలను నిజం చేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ స్వచ్ఛభారత్ మిషన్ ఆధ్వర్యంలో గతేడాది "స్వచ్ఛతా హీ సేవా" కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబరు 2 వ తేదీ వరకు గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భూపాలపల్లి జిల్లాలో మంగళవారం నుంచి ప్రత్యేక కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. పల్లెల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచి స్వచ్ఛ గ్రామాలుగా మార్చాలనే సంకల్పంతో అధికారులు ముందుకు సాగనున్నారు. పారిశుద్ధ్యం బాగుంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు. పారిశుధ్యం లోపిస్తే జనం అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమా లతో ప్రజలకు మేలు జరిగే అవకాశం ఉంది. తద్వారావ్యాధుల కట్టడికి అవకాశం ఉంది. ఈ మేరకు ప్రభుత్వ ఆదేశాలు జారీ అయ్యాయి. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించే కార్యక్రమం వివరాలను భూపాల్ పల్లి జిల్లా డీపీఓ నారాయణరావు తెలిపారు.జిల్లాలో మొత్తం గ్రామపంచాయతీలు 241 ఉన్నాయని, గ్రామీణ ప్రజలు 3,59,625 మంది ఉన్నారని తెలిపారు. స్వచ్ఛతా హీసేవా కార్యక్రమాలు విజయవంతం చేసేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికలతో ప్రతి గ్రామంలో పకడ్బందీగా కార్యక్రమాలు నిర్వహిస్తాం అని గ్రామాల్లో ప్లాంటేషన్ చేపట్టేందుకు ప్రత్యేకదృష్టి సారించనున్నాం అందరిసహకారంతో కార్యక్రమాలనువిజయవంతం చేస్తాం అన్నారు.

# కౌశిక్ రెడ్డి తస్మాత్ జాగ్రత్త..

*సీఎం రేవంత్ రెడ్డి పై మాట జారితే నాలుక కోస్తాం*



**విశ్వంభర, భూపాలపల్లి:** తాను కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి ఇంటికి వచ్చి తన కాళ్లు మొక్కాడంటూ అహంకారపు మాటలు మాట్లాడుతున్న కౌశిక్ రెడ్డి తస్మాత్ జాగ్రత్త. సీఎం రేవంత్ రెడ్డిపై మాట జారితే నాలుక కోస్తామని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు గాజుల మల్లయ్య గౌడ్ ఘాటుగా స్పందించారు. సోమవారం ఆయన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ కు కాపలా కుక్కలా ఉండే నీకు, ప్రజాదరణ కలిగిన సీఎం రేవంత్ రెడ్డితో పోలికా అంటూ.. సీఎం రేవంత్ రెడ్డిపై తప్పుడు మాటలు మాట్లాడితే సహించేది లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డిని వీధి రౌడీలా పోల్చిన కౌశిక్ రెడ్డి దొంగే దొంగ దొంగ అని అరచినట్లు ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఒక్క పిలుపునిస్తే రేవంత్ రెడ్డి అభిమానులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులునీ భరతం పడతారని గాజుల మల్లయ్య గౌడ్ హెచ్చరించారు.

## కులగణనను పక్కదారి పట్టిస్తున్నారు

**విశ్వంభర, భూపాలపల్లి:** రాష్ట్రంలో కులగణనను నిర్వహించి, బీసీల రిజర్వేషన్లను పెంచకుండా, కాంగ్రెస్ పార్టీలోని కొంతమంది ప్రభుత్వాన్ని పక్కదారి పట్టిస్తున్నారని బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ ఆరోపించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జాతీయ స్థాయిలో బీసీల రిజర్వేషన్ల కోసం కులగణన అవసరమని రాహుల్ గాంధీ చెబుతుంటే ఇక్కడి సీఎం మాత్రం కొంతమంది మాట విని రాహుల్ మాట వినడం లేదని విమర్శించారు. బీసీల రిజర్వేషన్ల పెంపునకు బీసీల జనాభాను నిర్ధారించే కులగణనే ప్రామాణికమని హైకోర్టు స్పష్టంగా తీర్పునిచ్చిందన్నారు. ప్రభుత్వం కూడా కులగణనకు తాము సిద్ధమేనని ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ ద్వారా కోర్టుకు చెప్పిన విషయాన్ని వేముల గుర్తు చేశారు. హైకోర్టు తీర్పును గౌరవిస్తూ కులగణన కోసం షెడ్యూల్, రూట్ మ్యాప్ విడుదల చేయాలని మహేందర్ గౌడ్ డిమాండ్ చేశారు. బీసీలపై ఈ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా కులగణన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. బీసీల రిజర్వేషన్ల కుల గణన కోసం ఇప్పటి వరకు వీధిపోరాటాలు, న్యాయపోరాటాలు మాత్రమే చేశామని, బీసీల పట్ల సానుకూలత రాకుంటే ధర్మ పోరాటం చేస్తామన్నారు. ఇప్పటికైనా బీసీలు బానిసత్వాన్ని వీడి పోరాడితే నాయకులవుతారని, లేకుంటే కార్యకర్త కన్నా హీనమవుతారన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను పెంచాలనే డిమాండ్ తో ఈనెల 25నబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ నాయకత్వంలో చలోహైద్రాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సుందరయ్య పార్క్ నుంచి ఇందిరా పార్క్ వరకు వేలాది మందితో కులగణన మార్చ్ నిర్వహిస్తామన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడపవద్దు



**విశ్వంభర, వికారాబాద్:** మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, మద్యం సేవించి వాహనాలు నడపితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మర్పల్లి ఎస్ఐ సురేష్ తెలిపారు. సోమవారం మర్పల్లి మండల పరిధిలో పట్లూరు చౌరస్తాలో సాయంత్రం వాహనాలను తనికీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా వాహనాలు నడపరాదని, ప్రతి బైకు, కారు కు నెంబర్ ప్లేట్ సరిగ్గా వుండేలా చూసుకోవాలని, సరైన ధృవ పత్రాలు ఉండాలని తెలియజేశారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుల్ లక్షమన్, ట్రైనీ కానిస్టేబుల్ పాల్గొన్నారు.

## కేక్ ఫ్యాక్టరీ బేకరీ షాప్ ప్రారంభోత్సవం



**విశ్వంభర, పటాన్‌చేరు:** సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు పట్టణ పరిధిలో గల ఎంజీ రోడ్డు కేక్ ఫ్యాక్టరీ బేకరీ షాప్ సోమవారం ఉదయం ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గూడెం మధుసూదన్ రెడ్డి,యువ నాయకుడు ప్రిథ్వీరాజ్ పాల్గొన్నారు. కేక్ ఫ్యాక్టరీ బేకరీ షాప్ రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. అనంతరం కేక్ ఫ్యాక్టరీ నిర్వాహకులు వారిని పూలమాలవేసి శాలువాతో ఘనంగా సత్కరించారు.గూడెం మధుసూదన్ రెడ్డి, పృథ్వీరాజ్‌లు మాట్లాడుతూ చిన్న వ్యాపారాలసమాజ అభివృద్ధికి కీలకమని, యువతకు స్ఫూర్తిదాయకమని వినియోగదారులు, కేక్ ఫ్యాక్టరీ బేకరి వారి అతి తక్కువ ధరలో నాణ్యమైన కేకులను కొనుగోలు చేయాలని అన్నారు. అనంతరం బేకరీ యజమానులకు అభినందనలు తెలిపారు. మాజీ మార్కెట్ చైర్మన్ విజయ్ కుమార్, శివానగర్ ఎంపీటీసీ బత్తుల మహేష్, మస్కూరి నాగేష్, ఆంజనేయులు, పెద్దలు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## కడ్తాల్ మండల అభివృద్ధికి సహకరించండి



**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ మండల కేంద్రంలో సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్ రెడ్డి సోమవారం పర్యటించారు. సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జర్పుల లక్పతి నాయక్, కర్తలు వారిని మర్యాదపూర్వకంగా కలిసి కడ్తాల్ మండల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నేనావత్ బిఖ్య నాయక్, గిరిజన సేవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమ నాయక్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, అమన్‌గల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ, కడ్తాల్ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బిచ్చ నాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేష్, జాంగిర్ బాబా, లక్ష్మ య్య, లక్ష్మణ్ నాయక్, వెంకటేష్, జాంగిర్, యాదయ్య, జాంగిర్, షాబుద్దీన్, కృష్ణా నాయక్,శ్రీశైలం,యాదగిరి రెడ్డి, బాల్రాజ్, జంగయ్య, శ్రీను, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## నెంబర్ ప్లేట్ లేని వాహనాలు నడపడం చట్టరీత్య నేరం



**విశ్వంభర, పరిగి:** నెంబర్ ప్లేట్ లేని వాహనాలు నడపడం చట్టరీత్య నేరమని పరిగి సీఐ శ్రీనివాస్ అన్నారు. జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం పరిగి పట్టణంలో సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రధాన రహదారిపై నెంబర్ ప్లేట్లు లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించగా 150 వాహనాలను చెక్ చేయడం జరిగిందని, అందులో నెంబర్ ప్లేట్ సరిగ్గా లేని వాహనాలను, నెంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ నెంబర్ ప్లేట్ లేని వాహనాలను నడిపితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి వాహనదారుడు విధిగా హెల్మెట్ ధరించాలని, నెంబర్ ప్లేట్ ను అమర్చుకోవాలని, విద్యార్థులకు వాహనాలు ఇవ్వకూడదని తెలిపారు. పరిగి ఎస్ఐ సంతోష్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘననాథుని పూజలో గోలి శ్రీనివాసరెడ్డి



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్ మున్సిపాలిటీ శివాలయం నగర్ కాలనీలో నెలకొల్పిన శివశక్తి యూత్ గణనాథుని వద్ద రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ ఛైర్మెన్ శ్రీ గోలి శ్రీనివాస్ రెడ్డి, అమనగల్ మున్సిపల్ వైస్ చైర్మన్ దుర్గయ్య దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు వారిని సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంగలి రఘు, అవ్వారి శివలింగం, యాదగిరి, ఎంగలిరమేష్, సుభాష్, మహేష్ నేత, కుమార్ గౌడ్, తరుణ్ నాయక్, ఆకాష్, అరుణ్ నాయక్, శాంతన్, యశ్వంత్, అక్షయ్, శివ, శివమణి, ప్రణీత, స్ఫూర్తి కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



**(విశ్వంభర, షాద్ నగర్): షాద్ నగర్ మున్సిపాలిటీ 20వ వార్డు లోని గంజి వినాయక టెంపుల్ గణపతిని దర్శించుకున్న ఎంపీ డీకే.అరుణ. స్వాగతంపలికి సన్మానించిన 20వ వార్డు బీజేపీ నాయకులుఅందెలసందీప్ యాదవ్.**

# ఘనంగా గణపతి నిమర్జనోత్సవాలు



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరం నది తీరంలో గణపతి నిమర్జనం ఉత్సవాలు ఘనంగా కొనసాగాయి. కాళేశ్వరంలోని అంతర్ రాష్ట్ర వంతెన పైనుంచి క్రేన్ల సహాయంతో వినాయకులను గోదావరి నదిలో నిమజ్జనం చేస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా వంతైన పైన ఏర్పాటు చేసిన ఫ్లాట్ ఫాం నుంచి వినాయక విగ్రహాలను నదిలోనికి నెట్టివేయడంతో భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. దీంతో భక్తులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఈ సంవత్సరం క్రేన్లను ఏర్పాటు చేసి వినాయక నిమజ్జనం ఉత్సవాలను అధికారులు ఘనంగా నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి తరలివస్తున్న వినాయకులను ఒక క్రమ పద్ధతిలో అంతర్రాష్ట్ర వంతెన వద్దకు తరలించి గజ ఈతగాళ్లు, క్రేన్ల సహాయంతో అధికారులు నదిలో నిమజ్జనం చేయిస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా మండల అధికారులు స్థానికంగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూస్తున్నారు. వివిధ ప్రాంతాల నుండి వస్తున్న భక్తులు వినాయకులను నిమజ్జనం చేసిన అనంతరం కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకుని ఆలయంలో పూజలు చేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం ప్రతి సంవత్సరం ఆలయ తలుపులు మూసి వేయకుండా రాత్రంతా భక్తులకు స్వామివారి దర్శనం కల్పిస్తున్నారు ఆలయ అధికారులు. అలాగే ఈ సంవత్సరం కూడా ఆలయం తెరచి ఉంచి భక్తులకు దర్శన సౌకర్యం కల్పిస్తామని ఆలయ అధికారులు తెలిపారు. నిమజ్జనం ఉత్సవాలు పూర్తయ్యే వరకు మద్యం దుకాణాలు మూసి వెయ్యాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో భూపాలపల్లి జిల్లాలో అన్ని మద్యం దుకాణాలు మూతపడ్డాయి. అయితే బెల్టు షాపులు జోరుగా నడుస్తున్నప్పటికీ ఎక్సైజ్ పోలీస్ శాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. వైద్య శాఖ ఆధ్వర్యంలో అంతర్రాష్ట్ర వంతెన వద్ద, నది తీరం వద్ద అంబులెన్సును ఉంచి మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి భక్తులకు వైద్య సౌకర్యం కల్పిస్తున్నారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో నదీతీరంలో గజ ఈతగాళ్లను ఉంచి భక్తులు లోపలికి వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పోలీసు, ఎక్సైజ్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిమజ్జనం ఉత్సవాలు శాంతియుతంగా జరిగేటట్లు చూడాలని, భక్తులు క్షేమంగా తిరిగి వెళ్ళేటట్లు తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చే దాదాపు 2వేల వినాయక విగ్రహాల వరకు కాళేశ్వర నది తీరంలో నిమజ్జనం జరగవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు.

## స్నేహితుడి భార్య పై అత్యాచార యత్నం

### బయటకు చెబుతుందేమోనని హత్య
### వివరాలు వెల్లడించిన శంషాబాద్ ఏసీపి శ్రీనివాసరావు



**విశ్వంభర, కొత్తూరు:** భర్త ఊరికి వెళ్లడంతో అతని స్నేహితుడు ఇంటికి వచ్చి భార్యపై అత్యాచార యత్నం చేశాడు. ఆమె ఒప్పుకోకపోవడంతో గొంతు నులిపి హత్య చేశాడు. ఈ సంఘటన ఈ నెల 12 న కొత్తూరులో జరిగింది. సోమవారం కొత్తూరు పోలీసులు కేసు మిస్టరీని ఛేదించి నిందితుడిని రిమాండ్ కు తరలించారు. శంషాబాద్ ఏసీపి శ్రీనివాసరావు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొత్తూరు మండలం ఇనుములనర్వ గ్రామానికి చెందిన యాదమ్మ (45) కొత్తూరులో అద్దె ఇంట్లో నివాసం ఉంటూ కూలీ పని చేస్తూ జీవనోపాధి పొందేది. యాదమ్మ భర్త రామా రావు అతని స్నేహితుడు బాబురావు(60) అడ్డా కులీలుగా పని చేసేవారు. రామారావు ఇటీవలే తన స్వగ్రామానికి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాబూరావు, యాదమ్మకు మద్యం తాపీ అత్యాచార యత్నం చేశాడు. ఆమె ఒప్పుకోకపోవడంతో విషయం బయట తెలుస్తుందని భయంతో బాబురావు యాదమ్మను గొంతు నులిమి చంపేశాడు. యాదమ్మ కుమార్తె రేణుక అదే రోజున పోలీసులకు ఫిర్యాదు చేసింది. కొత్తూరు సీఐ నరసింహారావు హత్య కింద కేసు నమో దు చేశారు. పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి విచారణ చేపట్టారు. సోమవారం అనుమానస్పదంగా తిరుగుతున్న బాబురావును పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించడంతో హత్య తానే చేసినట్లు ఒప్పుకున్నాడు. హత్య మిస్టరీని నాలుగు రోజుల్లో చేదించడంతో శంషాబాద్ ఏసీపీ శ్రీనివాసరావు, సీఐ నరసింహారావును, ఎస్సై జి, శ్రీనివాస్, కానిస్టేబుల్ రవీందర్, కుమార్, మహిపాల్ అభినందిస్తూ రివార్డుకుఅందజేస్తామని తెలిపారు. హత్యకుపాల్పడ్డ బాబురావును పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

## ఆటో మొబైల్ షాపును ప్రారంభించిన ఎమ్మెల్యే



**విశ్వంభర, వెల్దండ:** వెల్దండ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన కీర్తన ఆటోమొబైల్ షాప్ ను కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత స్వయం శక్తితో ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. యువత చేతులలో దేశ భవిష్యత్ ఉందని ఆయన అన్నారు. యువతకు అండగా ఉంటానని ఆయన తెలిపారు. అనంతరం షాప్ నిర్వాహకుడు మట్ట శివ గౌడ్ ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, మాజీ సర్పంచ్ ఎన్నం భూపతి రెడ్డి, సింగల్ విండో మాజీ చైర్మన్ వావిళ్ల సంజీవ యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోతీలాల్ నాయక్, యం.డి.రషీద్, తిరుపతి, మట్ట మదన్ గౌడ్, జంగిలి యాదగిరి, మారపల్లి శ్రీను, కిష్టాల్, పుల్లయ్య, పుట్ట శివకుమార్, మట్ట భరత్ గౌడ్, యం.డి సమీర్, ఆఫ్రోస్, సంపంగి అనిల్, విక్రం, మారమోని జీవన్ తదితరులు పాల్గొన్నారు.

## మండల అధ్యక్షుడిగా కరంటోతు శ్రీను నాయక్



**విశ్వంభర, నారాయణపూర్:** కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా కరంటోతు శ్రీను నాయక్ నియమితులయ్యారు. సోమవారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి శ్రీను నాయక్ కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని సాధారణ కార్యకర్త నుండి ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చూడాలని సూచించారు. పార్టీ అభివృద్ధికి తన శాయశక్తుల కృషి చేస్తానని ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి అందేలా చూస్తానని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సంపత్‌కు రాష్ట్ర కమిటీలో చోటు..



**విశ్వంభర,మహబూబాబాద్ :** జర్నలిస్ట్ హౌస్ సైట్స్ & వెల్ఫేర్ కమిటీ రాష్ట్రకార్యవర్గ సభ్యునిగా మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలకేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ బండి సంపత్ కుమార్ నియామకం.టియుడబ్ల్యూజే(ఐజేయు)లో అత్యంత కీలకమైన ఈ..రాష్ట్రకమిటీలో చైర్మన్ తోపాటు. ఏడుగురు మాత్రమే సభ్యులు ఉంటారు. కీలకమైన విభాగంలో రాష్ట్రకమిటీలో జిల్లా నుంచి స్థానం దక్కించుకున్న సంపత్‌ను మహబూబాబాద్ జిల్లాకమిటీ అభినందించింది.

## పెరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలించిన ఎంపీ



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ వియోచన దినోత్సవం సందర్భంగా పెరేడ్ గ్రౌండ్ లో ఏర్పాట్లను పరిశీలించి.. మీడియాతో మాట్లాడిన మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్. జాతి ఆత్మగౌరవాన్ని పణంగాపెట్టవద్దని చాలా సందర్భాల్లో మాట్లాడాం, కానీ ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నడూ స్పందించిన పాపాన పోలేదని. వాళ్ల స్వార్థకోణంలో ఆలోచించుకున్నారు తప్ప తెలంగాణ జాతి కోరుకునేటువంటి ఆలోచన చేయలేదని ఆయన విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే విమోచన దినాన్ని భాజాప్త జరిపి తీరుతామని చెప్పిన కేసీఆర్ కూడా రాజకీయ ఒత్తిళ్లకు లోనయ్యి తెలంగాణ జాతిని, ప్రజల ఆత్మగౌరవాన్ని అవమానపరిచాడన్నారు. తెలంగాణ ఉద్యమం కొనసాగుతున్న నాడు, కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా భారతీయ జనతా పార్టీ సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా జరుపుతామని చెప్పిందని గుర్తు చేశారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత, తెలంగాణ పేరు చెప్పుకున్న పార్టీ కూడా తెలంగాణ ఆత్మ గౌరవాన్ని కించపరిచింది. కాబట్టి ఆ బాధ్యతని నెత్తి మీద వేసుకొని, విమోచన దినోత్సవం అమలు చేసే దాంట్లో భాగంగా అధికారికంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా నాయకత్వంలో ఇక్కడ విమోచన దినోత్సవం జరుపుకుంటున్నామని ఈటల అన్నారు. కేంద్ర ప్రభుత్వం అధికారికంగా అన్ని రకాల లాంఛనాలతో ఉదయం 8 గంటలకు జండాను ఆవిష్కరించి తెలంగాణ స్వతంత్ర దినోత్సవాన్ని, విమోచన దినోత్సవం జరుపుకోబోతున్న సందర్భంగా మేధావులుగా, సంఘసంస్కర్తలుగా, రాజకీయ నాయకులుగా, చైతన్యపరులుగా అమరుల త్యాగాలను మరోసారి గుర్తు చేసుకుందామని తెలియజేశారు. వందల సంవత్సరాలు జరిగినటువంటి పోరాటంలో నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగాఅమరులయ్యారని ఈటల తెలిపారు.

## ఘనంగా వినాయక నిమజ్జనం



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** పెద్ద శంకరంపేట గ్రామంలో సోమవారం వినాయక నిమజ్జనాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై వినాయకుల నుంచి పట్టణ పురవీధుల గుండా ఊరేగింపుగా భజనలు కీర్తనలు చేస్తూ యువకులు మహిళలు నుత్యాలు చేస్తూ గణేష్ విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. పట్టణంలో నెలకొల్పిన నాలుగు వినాయక మండపాల నుండి గణేష్ విగ్రహాలను నిమజ్జనం కు తరలించారు. కార్యక్రమంలో మహిళలు, ప్రజలు పాల్గొన్నారు. పెద్ద శంకరంపేట సమీపంలోని తిరుమలాపూర్ చెరువులో విగ్రహాలను నిమజ్జనం చేశారు. నిమజ్జన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పెద్ద శంకరంపేట ఎస్సై శంకర్ నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## రూ. లక్ష వెయ్యి రూపాయలు పలికిన లడ్డు



**విశ్వంభర, పెద్ద శంకరం పేట:** పెద్ద శంకరంపేట మండల పరిధిలోని మక్త లక్ష్మాపూర్ గ్రామంలో విద్యార్థి యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద లడ్డు వేలంలో లక్ష వెయ్యి రూపాయల వేలం పాట పాడి బైండ్ల నవీన్ వినాయకుని లడ్డును దక్కించుకున్నారు. గతంలో ఎప్పుడూ లేనంతగా రికార్డు ధరలో నవీన్ లడ్డూను వేలం పాట పాడి తీసుకున్నారని వినాయక మంటప నిర్వహకులు, గ్రామస్తులు పేర్కొన్నారు.

## సాయి గణేష్ మహారాజ్ అసోసియేషన్ ప్రత్యేక పూజలు



**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం డివిజన్ సంజయ్ గాంధీ నగర్‌లో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సాయి గణేష్ మహారాజ్ యూత్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారి ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ లడ్డూ వేలం పాటలో 2,30,000 పెద్ద చంద్రకళ, రాములు దాత కొనుగోలు చేశారు. అన్నదానం దాత జైపాల్ రెడ్డి, విగ్రహ దాత పెద్ద అరుణ్ కుమార్ ఇప్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమం యూత్ అసోసియేషన్ సభ్యులు, పెద్ద అనిల్ కుమార్, హనుమంతరావు, సింగారయ్య, గోపాల్ రెడ్డి, పున్నారెడ్డి, రాములు కుమార, జైపాల్ రెడ్డి, రాజ కుమార్, పెద్ద వికిత అనిల్ పెద్ద ఆద్య, అరుణ్, బాయికాడి రేవతి, మూర్తి అనిల్ కుమార్, రాజశేఖర్, ఏ అనిల్, హరి, సత్యనారాయణ, గిరి, డాక్టర్ అజయ్, వీర మణికంఠ, సాయి, వినోద్, సతీష్ రెడ్డి, ప్రకాశ్ రెడ్డి, వివేక్, తదితరులు పాల్గొన్నారు.

## టీ.ఐ.ఐ.సీ కాలనీ లడ్డు వేలం పాట 2,41,000



**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం 129 వ డివిజన్ సూరారం లోని టీ.ఐ.ఐ.సీ కాలనీ గాయిత్రి అపార్ట్మెంట్ బ్లాక్ 1, బ్లాక్ 2 గణేష్ ఉత్సవ కమిటీ లో ఎం.ఎస్.ఆర్. ఆంజనేయులు లడ్డు 2,41,000 రూపాయలతో మునుపు ఎన్నడూ లేని విధంగా వేలం పాట పాడి రికార్డు స్థాయిలో కైవసం చేసుకున్నారు. వారు మాట్లాడుతూ గణనాథునికి ఇన్ని రోజులు పూజలు అందుకొని లడ్డు ప్రసాదంగా స్వీకరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గాయిత్రి అపార్ట్మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లం రాజేష్ గౌడ్, అసోసియేషన్ సభ్యులు ఆంజనేయులు కుటుంబాన్ని ఘనంగా సత్కరించారు. బ్యాండ్ మేళాలతో స్వాగతించారు. అపార్ట్మెంట్ వాసులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రూ. 2,22,000లకు లడ్డు కైవసం



**విశ్వంభర, మహేశ్వరం:** ప్రజలందరికీ అంతా మంచి జరగాలని ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు లింగం నరసింహ ముదిరాజ్ విఘ్నేశ్వరుని కోరారు. మహేశ్వరం తుక్కుగూడ మున్సిపల్ రావిరాల గ్రామంలో విఘ్నేశ్వర ఉత్సవాల భాగంగా రావిరాల గ్రామంలో సర్దార్ పటేల్ యువజన సంఘం ఆదివారంలో వేలంపాట నిర్వహించారు. సర్దార్ పటేల్ లడ్డు వేలం పాటలో పోటాపోటీగా పాట పాడి రికార్డు స్థాయిలో మొదటిసారిగా రూ. 2,22,000ల కు ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు లింగం నరసింహ ముదిరాజ్ లడ్డు నీ కైవసం చేసుకున్నారు. లింగం నరసింహ ముదిరాజ్ మాట్లాడుతూ ప్రజలందరికీ అంత మంచి జరగాలని విఘ్నేశ్వరుడు ప్రజలు కోరుకున్న కోరికలు నెరవేర్చి మంచి జరగాలని నరసింహ వినాయకుడిని ప్రార్థించారు. సర్దార్ పటేల్ వద్ద వేయించిన వేలంపాటలో లడ్డు దక్కడం నాకు చాలా సంతోషంగా ఉందని లింగం నరసింహ ముదిరాజ్ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## భక్తులకు అన్న ప్రసాదం, మంచినీరు పంపిణీ




**విశ్వంభర, మహబూబాబాద్:** మానుకోట జిల్లా కేంద్రంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల నిమర్జనం కార్యక్రమం సందర్భంగా సోమవారం భక్తులకు చుక్కల నరేష్ ఆధ్వర్యంలో 27వ వార్డు బెస్త బజార్ లో ప్రసాదము, మంచినీళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు యాప సీతయ్య, మండల ప్రజా పరిషత్ వైస్ చైర్మన్ మాజీ ఎల్ది మల్లయ్య గౌడ్, బీజేపీ పట్టణ అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్ మానుకోట పట్టణ జనసేన నాయకులు దుగ్గి రవిబీజేపీ రాష్ట్ర నాయకులు బోయినపల్లి లక్ష్మణరావు, మాజీ ఎంపీటీసీ ఐలయ్య, యువ నాయకులు కందుకూరి భరత్, చందర్, మల్లం యశ్వంత్,డోలిగణేష్,ఫైండ్లపవన్ కుమార్, వెలిశాల శ్రవణ్, దుగ్గి ప్రవీణ్, తరుణ్ పాల్గొన్నారు.

# కేరళలో నిపా కలకలం..

## మరోసారి మాస్క్ తప్పనిసరి..!




**ఢిల్లీ:** దేశంలో నిఫా వైరస్ కలకలం సృష్టిస్తున్నది. కేరళలో మరో కొత్త కేసు నమోదైంది. వైరస్ సోకిన 23 సంవత్సరాల వ్యక్తిగత సోమవారం మృతి చెందాడు. ఈ క్రమంలో వైరస్‌ని అదుపులో చేసేందుకు అధికారులు ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. మలప్పురం జిల్లాలో మరోసారి మాస్క్‌లను తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు మాస్క్ నిబంధన కొనసాగుతుందని అధికారులు తెలిపారు. అయితే, పుణేలోని వైరాలజీ నమూనాలను పంపగా.. నిఫా పాజిటివ్‌గా తేలిందని ఆరోగ్యశాఖ మంత్రి వీణాజార్జ్ తెలిపారు. మృతుడితో సన్నిహితంగా ఉన్న వ్యక్తులను గుర్తించేందుకు వైద్య ఆరోగ్యశాఖ, రెవెన్యూ అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఇక కేరళలో ఇప్పటి వరకు 2018 నుంచి ఆరు కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం 150 మందిని అబ్జర్వేషన్‌లో పెట్టగా.. ఇద్దరిలో జ్వరం లక్షణాలు ఉన్నట్లు సమాచారం.నిపా వెలుగు చూసిన నేపథ్యంలో ప్రోటోకాల్ మేరకు కఠిన నిబంధనలు అమలు లోకి తీసుకువచ్చారు. తిరువలి పంచాయతి పరిధిలో ఉన్న నాలుగు సినిమా థియేటర్లు, విద్యాసంస్థలను మూసివేయాల్సిందిగా ఆదేశించారు. ఒకేచోట జనం గుమిగూడొద్దని అధికారులు తెలిపారు. నిపా వైరస్ జంతువుల నుంచి మనుషులకు సోకుతుంది. ఇది జునోటిక్ వైరస్. ఈ వైరస్‌ను తొలిసారిగా 1999లో గుర్తించారు. వైరస్ ఫ్రూట్ బ్యాట్స్‌లో ఎక్కువగా కనిపిస్తుంది. వాటిపై వైరస్ ఎలాంటి ప్రభావం చూపదు. కానీ.. బ్యాట్స్ పండ్లను కొరికిన సమయంలో వాటిని జంతువులు తిన్న సందర్భాల్లో వైరస్ ప్రవేశిస్తుంది. జంతువుల నుంచి మనుషులకు సోకేందుకు అవకాశం ఉంటుంది.

# మునుగుతున్న తమ్ముడిని కాపాడి..

## నదిలో కొట్టుకుపోయిన అక్కాచెల్లెళ్లు

**డెహ్రాడూన్:** నదిలో మునిగిపోతున్న తమ్ముడ్ని చూసి అక్కాచెల్లెళ్లు ఆందోళన చెందారు. వెంటనే నదిలోకి దూకి తమ్ముడ్ని ఒడ్డుకు తోసి కాపాడారు. అయితే నదీ ప్రవాహంలో వారిద్దరూ కొట్టుకుపోయారు. ఈ విషయం తెలిసిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్‌లో ఈ సంఘటన జరిగింది. సోమవారం ఉదయం హరిపూర్ కలాన్‌లో గీతా కుటీర్ ఘాట్ వద్ద రెండు కుటుంబాలకు చెందిన ఐదుగురు పిల్లలు, ఒక మహిళ గంగా నదిలో స్నానం చేశారు.కాగా, తొమ్మిదేళ్ల సూరజ్ బలమైన ప్రవాహంలో కొట్టుకుపోసాగాడు. నదిలో మునిగిపోతున్న తమ్ముడ్ని చూసి అక్కాచెల్లెళ్లైన 15 ఏళ్ల సాక్షి, 13 ఏళ్ల వైష్ణవి వెంటనే నీటిలోకి దూకారు. సూరజ్‌ను నది ఒడ్డుకు తోసి అతడ్ని రక్షించారు. అయితే బలమైన నదీ ప్రవాహంలో అక్కాచెల్లెళ్లు కొట్టుకుపోయారు. ఈ విషయం తెలిసిన పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. రాష్ట్ర విపత్తు దళాన్ని రప్పించారు. గంగా నదిలో కొట్టుకుపోయిన ఇద్దరు బాలికల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# పట్టాలు తప్పిన గూడ్స్ ట్రైన్..

## రైళ్ల రాకపోకలకు అంతరాయం



**భోపాల్:** మధ్యప్రదేశ్‌లో ఓ గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. పశ్చిమ మధ్య రైల్వే పరిధిలో సోమవారం మధ్యాహ్నం 12:45 గంటలకు గూడ్స్ రైలు పట్టాలు తప్పినట్లు అధికారులు తెలిపారు.భోపాల్ సమీపంలోని మిస్రోడ్ - మండిదీప్ రైల్వే స్టేషన్ల మధ్య గూడ్స్ రైలుకు చెందిన మూడు బోగీలు పట్టాలు తప్పినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనతో ఆ మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న అధికారులు వెంటనే అక్కడికి చేరుకొని పరిస్థితిని పర్యవేక్షించారు. ఆ మార్గాన్ని పునరుద్ధరించే పనులు మొదలు పెట్టారు.

# చారిత్రక వాస్తవాలను తప్పుగా చూపిస్తున్నారు..

## సెప్టెంబర్ 17పై రాహుల్ గాంధీ, ఖర్గేలకు దాసోజు లేఖ



**విశ్వంభర, హైదరాబాద్:** సెప్టెంబర్ 17ని ప్రజాపాలన దినోత్సవంగా జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ తప్పుబట్టారు.రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, ఇతర సీనియర్ ఏఐసీసీ, టీపీసీసీ నాయకులను ఉద్దేశించి ఒక బహిరంగ లేఖ రాశారు దాసోజు శ్రవణ్. ఈ చర్య చారిత్రక వాస్తవాలను తప్పుగా సూచించడమే కాకుండా బీజేపీ యొక్క చారిత్రక రివిజనిజం వ్యూహంతో ప్రమాదకరంగా సరిపోతుందని వాదించారు. చారిత్రాత్మక పండుగను తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంగా మార్చి దోపిడీ చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీని కంటికి రెప్పలా చూసుకోని అమిత్ షా, కిషన్ రెడ్డి, బండి సంజయ్ వంటి ప్రముఖ బీజేపీ నేతలను కూడా సీఎం స్వయంగా ఆహ్వానించారు.రాజకీయ లబ్ధి కోసం రేవంత్ ఉద్దేశపూర్వకంగా చరిత్రను వక్రీకరిస్తున్నారా లేదా తన చర్యల యొక్క విస్తృత చిక్కుల గురించి ఆయనకు తెలియదా అని ఆయన ప్రశ్నించారు.రాష్ట్ర చిహ్నంలో ఉన్న ముఖ్యమైన సాంస్కృతిక చిహ్నాలను లక్ష్యంగా చేసుకోవడం మరియు తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని అణగదొక్కడం సహా రేవంత్ గతంలో చేసిన చర్యలను దాసోజు ఖండించారు.

# మణిపూర్ జిల్లాల్లో ఇంటర్నెట్‌పై ఆంక్షలు ఎత్తివేత



**ఇంఫాల్:** మణిపూర్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. ఇవాళ్టి నుంచి అయిదు జిల్లాల్లో ఇంటర్నెట్ పై ఉన్న ఆంక్షలను ఎత్తివేసింది. తక్షణమే ఆ ఆదేశాల్లో అమలులోకి వచ్చేశాయి. రాష్ట్రంలో ఉన్న శాంతి, భద్రతల పరిస్థితిపై సమీక్షించినట్లు హోంశాఖ కమీషనర్ ఎన్ అశోక్ కుమార్ తెలిపారు. అయితే ఇంటర్నెట్ పై ఉన్న ఆంక్షలను ఎత్తివేయాలని డిసైడ్ అయినట్లు తెలిపారు. సెప్టెంబర్ 10వ తేదీ నుంచి ఇంటర్నెట్ పై ఆంక్షలు అమలు చేశారు. సెప్టెంబర్ 13వ తేదీన బ్రాడ్‌బ్యాండ్ సేవలను పాక్షికంగా ప్రారంభించారు.విద్యార్థుల నిరసన నేపథ్యంలో ఇంఫాల్ ఈస్ట్, ఇంఫాల్ వెస్ట్, బిష్ణుపూర్,తౌబాల్, కాచింగ్ జిల్లాల్లో ఆంక్షలను విధించారు. మిలిటెంట్ల దాడి విషయంలో భద్రతా దళాలు విఫలం అయినట్లు విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఆ నిరసనల్లో జరిగిన కాల్పుల్లో సుమారు 80 మంది మరణించారు. దీంట్లో విద్యార్థులు, పోలీసులు కూడా ఉన్నారు.ఇంటర్నెట్‌ను పునర్ ప్రారంభిస్తున్నామని, యూజర్లు చాలా బాధ్యతాయుతంగా నెట్‌ను వాడుకోవాలని, అవసరమైన కాంటెంట్‌ను షేర్ చేయవద్దు అని సీఎం ఎన్ బీరేన్ సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు.

# ఆరోపణలు వచ్చినప్పుడే రాజీనామా చేయాల్సింది

- కేజ్రీవాల్ నిర్ణయంపై ఢిల్లీ బీజేపీ చీఫ్ వీరేంద్ర సచ్‌దేవ వ్యాఖ్యలు



**ఢిల్లీ:** సీఎం అరవింద్ కేజ్రీవాల్ అవినీతి సీఎం అని, ఆయనకు ఎలాంటి నైతిక విలువలు లేవని ఢిల్లీ బీజేపీ చీఫ్ వీరేంద్ర సచ్‌దేవ వ్యాఖ్యానించారు. సచ్‌దేవ సోమవారం ఢిల్లీలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. కేజ్రీవాల్ తనపై ఆరోపణలు వచ్చిన రోజే సీఎం పదవికి రాజీనామా చేయాల్సి ఉందని అన్నారు. ఆయన అలా చేయకపోగా జైలు నుంచి ప్రభుత్వం నడిపే డ్రామాకు తెరతీశారని దుయ్యబట్టారు.జైలు నుంచి వచ్చిన తర్వాత తన రాజకీయ అసహనాన్ని వెళ్లగక్కే క్రమంలో రాజీనామా డ్రామాను ముందుకు తెచ్చారని ఎద్దేవా చేశారు. అవినీతి సీఎం నుంచి తమకు విముక్తి లభించిందని ఢిల్లీ ప్రజలు ఇప్పుడు సంతోషిస్తారని తాను అనుకుంటున్నానని అన్నారు. కాగా, దేశ రాజధాని ఢిల్లీలో పొలిటికల్ హీట్ నెలకొంది.

మరో రెండు రోజుల్లో ఢిల్లీ సీఎం పదవికి తాను రాజీనామా చేస్తున్నట్లు ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, ఆయన రేపే సీఎం పదవికి రాజీనామా చేయనున్నట్టు తెలిసింది.

కేజ్రీవాల్ మంగళవారం లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా అపాయింట్‌మెంట్ కోరినట్లు ఆప్ వర్గాలు పేర్కొన్నాయి. రేపు సాయంత్రం 4:30 గంటలకు ఎల్జీని కేజ్రీ కలిసే అవకాశం ఉంది. ఆ తర్వాత తన రాజీనామాను ఆయనకు సమర్పించనున్నారని వార్తలు వచ్చాయి. కాగా, మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్ అరెస్టైన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో శుక్రవారం ఆయన తీహార్ జైలు నుంచి విడుదలయ్యారు. ఆ తర్వాత ఆదివారం ఆప్ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి తొలిసారి ప్రసంగించారు. ఈ సందర్భంగా తన రాజీనామా నిర్ణయాన్ని ప్రకటించారు.

# నిరసనకు ప్లాన్ చేసిన కార్మికులు..

## అదుపులోకి తీసుకుని నిర్బంధించిన పోలీసులు



**చెన్నై:** వేతనాలు పెంచాలని, మెరుగైన పని పరిస్థితులు కల్పించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. గత వారం రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికులు నిరసన ప్రదర్శనకు ప్లాన్ చేశారు. ఈ నేపథ్యంలో వంద మందికిపైగా కార్మికులను పోలీసులు అదుపులోకి తీసుకుని నిర్బంధించారు. తమిళనాడులోని చెన్నైలో ఈ సంఘటన జరిగింది. చెన్నై శివారు కాంచీపురంలోని శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ ఫ్యాక్టరీకి చెందిన కార్మికులు గత వారం రోజులుగా సమ్మె చేస్తున్నారు. వేతనాలు పెంచాలని, మెరుగైన పని పరిస్థితులు కల్పించాలని, సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటీయూ)ను కార్మిక సంఘంగా గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు.

కాగా, ఈ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న 1,800 మంది కార్మికుల్లో వెయ్యి మంది సమీపంలోని తాత్కాలిక టెంట్‌లలో కొన్నిరోజులుగా నిరసన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అన్ని సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు కార్మికులతో చర్చలు ప్రారంభించినట్లు శాంసంగ్ శుక్రవారం తెలిపింది. అయితే ఆ సంస్థతోపాటు రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో జరిపిన చర్చలు విఫలమయ్యాయి.

దీంతో సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించాలని కార్మికులు నిర్ణయించారు.మరోవైపు ఈ ప్రాంతంలో స్కూల్స్, కాలేజీలు, హాస్పిటల్స్ ఉన్నందున కార్మికుల నిరసన ర్యాలీకి పోలీసులు అనుమతి నిరాకరించారు. అయినప్పటికీ కార్మికులు సోమవారం నిరసనకు ప్లాన్ చేసినట్లు ఆరోపించారు. ఈ నేపథ్యంలో సుమారు 104 మంది కార్మికులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాంచీపురం సమీపంలోని ఒక కళ్యాణ మండపంలో వారిని నిర్బంధించారు. కాగా, సమ్మె చేస్తున్న ఈ కార్మికులకు మద్దతుగా తమిళనాడులోని అధికార డీఎంకే అనుబంధ కార్మిక సంఘంతో సహా 12 యూనియన్ గ్రూపులు బుధవారం చెన్నైలో నిరసన చేపట్టాలని నిర్ణయించాయి. అయితే దీనిపై శాంసంగ్ సంస్థ స్పందించలేదని రాయిటర్స్ వార్తా సంస్థ పేర్కొంది.

## వంద రోజుల ప్రణాళికలో

# ఒక్క హామీ నెరవేర్చలేదు

### మోదీ సర్కార్‌పై ఆదిత్య ఠాక్రే ఫైర్



**ముంబాయి :** ప్రధాని నరేంద్ర మోదీ, ఎన్డీయే వంద రోజుల ప్రణాళికలో చేసిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదని శివసేన నేత ఆదిత్య ఠాక్రే ఆరోపించారు. భారత్‌కు దిశానిర్దేశం చేసే సత్తా ఉన్న నూతన నాయకత్వం, ప్రభుత్వం అవసరమని అన్నారు. ఠాక్రే సోమవారం ముంబైలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ మోదీ సర్కార్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్డీయే ప్రభుత్వం ఓ దశ దిశ లేకుండా వ్యవహరిస్తున్నదని అన్నారు.నూతన, ప్రత్యామ్నాయ ప్రభుత్వంతో త్వరలో విపక్ష ఇండియా కూటమి అధికార పగ్గాలు చేపడుతుందని పేర్కొన్నారు. కాగా, జన గణన నిర్వహించకపోవడం మోదీ ప్రభుత్వ బలహీనతను వెల్లడిస్తోందని కర్నాటక మంత్రి, కాంగ్రెస్ నేత ప్రియాంక్ ఖర్గే అన్నారు. గణాంకాలు లేకపోవడంతో మోదీ ప్రభుత్వం విధాన వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోందని దుయ్యబట్టారు. ప్రియాంక్ ఖర్గే సోమవారం బెంగళూర్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఎన్డీయే అంటే నో డేటా అవైలబుల్ అని ఆయన అభివర్ణించారు.మరోవైపు రాహుల్ గాంధీపై కేంద్ర మంత్రి, బీజేపీ నేత రవ్‌నీత్ బిట్టూ చేసిన వ్యాఖ్యలను ఆయన తోసిపుచ్చారు. బీజేపీ నేతలు చిత్తశుద్ధి కోల్పోయారని తాను భావిస్తున్నానని చెప్పారు. రాహుల్ గాంధీకి వేర్పాటువాదులు, ఉగ్రవాదులే వత్తాసు పలుకుతారని బిట్టూ తీవ్ర వ్యాఖ్యలు చేయడాన్ని ఆయన తప్పుపట్టారు. తనకు తెలిసినంత వరకూ ఉగ్రవాదులు పార్లమెంట్ సభ్యులు కాలేరని అన్నారు. రాహుల్‌ను విమర్శించాలనుకునే వీరంతా తామే చెడుగా చిత్రీకరింపబడతారని వ్యాఖ్యానించారు. కాగా, అమెరికా పర్యటనలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను కేంద్ర మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టూ తీవ్రంగా ఖండించారు.

# 'వందే భారత్ స్లీపర్ ట్రైన్ వ్యయం 50 శాతం పెరిగింది'..

### టీఎంసీ ఎంపీ ఆరోపణ



**కోల్‌కతా:** కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టనున్న వందే భారత్ స్లీపర్ ట్రైన్ వ్యయం 50 శాతం పెరిగిందని టీఎంసీ ఎంపీ సాకేత్ గోఖలే ఆరోపించారు. గతంలో ఒక్కో రైలు తయారీ ఖర్చు రూ.290 కోట్లుగా మోదీ ప్రభుత్వం పేర్కొందని, ఇప్పుడు ఈ వ్యయం రూ.436 కోట్లకు పెరిగిందని విమర్శించారు. దీని వల్ల ఏ కాంట్రాక్టర్ లబ్ధి పొందుతున్నారని ఆయన ప్రశ్నించారు. సాకేత్ గోఖలే ఈ మేరకు సోమవారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. '200 వందే భారత్ స్లీపర్ రైళ్ల తయారీకి సంబంధించిన రూ.58,000 కోట్ల ఒప్పందాన్ని మోదీ ప్రభుత్వం సవరించింది. రైళ్ల సంఖ్యను 200 నుంచి 133కు తగ్గించింది. ఇంతకుముందు రూ.290 కోట్లు ఖరీదు చేసిన రైలు ఇప్పుడు రూ.436 కోట్లు అవుతున్నది. అన్నీ ఏసీ కోచ్‌లతో కూడిన ఈ రైలు ప్రయాణ ఖర్చును పేదలు భరించలేరు. వందే భారత్ కాంట్రాక్ట్ వ్యయం 50 శాతం పెరుగడం వల్ల ఎవరు ప్రయోజనం పొందుతున్నారు?' అని అందులో ప్రశ్నించారు.కాగా, టీఎంసీ ఎంపీ సాకేత్ గోఖలే ఆరోపణలపై రైల్వే మంత్రిత్వ శాఖ స్పందించింది. ఆయన వాదనలు తప్పని ఖండించింది. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయవద్దని కోరింది. స్లీపర్ ప్రాజెక్ట్‌లో పారదర్శకత కారణంగా ఒక్కో కోచ్ ధర అన్ని బెంచ్‌మార్క్‌ల కంటే తక్కువగా ఉందని తెలిపింది. 'కాంట్రాక్ట్‌లో ఉన్న మొత్తం కోచ్‌ల సంఖ్యను స్థిరంగా ఉంచాం. పొడవైన రైళ్లను తయారు చేయడానికి కోచ్‌ల సంఖ్యను 16 నుంచి 24కు పెంచాం. గతంలో 16 కోచ్‌లతో కూడిన 200 రైళ్లకు 3200 కోచ్‌లు అవసరం. ఇప్పుడు 24 కోచ్‌లతో కూడిన 133 రైళ్ల కోచ్‌లను 3192గా సవరించాం. రైలు పొడవు పెరిగినప్పటికీ ఆర్థికంగా చూస్తే మొత్తం కాంట్రాక్ట్ విలువ వాస్తవానికి తగ్గింది. రైలు ప్రయాణానికి ఉన్న అధిక డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని రికార్డు సంఖ్యలో (12000) నాన్ ఏసీ కోచ్‌లు కూడా తయారు చేస్తున్నాం' అని రైల్వే మంత్రిత్వ శాఖ ఎక్స్‌లో పేర్కొంది.

# చర్చలకు పిలిచిన మమత సర్కారు..

## అంగీకరించిన వైద్యులు..



**కోల్‌కతా:** కోల్‌కతాలో యువ డాక్టర్ అత్యాచారం, హత్య ఘటనపై నిరసన తెలుపుతున్న జూనియర్ డాక్టర్లకు బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఐదోసారి చర్చలకు ఆహ్వానించారు. చర్చలకు ఇదే చివరి ఆహ్వానమని స్పష్టం చేశారు. సమావేశం కాళీఘాట్ నివాసంలో సమావేశం జరుగనుండగా.. చర్చలకు హాజరయ్యేందుకు వైద్యులు అంగీకరించారు. సాయంత్రం 5 గంటలకు సమావేశానికి రావాలని ఆహ్వానించారు. అయితే, సమావేశం లైవ్ స్ట్రీమింగ్ చేయాలని వైద్యులు డిమాండ్ చేశారు. అయితే, లైవ్ స్ట్రీమింగ్ చేసేందుకు నిరాకరించిన ప్రభుత్వం.. వీడియో రికార్డ్ చేసేందుకు అంగీకరించింది. లైవ్ స్ట్రీమింగ్‌పై భిన్నాభిప్రాయాల నేపథ్యంలో ప్రభుత్వ చర్చలకు ఆహ్వానించినా వైద్యులు గైర్హాజరయ్యారు.రెండురోజుల అనంతరం వైద్యులకు ప్రభుత్వం ఆహ్వానం పంపింది. లేఖలో వైద్యులను చర్చల కోసం సంప్రదించడం ఐదోసారి అని.. ఇక ఇదే చివరిసారి అని పేర్కొంది. సీఎంతో చర్చలు జరిపేందుకు మరోసారి ఆహ్వానిస్తున్నామని.. కాళీఘాట్‌లోని సీఎం నివాసంలో ఓపెన్‌మైండ్‌తో చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు సీఎస్ మనోజ్ పంత్ వైద్యులకు రాసిన లేఖలో తెలిపారు. ఇంతకు ముందు ఈ నెల 14న సీఎంని కలిసిన వైద్యుల బృందాన్ని ప్రభుత్వ చర్చలకు ఆహ్వానించింది. 31 సంవత్సరాల ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటనలో న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వైద్యులు నిరసన తెలుపుతున్నారు.

# వరదలతో యూపీ అతలాకుతలం..

## 14 మంది మృతి



**లక్నో:** భారీ వర్షాలు, వరదలకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అతలాకుతలమవుతోంది. గత శనివారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి.గంగా, శారదా, ఘఘ్రా సహా తదితర నదులు ప్రమాదకర స్థాయిని మించి ప్రవహిస్తున్నాయి . దీంతో నదీ పరివాహ ప్రాంతాల్లోకి వరద పోటెత్తుతోంది. ఇక ఈ వర్షాల కారణంగా సంభవించిన ప్రమాదాల్లో ఇప్పటి వరకూ 14 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తాజాగా తెలిపారు.మీరట్‌లోని జాకీర్ కాలనీలో భవనం కూలిన ఘటనలో 10 మంది వరకూ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఇక గోండాలో ఆదివారం జరిగిన వేర్వేరు ఘటనల్లో ఓ మహిళ సహా ఇద్దరు వ్యక్తులు నీటిలో మునిగి చనిపోయారు. షాజహాన్‌పూర్‌లోని నది నుండి మేకను రక్షించే ప్రయత్నంలో ఇద్దరు పిల్లలు మునిగిపోయారు. మరో నలుగురు పిల్లల్ని కాపాడినట్లు షాజహాన్ పూర్ ఎస్పీ తెలిపారు. మరోవైపు ఉరుములు, పిడుగులతో కూడిన భారీ వర్షాలు పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో కురుస్తాయని వాతావరణ శాఖ ఇప్పటికే వెల్లడించింది. పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో సాధారణ వర్షపాతం నమోదవుతుందని తెలిపింది.

# కౌలు రైతులను విస్మరించిన కాషాయ సర్కార్

## మాజీ మంత్రి చిదంబరం



**చండీఘఢ్:** కౌలు రైతులను కాషాయ పాలకులు విస్మరించారని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి పీ చిదంబరం ఆరోపించారు. పీఎం కిసాన్ యోజనను కౌలు రైతులకు వర్తింపచేయడం లేదని ఆరోపించారు. చిదంబరం సోమవారం చండీఘఢ్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. దేశంలో మొత్తం సాగు భూమిలో 32 శాతం కౌలు రైతులు సాగుచేస్తున్నారని వివరించారు. రైతుల ప్రజాస్వామిక హక్కులను అణిచివేయడం బీజేపీ ప్రజాస్వామ్య వ్యతిరేక వైఖరిని బహిర్గతం చేస్తోందని దుయ్యబట్టారు. ఇక గత పదేండ్లుగా హరియాణలో పాలక బీజేపీ ప్రభుత్వం రైతులకు వ్యవసాయ రుణ వితరణలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కాగా, హరియాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి భంగపాటు తప్పదని కేంద్ర మంత్రి, హరియాణ మాజీ సీఎం మనోహర్ లాల్ ఖట్టర్ అన్నారు. కాంగ్రెస్‌తో పొత్తుకు ఏ పార్టీ ముందుకు రావడం లేదని చెప్పారు. రిజర్వేషన్లు, సిక్కులపై కాంగ్రెస్ నేతలు అసంబద్ధ వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు.హరియాణ సీఎం నయబ్ సింగ్ సైనీ నేతృత్వంలో రాష్ట్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లిందని అన్నారు. హరియాణలోని ఝజర్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రిజర్వేషన్ల తొలగింపుపై కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ అమెరికాలో చేసిన వ్యాఖ్యలు గర్హనీయమని పేర్కొన్నారు. రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ ఆలోచనలు బట్టబయలయ్యాయని అన్నారు. విదేశీ గడ్డపై రాహుల్ గాంధీ దేశాన్ని అవమానించేలా వ్యాఖ్యలు చేయడం ఆయనకు అలవాటుగా మారిందని మండిపడ్డారు.

గణేశ్ వేడుకలు చూసేందుకు వచ్చి...

# హోటల్ గదిలో యువతి ఆత్మహత్య

- మృతురాలు నర్సింగ్ విద్యార్థిని
- ముగ్గురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. చిన్న అంజయ్యనగర్‌లోని ఓ హోటల్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు చెందిన విద్యార్థిని (23). హైదరాబాద్‌లో గణేశ్ వేడుకలను చూసేందుకు రెండు రోజుల క్రితం ముగ్గురు స్నేహితులతో కలిసి ఆమె నగరానికి వచ్చారు. వీరిలో ఓ యువతి, మరో ఇద్దరు యువకులు ఉన్నారు. వీరంతా చిన్న అంజయ్యనగర్‌లోని ఒక హోటల్‌లో దిగారు. ఆదివారం రాత్రి భోజనం ముగించుకుని స్నేహితులు బయటకు వెళ్లారు. తనకు తలనొప్పిగా ఉందని విద్యార్థిని వారి వెంట వెళ్లకుండా హోటల్ గదిలోనే ఉండిపోయింది. సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు స్నేహితులు తిరిగి వచ్చారు. గదికి లోపలి నుంచి గడియ వేసుకుని ఎంతకీ తీయలేదు. హోటల్ సిబ్బందికి చెప్పడంతో వారు మాస్టర్ కీతో తలుపు తీశారు. విద్యార్థిని లోపల ఫ్యానుకు ఉరివేసుకుని మృతిచెందినట్లు గుర్తించారు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

**మాకు అనుమానాలున్నాయి: విద్యార్థిని తండ్రి**

తమ కుమార్తెపై అత్యాచారం చేసి హత్య చేశారని విద్యార్థిని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. దీనిపై గచ్చిబౌలి పోలీసులకు వారు ఫిర్యాదు చేశారు. తన కుమార్తె మృతిపై అనుమానాలున్నాయని యువతి తండ్రి తెలిపారు. ఆమె ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని చెప్పారు. ఆమె స్నేహితులు, హోటల్ సిబ్బందిపై అనుమానం వ్యక్తం చేశారు.

**ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నాం: ఏసీపీ**

హోటల్‌లో యువతి ఉరివేసుకుని చనిపోయినట్లు సోమవారం ఉదయం 4 గంటలకు డయల్ 100కు కాల్ వచ్చిందని ఏసీపీ శ్రీకాంత్ తెలిపారు. గదిలో బీరు సీసాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. పోస్ట్‌మార్టం తర్వాత పూర్తి విషయాలు తెలుస్తాయని చెప్పారు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని.. ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని తెలిపారు.

# చిరంజీవి, గల్లా అరుణ ఇతర ప్రముఖుల విరాళం

**సీఎం రేవంత్‌రెడ్డికి చెక్కులు అందజేత**



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** వరద బాధితుల సహాయార్థం పలువురు ప్రముఖులు సాయం అందజేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి ప్రముఖ నటుడు చిరంజీవి రూ. 50 లక్షలు విరాళం ఇచ్చారు. రామ్ చరణ్ తరఫున మరో రూ.50 లక్షలు అందజేశారు. ఈమేరకు సీఎం రేవంత్‌ను కలిసి చెక్కులను ఇచ్చారు. అమర్ రాజా గ్రూప్ తరఫున సీఎం సహాయనిధికి మంత్రి గల్లా అరుణ కుమారి రూ.కోటి విరాళం, సినీ నటులు అలీ రూ.3 లక్షలు, విశ్వక్ సేన్ రూ.10 లక్షలు అందజేశారు. సినీ నటుడు సాయిధరమ్ తేజ్ రూ.10 లక్షలు, గరుడపల్లి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ డైరెక్టర్ సంజయ్ గరుడపల్లి రూ.25 లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళంగా ఇచ్చారు.

# ఆంధ్రా, తెలంగాణ పేరిట కుట్రలను తిప్పికొడతాం

**ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం**



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు భారాసకు తగిన బుద్ధి చెప్తారని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. తిరుమల శ్రీవారిని వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో సోమవారం ఆయన దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అరెకపూడి గాంధీపై విమర్శలు చేసిన కౌశిక్ రెడ్డికి ప్రజలు బుద్ధి చెప్తారన్నారు. ఆంధ్రా, తెలంగాణ అంటూ చేసే కుట్రలను భగ్నం చేస్తామన్నారు. ఇప్పటికైనా కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్యేగా ప్రజా సమస్యలపై ఆలోచించాలని హితవు పలికారు. హైదరాబాద్ నగరంలోని చెరువుల్లో కబ్జాకు గురైన భూములను రక్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం హైడ్రాను తీసుకొచ్చినట్లు దానం నాగేందర్ తెలిపారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసమే సీఎం రేవంత్ రెడ్డి ఈ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. అన్యాక్రాంతమైన ప్రాంతాల్లో నివాసం ఉన్న వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు.

## కెనడాలో హైదరాబాద్ యువకుడి మృతి

**ఈతకొడుతూ దుర్మరణం**



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** కెనడాలో హైదరాబాద్ యువకుడు మృతిచెందాడు. మీర్‌పేట్‌కు చెందిన ప్రణీత్ అక్కడ ఎంఎస్ చదువుతున్నాడు. తన సోదరుడి పుట్టినరోజు సందర్భంగా స్నేహితులతో కలిసి టొరంటోలోని లేక్ క్లియర్‌కు ఈతకు వెళ్లాడు. అక్కడ ఈత కొడుతూ ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి చనిపోయాడు. దీంతో ప్రణీత్ కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# వినాయకునికి నేడే వీడుకోలు

(మొదటి పేజీ తరువాయి)

అందించామని తెలిపారు. నిమజ్జనం కోసం ట్యాంక్‌బండ్ చుట్టూ 135 క్రేన్లు, జీహెచ్‌ఎంసీ పరిధిలో 360 క్రేన్లను సిద్ధం చేసినట్టు తెలిపారు. భక్తులు కూడా శాంతియుతంగా నిమజ్జనం జరిగేలా సహకరించాలని కోరారు. మేయర్ ప్రత్యేక పూజలు : ఖైరతాబాద్ శ్రీ సప్తముఖ మహాశక్తి గణపతిని జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి దర్శించుకున్నారు. స్వామి వారి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం గద్వాల విజయలక్ష్మిని కమిటీ సభ్యులు సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మేయర్, నిమజ్జనం కోసం జీహెచ్‌ఎంసీ పరిధిలో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశామ న్నారు. నిమజ్జనం సాఫీగా సాగేందుకు ఎక్కడికక్కడ బేబీ పాండ్‌లను ఏర్పాటు చేశామన్నారు. 15 రోజులుగా నిమజ్జనం ఏర్పాట్ల కోసం పని చేస్తున్నట్టు వివరించారు.

**ఖైరతాబాద్ గణేశుని నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు**

ఖైరతాబాద్ గణేశ్‌ను నిమజ్జనానికి తరలించడానికి మచిలీపట్నానికి చెందిన టస్కర్ ఖైరతాబాద్‌కు చేరుకుంది. ప్రస్తుతం మహా గణపతి శోభాయాత్ర కోసం టస్కర్‌పై వెల్డింగ్ పనులు జరుగుతున్నాయి. 40 టన్నుల ఖైరతాబాద్ వినాయకుడిని టస్కర్ పైకి ఎక్కించడానికి దాదాపుగా గంట సమయం పట్టింది. మంగళవారం ఉదయం 6 గంటలకే పూజలు అన్ని పూర్తి చేసుకొని తరలించే విధంగా ప్రణాళిక సిద్ధం చేశారు. మధ్యాహ్నం 1.30 లోపు నిమజ్జనం పూర్తి అవుతుందని అధికారులు పేర్కొన్నారు. నిమజ్జన సమయంలో ఎలాంటి తొక్కిసలాట జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

**ప్రజలు సహకరించాలి..: కమిషనర్ ఆమ్రపాలి**

విశ్వంభర, హైదరాబాద్: గణేశ్ నిమజ్జనానికి విచ్చేస్తున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట తెలిపారు. సోమవారం నెక్లెస్ రోడ్డులో గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గణేశ్ నిమజ్జనానికి శానిటేషన్, ఇంజనీరింగ్, యుబిడి, యుసిడీ విభాగాలను చెందిన సిబ్బందితో కలిపి మొత్తం 15 వేల మంది మూడు షిఫ్ట్ లలో 24 గంటల పాటు భక్తులకు సేవలందిస్తారని తెలిపారు. నవరాత్రుల కోసం నెల రోజుల నుండి పలు దఫాలుగా అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో, ఇతర శాఖల సమన్వయ సమావేశాలతో ఎలాంటి లోటు పాట్లు లేకుండా పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రధాన కార్యాలయంతో పాటుగా జోనల్ స్థాయిలో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని పటిష్టమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

నగర వ్యాప్తంగా నిమజ్జనానికి 10 కంట్రోల్ రూమ్ లు, కమాండ్ కంట్రోల్ రూంలో అడిషనల్ కమీషనర్ స్థాయి అధికారులతో మూడు షిఫ్టుల్లో పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. నిమజ్జనం మరుసటి రోజు అదనంగా మరో 500 మంది సిబ్బందిని కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నగర వ్యాప్తంగా 73 వినాయక పాండ్స్, పెద్ద చెరువులలో నిమజ్జన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 468 క్రేన్ లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వినాయకులను నిమజ్జనానికి తీసుకు వచ్చేటప్పుడు కలర్ పేపర్లు వెద జల్లడం వలన, వాటిని శుభ్రం చేయడానికి శానిటేషన్ సిబ్బందికి ఇబ్బంది తలెత్తుతుందన్నారు. అందువల్ల భక్తులు అలాంటి కలర్ పేపర్లు రోడ్డు పై వెదజల్లకుండా శానిటేషన్ సిబ్బందికి సహకరించాలి అన్నారు. డిప్యూటీ కమిషనర్లు, ఇంజనీరింగ్, విద్యుత్, యుబిడీ, స్థానిక పోలీస్, ఉత్సవ కమిటీ సభ్యులతో కమిటీ లు వేసి ఊరేగింపునకు సమస్యలు రాకుండా చర్యలు తీసుకున్నామని అన్నారు. అలాగే గుర్తించి రోడ్డులలో మరమ్మతులు, శోభాయాత్రకు అడ్డురాకుండా చెట్టు కొమ్మలు నరికి వేయడం, డార్కు స్పాట్స్ లేకుండా వెంటనే చర్యలు తీసుకున్నట్లు, ఇంకా ఏమైనా ఇబ్బందులు ఉంటే నేడు తగు చర్యలు తీసుకున్నట్లు కమిషనర్ ఆమ్రపాలి కాట పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం జరుపుకోవాలని భక్తులను కోరారు.

# సంక్షేమ హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించండి

*** సీఎం రేవంత్‌కు హరీశ్ రావు బహిరంగ లేఖ**



**విశ్వంభర , తెలంగాణ బ్యూరో :** తెలంగాణలో విద్యావ్యవస్థ రోజురోజుకు పతనమవుతోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్మితమవుతుందన్న మాటలకు అత్యంత ప్రాధాన్యమిచ్చిన కేసీఆర్ రాష్ట్రంలో విద్యావ్యవస్థ బలోపేతానికి అనేక చర్యలు తీసుకున్నారని తెలిపారు . ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేశారన్నారు . పేద, మధ్య తరగతి విద్యార్థులు బాగా చదివి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలనే ఆలోచనతో పెద్ద సంఖ్యలో గురుకులాలను ఏర్పాటు చేశారని తెలిపారు . ఇందుకోసం పెద్ద మొత్తంలో నిధులు కేటాయించి ఆరోగ్యకరమైన వాతావరణంలో నాణ్యమైన విద్యను అందించారు. కానీ 9 నెలల మీ పాలన వల్ల ప్రభుత్వ విద్యావ్యవస్థ పతనావస్థకు చేరుకున్నదని తెలిపారు . పురుగులు లేని భోజనం కోసం, పాము కాట్లు, ఎలుక కాట్లు లేని వసతి కోసం, కనీస సౌకర్యాల కల్పన కోసం తరగతి గదుల్లో ఉండాల్సిన విద్యార్థులు రోడ్లెక్కి నిరసనలు తెలియజేస్తున్నారన్నారు . ఒకవైపు టీచర్లు లేని కారణంగా బడులు మూతబడుతుంటే, మరోవైపు ప్రభుత్వ బడుల మీద విశ్వాసం సన్నగిల్లడంతో డ్రాపౌట్స్ పెరిగిపోతున్నాయన్నారు . ప్రస్తుత ప్రభుత్వ లెక్కలే ఈ వాస్తవాలను చెబుతున్నాయని పేర్కొన్నారు . ఈ విద్యా సంవత్సరంలో ఒక్క విద్యార్థి లేని పాఠశాలలు 1864 ఉంటే, 30లోపు విద్యార్థులున్న పాఠశాలలు 9,447 ఉన్నాయి. వందలోపు విద్యార్థులు మాత్రమే ఉన్న పాఠశాలలు 9,609. అంటే మీ 9 నెలల మీ పాలనలో మొత్తం 26,287 ప్రభుత్వ పాఠశాలలకు గాను దాదాపు 20వేల పాఠశాలల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని వివరించారు.

**గురుకులాల పరిస్థితి మరింత అధ్వానం**

ఇక గురుకులాల పరిస్థితి మరింత అధ్వానంగా మారిందన్నారు . కేసీఆర్ పాలనలో ఎవరెస్ట్ శిఖరమంత ఖ్యాతి గడించిన గురుకులాలు కాంగ్రెస్ పాలనలో సమస్యలకు నిలయాలుగా మారాయన్నారు . గురుకులాల దుస్థితి గురించి వార్తలు నిత్యకృత్యమైనా మీ ప్రభుత్వానికి పట్టింపులేదని తెలిపారు . బిఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేండ్లలో కృషి చేసి పటిష్టపరిచిన గురుకులాలను మీ ప్రభుత్వం 9 నెలల్లోనే ధ్వంసం చేసిందన్నారు . సంక్షేమ హాస్టళ్లను, సంక్షోభ హాస్టళ్లుగా మార్చిందని తెలిపారు . పరిశుభ్రత లోపించి మురుగు, చెత్తా చెదారంతో నిండి కంపు కొడుతున్నాయని అన్నారు . పాఠశాల నుంచి కళాశాల వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఇలా ఏ హాస్టల్ చూసినా దుర్భర పరిస్థితులే ఉన్నాయని తెలిపారు . కుక్కకాటు, పాముకాటు, ఎలుక కాట్లతో విద్యార్థులు ఆసుపత్రుల పాలవుతున్నారని , ప్రతి రోజూ ఫుడ్ పాయిజన్ కేసులు నమోదవుతున్నాయన్నారు . ఈ విద్యాసంవత్సరంలో ఇప్పటి వరకు 715 మందికి పైగా విద్యార్థులు ఆస్పత్రుల పాలు కాగా, 40పైగా మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు . అత్యంత బాధాకరమైన విషయం ఇది. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు ప్రభుత్వ పాఠశాలలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యల వివరాలను ఈ లేఖ ద్వారా తెలియజేస్తున్నామన్నారు . వెంటనే ఈ సమస్యలను పరిష్కరించాలని బిఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు. ఆ వివరాలివి.

1. ఈ విద్యా సంవత్సరంలోనే దాదాపు 1900 పాఠశాలలు మూతపడ్డాయి. వాటిని తిరిగి ప్రారంభించి పేద విద్యార్థులకు విద్యను చేరువచేయండి.
2. పదోన్నతులు పొందిన కారణంగా ఏర్పడిన ఖాళీల్లో విద్యావాలంటీర్లను నియమించి విద్యా బోధన జరిగేలా చూడాలి.
3. పాఠశాలల్లో పారిశుద్ధ్యం లోపించింది. తాగునీటి వసతి లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే ఈ సమస్యలను పరిష్కరించాలి.
4. సీఎం బ్రేక్ ఫాస్ట్ స్కీంను అటకెక్కించారు. వెంటనే పునర్ ప్రారంభించి, స్కూల్ డ్రాపౌట్స్ తగ్గించేలా చూడాలి.
5. మార్చి నుంచి ఇప్పటి వరకు పెండింగ్ లో ఉన్న మధ్యాహ్న భోజన బిల్లులు వెంటనే విడుదల చేయాలి. గొడ్డుకారంతో పిల్లలు అన్నం తినే దుస్థిని మార్చండి.
6. ఎనిమిది నెలలుగా పెండింగ్ లో ఉన్న సంక్షేమ హాస్టళ్లలో పని చేసే అవుట్ సోర్సింగ్ టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగుల జీతాలు వెంటనే చెల్లించాలి.
7. పది నెలలుగా పెండింగ్ లో ఉన్న వసతి గృహాల అద్దెలు చెల్లించాలి. వసతి గృహాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలి.
8. ఈ ఏడాది ఏప్రిల్ నుండి సెప్టెంబర్ వరకు గురుకుల పాఠశాల విద్యార్థులకు రావాల్సిన రూ. 62 ( కాస్మోటిక్ రూ.50, హెయిర్ కటింగ్ రూ.12) ఇప్పటి వరకు అందలేదు.
9. కాలేజీ హాస్టల్ లో చదువుతున్న విద్యార్థులకు ప్రతి నెల అందాల్సిన రూ. 500 పాకెట్ మనీ ఇప్పటి వరకు అందలేదు. వెంటనే చెల్లించాలి.
10. పాఠశాల వసతి గృహాల్లో ఈ ఏడాది మార్చి, ఏప్రిల్, జూన్, జులై, ఆగస్టు నెలల డైట్ ఛార్జీలు పెండింగ్ లో ఉండగా, కళాశాల వసతి గృహాలకు సంబంధించి గత 7 నెలల నుంచి పెండింగ్ లో ఉన్నాయి.
11. వార్డెన్లు అప్పులు తెచ్చి, బంగారాన్ని కుదువపెట్టి విద్యార్థులకు భోజనాలు పెట్టే పరిస్థితి ఏర్పడింది. వెంటనే పెండింగ్ డైట్ ఛార్జీలను చెల్లించాలి. డైట్ ఛార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలు మార్కెట్ రేటుగా అనుగుణంగా పెంచాలి.
12. ఎస్సీ గురుకుల విద్యార్థులకు నాలుగు జతల స్కూల్ యూనిఫార్మ్స్ ఇప్పటి వరకు అందలేదు. వెంటనే అందించాలి.
13. వసతి గృహాల్లోని కిటికీలకు దోమలు రాకుండా ఉండేందుకు జాలీలు ఏర్పాటు చేయాలి. చలికాలంలో వేడి నీళ్లతో స్నానం చేసేందుకు గాను సోలార్ పలకల గీజర్లు ఏర్పాటు చేయాలి.
14. వసతి గృహాల నిర్వహణకు ప్రతి నెల ఇచ్చే పదివేల రూపాయలు వెంటనే విడుదల చేయాలి.
15. బీసీ వసతి గృహాలలో నేటి వరకు బెడ్ షీట్స్, కార్పెట్స్ సరఫరా జరుగలేదు. స్కూల్ బ్యాగ్స్, స్వెటర్సు, మంకీ క్యాప్స్, రగ్గులు, రెండు రకాల బూట్లు ఇప్పటి వరకు అందించలేదు. వెంటనే అందించాలని హరీశ్‌రావు కోరారు .

లడ్డూవేలంలో పాల్గొని ..స్టెప్పులేసి గుండెపోటుతో

## మరణించిన సాఫ్ట్ వేర్ ఇంజినీర్

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** వినాయక నవరాత్రి ఉత్సవాల్లో దేశ వ్యాప్తంగా జరుగుతున్నాయి. ఎంతో ఆనందోత్సాహాల మధ్య జరగాల్సిన వినాయక ఉత్సవాల్లో అక్కడక్కడ కొన్ని విషాద ఘటనల నేపథ్యంలో కుటుంబాల్లో చిచ్చు రేపుతున్నాయి. అటు వంటి విషాదకర ఘటన హైదరాబాద్ పట్టణంలోని సోమవారం మణికొండ అల్కాపురి కాలనీలో జరిగింది. ఇక్కడ వినాయక ఉత్సవాల్లో, వేలం పాటలో అప్పటి వరకు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్న సాఫ్ట్ వేర్ ఇంజినీర్.. గుండెపోటుతో మృతి చెందటంతో కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## ఓఆర్ఆర్ నుంచి పల్టీ కొడుతూ కిందపడిన లారీ

**డ్రైవర్ మృతి**



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** ఔటర్ రింగ్‌రోడ్డు పై నుండి లారీ అదుపుతప్పి పల్టీలు కొట్టి కింద సర్వీస్ రోడ్డుపై పడిన ఘటన సోమవారం హైదరాబాద్‌లో పెద్దఅంబర్‌పేట సమీపంలోని తారామతిపేట్ వద్ద జరిగింది. హైదరాబాద్ నగర శివారులోని ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్) పైనుంచి లారీ అదుపుతప్పి పల్టీలు కొట్టి కింద పడిపోయింది. ఘట్ కేసర్ నుంచి ఐరన్ లోడ్‌తో బెంగళూరు బయలుదేరిన లారీ.. అదుపుతప్పి పల్టీ కొడుతూ కిందున్న సర్వీస్ రోడ్డుపై పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతిచెందగా.. క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడి పరిస్థితి విషమంగా ఉంది. అబ్దుల్లాపూర్ మెట్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సీఎం అంజయ్యను ఏడిపించిన రాజీవ్ గాంధీ విగ్రహం అవసరమా?

**రేవంత్ రెడ్డిని ప్రశ్నించిన క్రిశాంక్**



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** తెలంగాణ రాష్ట్ర సచివాలయం ముందు రాజీవ్ గాంధీ విగ్రహాన్ని కాంగ్రెస్ సర్కార్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. సోమవారం సాయంత్రం 4 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు . ఈ విగ్రహావిష్కరణను బీఆర్ఎస్‌తో పాటు పలువులు తెలంగాణవాదులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన చోట రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఎలా పెడుతారని ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ నాయకుడు మన్నె క్రిశాంక్.. ఓ ఫొటోను సోమవారం ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు.. నాడు ఏపీ సీఎంగా ఉన్న అంజయ్యను పబ్లిక్‌లోనే రాజీవ్ గాంధీ తీవ్రంగా అవమానించారని గుర్తు చేశారు. రాజీవ్ మాటలకు అంజయ్య ఏడుస్తూ కనిపించారు. అదే నెలలో అంజయ్యను సీఎం పదవి నుంచి తొలగించారు. అలా అంజయ్యను అవమానించిన రాజీవ్ గాంధీ విగ్రహం.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం ముందుకు ఎందుకు..? అవసరమా..? అని రేవంత్ సర్కార్‌ను క్రిశాంక్ నిలదీశారు.

# ఎవరికి భయపడి విమోచన దినోత్సవం పేరు మార్చారు?

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ ప్రజాపాలన దేనికోసం, ఎవరికి భయపడి తెలంగాణ విమోచన దినోత్సవం పేరుతో అధికారికంగా ఉత్సవాలు నిర్వహించడం లేదని కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. పేరు మార్చి తెలంగాణ చరిత్రనే కనుమరుగు చేస్తున్నారని, నిజాంపై పోరాడి ప్రాణాలర్పించిన వారి త్యాగాలను అవమానిస్తున్నారని పేర్కొన్నారు. అందుకే తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమానికి తాను హాజరు కావడం లేదన్నారు. కాంగ్రెస్‌కు చేతనైతే తెలంగాణ విమోచన దినోత్సవం పేరుతో ఉత్సవాలు నిర్వహిస్తే తప్పకుండా తాను హాజరవుతానన్నారు. వారికి చేతకాకుంటే కేంద్రం పరేడ్ గ్రౌండ్‌లో అధికారికంగా నిర్వహిస్తున్న తెలంగాణ విమోచన దినోత్సవానికి హాజరు కావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే హైదరాబాద్‌లో సర్దార్ వల్లభ్‌భాయి పటేల్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.



**నిన్నటివరకూ హైడ్రా - నేడేమో విగ్రహాల పేరిట కొత్త నాటకానికి తెర**

సచివాలయం వద్ద రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు కాంగ్రెస్ రాజకీయ డ్రామాలకు నిదర్శనమని ఆరోపించారు. దమ్ముంటే ఆరు గ్యారంటీలపై శ్వేత పత్రం విడుదల చేయాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒకటేనని లోపాయికారీ ఒప్పందాలతోనే కాలం వెల్లదీస్తున్నాయని ఆరోపించారు. కావాలనే హైడ్రా, విగ్రహాల పేరిట రోజుకో లొల్లి పెట్టుకొని, ఆరు గ్యారంటీలను పక్కదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. కేజ్రీవాల్ సీఎం పదవికి రాజీనామా చేయడంపై ఇక్కడ కేసీఆర్ కుటుంబం ఖాళీగానే ఉంది కదా, ఆయన కుటుంబంలో ఎవరికో ఒకరికి ఆ పదవి ఇస్తారేమో అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. లిక్కర్ స్కాం కేసులో ఇరు కుటుంబాలకు మంచి సాన్నిహిత్యం ఉందని ఎద్దేవా చేశారు.

**పరేడ్ గ్రౌండ్ ఉత్సవాలకు రానున్న అమిత్‌షా**

సికింద్రాబాద్, మంగళవారం పరేడ్ మైదానంలో జరగ బోయే తెలంగాణ విమోచన దినోత్సవానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్ తెలిపారు. బీజేపీ నాయకులతో కలిసి ఈటల పరేడ్ మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం నిజం పరిపాలన నుంచి తెలంగాణ విముక్తి కోసం అమరులైన పోరాట యోధుల ఛాయాచిత్ర ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా తెలంగాణ స్వాతంత్ర్యం కోసం అమరులైన పోరాట యోధుల చరిత్రను ఈ జాతి ఎన్నటికీ మరువదని సంతకాల సేకరణ పట్టికలో లిఖించారు. ఎంతోమంది పోరాట యోధుల మూలంగానే నిజాం రజాకారుల నిరంకుశ పాలన నుంచి తెలంగాణ ప్రాంతానికి విముక్తి కలిగిందని, అందుకనే బీజేపీ విమోచన దినోత్సవం జరుపుతుందని అన్నారు. మంగళవారం ఉదయం 8 గంటలకు పరేడ్ మైదానంలో తెలంగాణ విమోచన దినోత్సవాలు ప్రారంభం కానున్నాయని ముఖ్య అతిథిగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా హాజరుకానున్నట్టు తెలిపారు. తెలంగాణ విమోచన దినం విషయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడడం వారి అసమర్థతను తెలియజేస్తుందని అన్నారు.

## ఐసీసీ అవార్డుల్లో శ్రీలంక జోరు..




**విశ్వంభర (క్రీడా విభాగం):** ఐసీసీ అవార్డుల్లో శ్రీలంక క్రికెటర్లు జోరు చూపించారు. ఆగస్టు నెలకు 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డులను కైవసం చేసుకున్నారు. పురుషుల విభాగంలో దునిత్ వెల్లలాగే, మహిళల కోటాలో ఆసియా కప్ హీరో హర్షిత సమరవిక్రమలు విజేతగా నిలిచారు. ఈ ఇద్దరూ టీమిండియాపై అద్భుత ప్రదర్శనకుగానూ ఈ అవార్డుకు ఎంపికవ్వడం విశేషం. వన్డే సిరీస్‌లో వెల్లలాగే బ్యాటుతో, బంతితో రాణించగా ఆసియా కప్ ఫైనల్లో సమరవిక్రమ చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడిన విషయం తెలిసిందే. ఆగస్టు నెల ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డుకు వెల్లలాగే, సమరవిక్రమలు ఎంపికైనట్టు ఐసీసీ తెలిపింది. ఆగస్టులో వెల్లలాగే, సమరవిక్రమలు సంచలన ఆటతో జట్టు విజయాల్లో భాగమయ్యారు. టీమిండియాపై వన్డే సిరీస్‌లో వెల్లలాగే అద్భుతంగా రాణించాడు. తొలి వన్డేలో 67 నాటౌట్, రెండో మ్యాచ్‌లో 37 పరుగులతో లంకను ఆదుకున్నాడు. ఆఖరి వన్డేలో 27 పరుగులకే ఐదు వికెట్లు తీసి రోహిత్ సేనను దెబ్బకొట్టి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు ఎగరేసుకుపోయాడు.

## కొరియాపై విజయ గర్జన..

### వరుసగా రెండోసారి ఫైనల్లో టీమిండియా




**విశ్వంభర (క్రీడా విభాగం):** ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో భారత పురుషుల హాకీ జట్టు అజేయంగా ఫైనల్‌కు దూసుకెళ్లింది. కొరియాపై సంపూర్ణ ఆధిపత్యం చెలాయించిన టీమిండియా భారీ తేడాతో జయభేరి మోగించింది. ఆదివారం జరిగిన రెండో సెమీస్‌లో భారత ఆటగాళ్ల ధాటికి కొరియా డిఫెన్స్ కకావికలం అయింది. ఆరంభం నుంచి ప్రత్యర్థిని వణికించిన టీమిండియా 4-1తో కొరియాకు చెక్ పెట్టింది. టైటిల్ పోరులో ఆతిథ్య చైనాతో హర్మన్‌ప్రీత్ సింగ్ బృందం తలపడనుంది.ఒలింపిక్స్‌లో వరుసగా రెండో కాంస్యంతో చరిత్ర సృష్టించిన భారత జట్టు మరో టైటిల్‌కు చేరువైంది. డిఫెండింగ్ చాంపియన్‌గా ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో అడుగపెట్టిన టీమిండియా వరుస విజయాలతో ఫైనల్ చేరింది. ఆదివారం కొరియాపై చాంపియన్ తరహా ఆటతో రెచ్చిపోయిన హర్మన్‌ప్రీత్ సింగ్ బృందం 4-1తో విజయ గర్జన చేసింది.



# పాకిస్థాన్‌పై సంచలన విజయం.. తొలిసారి ఫైనల్లో ఆతిథ్య జట్టు

**విశ్వంభర (క్రీడా విభాగం):** ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో ఆతిథ్య చైనా చరిత్ర సృష్టించింది. తొలిసారి ఫైనల్‌కు దూసుకెళ్లింది. సోమవారం జరిగిన సెమీఫైనల్లో మూడుసార్లు చాంపియన్పాకిస్థాన్‌ను చైనా చిత్తుగా ఓడించింది. ఆట ఆరంభం నుంచి పాక్ జట్టుకు ముచ్చెమటలు పట్టించిన చైనా ఆటగాళ్లు 1-1తో స్కోర్ సమం చేశారు. ఆ తర్వాత జరిగిన పెనాల్టీ షూటౌట్‌లోనూ చైనా ఆటగాళ్లు అద్భుతం చేశారు. 2-0తో ఆధిపత్యం కనబరిచి పాక్‌ను సాగనంపారు. లీగ్ దశలో భారత జట్టు చేతిలో ఓడిన చైనా ఆ తర్వాత పుంజుకుంది. కీలకమైన క్వార్టర్ ఫైనల్లో 2-0తో జపాన్‌పై విజయం సాధించింది. దాంతో, పాయింట్ల పట్టికలో మూడో స్థానంతో సెమీస్ బెర్తు దక్కించుకుంది. అయితే.. పాకిస్థాన్‌ను దాటి ఫైనల్ వెళ్లడం ఆతిథ్య జట్టుకు కష్టమే అనుకున్నారంతా. కానీ, ఆ జట్టు ఆటగాళ్లు తమ దేశం చిరకాల కలను నిజం చేయాలనే ఉద్దేశంతో కసితో ఆడారు. నిర్ణీత సమయంలో 1-1తో స్కోర్ సమం చేసి మ్యాచ్‌ను పెనాల్టీ షూటౌట్‌కు తీసుకెళ్లారు. అక్కడ కూడా చైనా గోల్‌కీపర్ పాక్ ఆటగాళ్ల ఎత్తులను చిత్తు చేయడంతో చైనా చిరస్మరణీయ విజయం నమోదు చేసింది. ఫైనల్లో చైనాతో తలపడేది ఎవరో మరికాసేపట్లో తేలనుంది. రెండో సెమీ ఫైనల్లో ఆడుతున్న భారత్, కొరియాలలో ఒకరిని టైటిల్ పోరులో చైనా ఢీకొట్టనుంది. చైనా చేతిలో ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించిన జపాన్ ఐదో స్థానం కోసం మలేషియాతో తలపడనుంది.

# ఆ రికార్డు ఒక్కటే వెలితి..

## ఒకే ఓవర్లో ఆరు సిక్సర్లు బాదాలి

## ఎప్పుడు నిజమయ్యేనో..!: అశ్విన్



**విశ్వంభర (క్రీడా విభాగం):** భారత జట్టు సీనియర్ ఆటగాడు రవిచంద్రన్ అశ్విన్ వ్యక్తిగతంగా ఎన్నో రికార్డులు నెలకొల్పాడు. టీమిండియా తరపున అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా నిలిచిన అశ్విన్ ఓ రికార్డుపై కన్నేశాడు. ప్రపంచలోనే మేటి స్పిన్నర్లలో ఒకడైన అతడు ఆ రికార్డు మాత్రం సాధించలేకపోయాడు. అవును.. ఇప్పటికీ అది నిజం కాలేదట. ఈ విషయాన్ని బంగ్లాదేశ్‌తో తొలి టెస్టుకు ముందు యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ అశ్విన్ వెల్లడించాడు. ఇంతకూ ఏంటా రికార్డు? ఎంటా కథా? టీమిండియా చిరస్మరణీయ విజయాల్లో భాగమైన అశ్విన్ ఆశపడుతున్న రికార్డు ఏంటంటే.. ఒకే ఓవర్లో ఆరు సిక్సర్లు కొట్టడం. అవును.. ఇదే అతగాడి కల. 'నాకో కోరిక ఉంది. ఒకే ఓవర్లో ఆరు సిక్సర్లు బాదాలి. ఆరు సిక్సర్ల రికార్డు నా పేరుతో ఉండాలని అనుకున్నా. కానీ, ఇప్పటికీ అది నిజం కాలేదు. నా సుదీర్ఘ కెరీర్‌లో అదొక్కటే వెలితి ఉండిపోయింది' అని అశ్విన్ అన్నాడు.

**వందో టెస్టు క్యాప్ అందుకుంటూ...**

సొంత మైదానమైన చెపాక్‌లో చెలరేగిపోవాలని భావిస్తున్న అశ్విన్ తన కెరీర్ గురించి కూడా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'ఇంకెన్ని రోజులు క్రికెట్ ఆడుతారు? మీ భవిష్యత్ ప్రణాళికలు ఏంటీ?' అనే ప్రశ్నలకు అశ్విన్ నిజాయతీగా సమాధానం చెప్పాడు. 'ఏ రోజు అయితే నాకు మెరుగుపడాలనే ఆలోచన రాదో.. ఆ రోజు ఆటకు వీడ్కోలు పలుకుతా' అని ఒక్క ముక్కలో తేల్చేశాడు. 2011 నవంబర్‌లో సుదీర్ఘ ఫార్మాట్‌లో అరంగేట్రం చేసిన ఈ స్పిన్ మాంత్రికుడు ఇప్పటివరకూ 516 వికెట్లు పడగొట్టాడు. మరోవైపు బ్యాటుతోనూ ఆపద్బాంధవుడి పాత్ర పోషిస్తూ 5 సెంచరీలు బాదేశాడు.




# అండర్ 19 వరల్డ్ కప్ హీరోకు పిలుపు

- వన్డే సిరీస్ కు పేసర్ గ్జావియర్ బార్టెలెట్ స్థానంలో మహిల్ ఎంపిక

**లండన్:** ఇంగ్లండ్ పర్యటనలో పొట్టి సిరీస్ పంచుకున్న ఆస్ట్రేలియా వన్డే సిరీస్‌పై గురి పెట్టింది. అందుకు తగ్గట్టే జట్టు కూర్పులో మార్పులు చేసింది. అండర్-19 వరల్డ్ కప్‌లో చెలరేగిన మహిల్ బియర్డ్‌మన్ ను స్క్వాడ్‌లోకి తీసుకుంది. టీ20 సిరీస్ సమయంలో గాయపడిన పేసర్ గ్జావియర్ బార్టెలెట్ స్థానంలో మహిల్‌ను ఎంపిక చేసినట్టు ఆస్ట్రేలియా సెలెక్టర్లు చెప్పారు. జూనియర్ స్థాయి క్రికెట్‌లో పేస్ సంచలనంగా మారిన బియర్డ్‌మన్ గంటకు 140 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేయగలడు. అండర్ -19 వరల్డ్ కప్‌లో ఆస్ట్రేలియా చాంపియన్‌గా నిలవడంలో బియర్డ్‌మన్ కీలక పాత్ర పోషించాడు. ఫైనల్లో టీమిండియాపై మూడు వికెట్ల(3-15)తో చెలరేగాడు. దాంతో, అతడిని మాజీ ఆటగాళ్లు ఆసీస్ క్రికెట్‌లో భావి తారగా అభివర్ణించారు. అనుకున్నట్టే ఇప్పుడు బియర్డ్‌మన్ కల నిజమైంది. సీనియర్ జట్టుకు ఆడే రోజు రానే వచ్చింది. ఇంగ్లండ్‌పై త్వరలో జరుగబోయే వన్డే సిరీస్‌లో ఈ యువ పేసర్ అరంగేట్రం చేయనున్నాడు. మొదటి సిరీస్‌లో మెరిసి.. కెరీర్‌ను ఘనంగా మొదలెట్టాలని బియర్డ్‌మన్ భావిస్తున్నాడు. ఆస్ట్రేలియా వన్డే స్క్వాడ్ : ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మార్నస్ లబూషేన్, గ్లెన్ మ్యాక్స్‌వెల్, మాథ్యూ షార్ట్, స్టీవెన్ స్మిత్,మిచెల్ మార్ష్ (కెప్టెన్), సియాన్ అబాట్, అలెక్స్ క్యారీ, కూపర్ కొన్నిల్లి, బెన్ ద్వారుషుయిస్, జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్, కామెరూన్ గ్రీన్, అరోన్ హార్డీ, జోష్ హేజిల్‌వుడ్, మిచెల్ స్టార్క్, ఆడం జంపా. మహిల్ బియర్డ్‌మన్.

## రెజ్లింగ్ ఛాంపియన్స్ సూపర్ లీగ్ ప్రారంభించనున్న

# సాక్షి మాలిక్, గీతా ఫొగాట్

**ఢిల్లీ:** భారత స్టార్ రెజ్లర్లు సాక్షి మాలిక్, గీతా ఫొగాట్ , అమన్ సహ్రావత్ సరికొత్త ప్రకటన చేశారు. త్వరలో తాము రెజ్లింగ్ ఛాంపియన్స్ సూపర్ లీగ్ ను ఆవిష్కరిస్తామని తెలిపారు. వర్ధమాన క్రీడాకారుల కోసం దీనిని ప్రారంభించనున్నట్లు తెలిపారు. అయితే దీనికి జాతీయ రెజ్లింగ్ ఫెడరేషన్ నుంచి మద్దతు కావాల్సి ఉంది. రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు బ్రిజ్భూషణ్ సింగ్పై లైంగిక వేధింపులు ఆరోపణలు చేస్తూ గత ఏడాది దేశ రాజధాని ఢిల్లీలో నిరసన దిగిన కుస్తీ యోధుల్లో సాక్షి మాలిక్ కూడా ఉంది. వారిలో వినేశ్ ఫొగాట్, బజరంగ్ పునియా కాంగ్రెస్లో చేరిన సంగతి తెలిసిందే. ఫొగాట్కు హరియాణాలోని జులానా నియోజకవర్గం నుంచి హస్తం పార్టీ టికెట్ కూడా ఇచ్చింది. అయితే వారితో కలిసి సాక్షి రాజకీయాల్లో చేరలేదు. ఆమె 2016లో జరిగిన రియో ఒలింపిక్స్లో 58 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించిన సంగతి తెలిసిందే. 2012లో జరిగిన వరల్డ్ ఛాంపియన్ షిప్ లో 55 కేజీల విభాగంలో గీత కాంస్య పతకాన్ని దక్కించుకుంది. ఇటీవల జరిగిన పారిస్ ఒలింపిక్స్లో అమన్.. 57 కిలోల విభాగంలో ఉడుంపట్టు పట్టి కంచు మోగించాడు. సాక్షి, నేను చాలా కాలంగా ఈ లీగ్ ని ప్లాన్ చేస్తున్నాము. త్వరలోనే ఇది తుది రూపు దాల్చనుంది. మేము ఇంకా సమాఖ్యతో మాట్లాడలేదు. కానీ ప్రభుత్వం, సమాఖ్య మాకు మద్దతు ఇస్తే చాలా బాగుంటుంది. ఇది ఆటగాళ్లు మాత్రమే నిర్వహించే మొదటి లీగ్ అవుతుంది. ఇది ఆటగాళ్ల ప్రయోజనం కోసం చేస్తున్నాం. ఇది మాకు గర్వించదగ్గ క్షణం" అని ఫొగాట్ వెల్లడించింది.



# త్వరలో టీ20 ప్రపంచకప్.. టీమిండియా ఫోకస్ అంతా దానిపైనే

హర్మన్ ప్రీత్




**విశ్వంభర (క్రీడా విభాగం):** అక్టోబర్లో ప్రారంభంకానున్న టీ20 ప్రపంచ కప్ ముందు మానసికంగా మరింత బలంగా ఉండేందుకు టీన్ఇండియా ప్రయత్నిస్తోందని కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ తెలిపారు. టీ20 క్రికెట్లో చివరి మూడు, నాలుగు ఓవర్లు చాలా కీలకమని.. అప్పుడు మానసికంగా బలంగా ఉన్న జట్టు మ్యాచ్లో విజయం సాధిస్తుందని వివరించింది. టీమ్ ఇండియా టీ20 వరల్డ్ కప్ గ్రూప్ దశలో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, శ్రీలంక, పాకిస్థాన్ వంటి బలమైన జట్లను ఢీకొట్టనుంది. "మానసికంగా దృఢంగా ఉండటం కోసం మేం చాలాకాలంగా పని చేస్తున్నాం. మ్యాచ్లో చివరి 3- 4 ఓవర్లు అత్యంత కీలకం. టీ20 క్రికెట్ చిన్న ఫార్మాట్ కాదు. 40 ఓవర్లు మ్యాచ్ ఆడాలి. చివరి 4-5 ఓవర్లలో మానసికంగా బలంగా ఉన్న జట్టు మ్యాచ్ గెలుస్తుంది. మేమిప్పుడు దానిపై దృష్టిసారించాం. చివరి ఐదు ఓవర్లలో మానసికంగా స్థిరంగా ఉండగలిగితే జట్టు విజయానికి ఏం అవసరమో వాటిని అమలు చేయొచ్చు. ఈ సమస్యను రానున్న ప్రపంచకప్లో అధిగమిస్తామని ఆశిస్తున్నాం. మా జట్టులోని ఆటగాళ్లందరూ వివిధ రాష్ట్రాలకు చెందినవారు. టీమ్లో చాలా డిఫరెంట్ క్యారెక్టర్ని చూసినప్పుడు చాలా బాగుంటుంది. వివిధ రాష్ట్రాలకు చెందిన ఆటగాళ్లతో డ్రెస్సింగ్ రూమ్ను పంచుకోవడం వలన వారి సంస్కృతుల గురించి తెలుసుకోవచ్చు. నాకు తెలిసి క్రీడల్లో మాత్రమే ఇలాంటి అవకాశం లభిస్తుంది. ఇది ఒక అందమైన అనుభూతి. జట్టులోని అమ్మాయిలందరూ నిజంగా మంచివారు. వినయపూర్వకంగా ఉంటారు. వాళ్లతో కలిసి డ్రెస్సింగ్ రూమ్ని పంచుకోవడం, కలిసి క్రికెట్ ఆడడం చాలా గొప్పగా అనిపిస్తుంది" అని హర్మన్ ప్రీత్ కౌర్ వివరించింది. టీ20 ప్రపంచకప్లో భారత్ అక్టోబర్ 4న న్యూజిలాండ్ తొలి మ్యాచ్ ఆడనుంది.

# యూపీఐ యూజర్లకు ఎన్‌పీసీఐ గుడ్‌న్యూస్..

- యూపీఐ లైట్‌లో అక్టోబర్ నుంచి కొత్త సర్వీస్..!

**విశ్వంభర (బిజినెస్):** నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా యూపీఐ యూజర్లకు గుడ్‌న్యూస్ చెప్పింది. త్వరలో యూపీఐ లైట్ యూజర్ల కోసం ఆటో టాప్ అప్ సర్వీస్‌ని ప్రారంభించనున్నట్లు వెల్లడించింది. ఆటో టాప్-అప్ సహాయంతో యూజర్లు తమ బ్యాంకు నుంచి యూపీఐ లైట్‌లో తరుచూ డబ్బులను డిపాజిట్ చేయాల్సిన అవసరం లేకుండా ఆటోమేటిక్‌గా డిపాజిట్ కానున్నాయి. ఈ ఏడాది అక్టోబర్ 31 నుంచి ఆటో టాప్-అప్ సర్వీస్ అందుబాటులోకి రానున్నది. ఈ మేరకు ఎన్‌పీసీఐ తాజాగా ఓ సర్క్యులర్‌ను జారీ చేసింది. కస్టమర్స్ ఎప్పుడైనా ఈ సర్వీస్‌ని ఆఫ్ చేసుకునేందుకు అవకాశం కూడా ఉంటుంది.

**యూపీఐ పిన్ అవసరం లేకుండా..**

చిన్న చిన్న చెల్లింపుల కోసం యూపీఐ లైట్‌ని ఎన్‌పీసీఐ ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. రూ.500 వరకు చెల్లింపుల కోసం యూపీఐ పిన్ అవసరం లేకుండా డబ్బులు పంపే అవకాశం ఉంది. అంతకంటే ఎక్కువ మొత్తం ఉంటే మాత్రం యూపీఐ పిన్‌ని ఎంటర్ చేయాల్సిన అవసరం ఉంది. కస్టమర్లు బ్యాంకు ఖాతా నుంచి యూపీఐ లైట్ అకౌంట్‌కి డబ్బులు జమ అయ్యేందుకు నిర్ణీత మొత్తాన్ని నిర్ణయించుకోవాల్సి ఉంటుంది. యూజర్ ఒకసారి టాప్-అప్‌గా రూ.1000 అమౌంట్‌ని పరిమితిగా సెట్ చేసుకున్నట్లయితే.. యూపీఐ లైట్ వాలెట్‌లో బ్యాలెన్స్ అయిపోయిన వెంటనే ఆటోమేటిక్‌గా రూ.1000 జమవుతాయి. ఎక్కువగా తక్కువ మొత్తాన్ని యూపీఐ ద్వారా చెల్లింపు చేసేవారికి ఎంతో సౌకర్యవంతంగా ఉండనున్నది.

**రోజులో గరిష్ఠంగా..**

యూపీఐ లైట్ వాలెట్ గరిష్ఠ పరిమితి రూ.2వేలు మాత్రమే. ఆ తర్వాత రూ.2వేలు మాత్రమే ఆటో-టాప్అప్ చేసుకునేందుకు వీలుంటుంది. ఈ సూచనలు బ్యాంకులు, కంపెనీలకు వర్తిస్తాయి. జారీ చేసే బ్యాంకులు యూపీఐ లైట్ ఆటో టాప్ అప్ సర్వీస్‌ని అందిస్తాయి. ఒక రోజులో గరిష్ఠంగా ఐదుసార్లు మాత్రమే బ్యాంక్ ఖాతా నుంచి యూపీఐ లైట్ అకౌంట్‌కి నిర్ణీత మొత్తాన్ని యాడ్ చేసుకునేందుకు వీలుంటుంది. సంబంధిత థర్డ్ పార్టీ పేమెంట్ యాప్ సర్వీస్ కంపెనీలు, బ్యాంకులు మాండేట్ సదుపాయాన్ని అందించే సమయంలో వెరిఫై చేయాల్సి ఉంటుంది.






## స్పీడు తగ్గించని హెబ్బాపటేల్

# హనీమూన్ ఎక్స్‌ప్రెస్

కుమారి 21ఎఫ్ సినిమాతో ఎంట్రీలోనే సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది ముంబై భామ హెబ్బా పటేల్. ఆ తర్వాత పలు చిత్రాల్లో మెరిసిన ఈ బ్యూటీ చైతన్యరావుతో కలిసి నటించిన చిత్రం హనీమూన్ ఎక్స్‌ప్రెస్. బాల రాజశేఖరుని రైటర్ కమ్ డైరెక్టర్‌గా వ్యవహరించిన ఈ చిత్రం జూన్ 21న థియేటర్లలో విడుదల కాగా.. మిశ్రమ స్పందన రాబట్టుకుంది. ఇక రెండు నెలల తర్వాత ఆగస్టు 27న పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం అమెజాన్ ప్రైమ్ వీడియోలోకి ఎంట్రీ ఇచ్చింది. ప్రేమ, పెండ్లి, విడాకుల కాన్సెప్ట్‌తో యూత్‌ను ఆకట్టుకుంటూ ఓటీటీలో సక్సెస్‌ఫుల్‌గా స్ట్రీమింగ్ అవుతోంది. తాజాగా హనీమూన్ ఎక్స్‌ప్రెస్ ప్రైమ్‌లో 40 మిలియన్లకుపైగా స్ట్రీమింగ్ మినిట్స్‌తో అందరి అటెన్షన్‌ను తమ వైపునకు తిప్పుకుంటోంది. మరి రాబోయే రోజుల్లో ఎలాంటి ట్రెండ్ క్రియేట్ చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది.ఈ చిత్రంలో తనికెళ్ల భరణి, సుహాసిని కీలక పాత్రల్లో నటించగా.. అరవింద్ కృష్ణ, అలీ, సురేఖ వాణి, రవి వర్మ ఇతర కీ రోల్స్ పోషించారు. ఈ చిత్రాన్ని ఎన్ఆర్ఐ ఎంటర్‌టైన్‌మెంట్స్ (యూఎస్ఏ) సమర్పణలో న్యూ రీల్ ఇండియా ఎంటర్టైన్మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై తెరకెక్కించగా.. కళ్యాణిమాలిక్ సంగీతం అందించారు.




# ‘ధూమ్ 4’లో విలన్‌గా సూర్య!

కోలీవుడ్ స్టార్ నటుడు సూర్య బాలీవుడ్ ఎంట్రీకి రంగం సిద్ధమైనట్లు తెలుస్తుంది. అయితే హీరోగా కాకుండా విలన్‌గా బాలీవుడ్‌లో అరంగేట్రం చేయబోతున్నాడు సూర్య. బాలీవుడ్ బ్లాక్ బస్టర్ ఫ్రాంచైజీ ధూమ్ సినిమాల గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. ఇప్పటివరకు ఈ ఫ్రాంచైజీ నుంచి మూడు సినిమాలు రాగా మూడు సినిమాలు బ్లాక్ బస్టర్ అందుకున్నాయి. ఇక ఈ సినిమాలల్లో హీరోల కంటే విలన్‌లకు ఎక్కువ ఇంపార్టెన్స్ ఉంటుదన్న విషయం తెలిసిందే. ఫస్ట్ పార్ట్‌లో జాన్ అబ్రహాం విలన్‌గా నటించగా.. ధూమ్ 2లో హృతిక్ రోషన్ విలన్‌గా నటించి మెప్పించాడు. ఒక థర్డ్ పార్ట్‌లో అయితే బాలీవుడ్ మిస్టర్ ఫర్‌ఫెక్ట్ ఆమీర్ ఖాన్ నటించి రూ.500 కోట్లకు వసుళ్లను సాధించాడు. తాజాగా ఈ సినిమా పార్ట్ 4 రాబోతున్నట్లు తెలుస్తుంది. అయితే ఈ పార్ట్‌లో విలన్‌గా సూర్య నటించబోతున్నట్లు బాలీవుడ్ మీడియా కోడై కూస్తుంది. ఒకవేళ ఇదే నిజమైతే అటు తమిళ ఫ్యాన్స్‌తో పాటు ఇటు తెలుగు ఫ్యాన్స్‌కు పండగా అనే చెప్పుకోవాలి.యష్‌రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌లో రాబోతున్న ఈ సినిమాకు కూడా ఫస్ట్ మూడు పార్ట్‌లకు కథను అందించిన ఆదిత్య చోప్రానే ‘ధూమ్ 4’కు కూడా కథను అందించబోతున్నట్లు తెలుస్తుంది. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మరోవైపు సూర్య ఇప్పటికే 24 సినిమాతో పాటు ‘విక్రమ్’ చిత్రంలో నెగిటివ్ రోల్ చేసి అలరించాడు. విక్రమ్ సినిమాలో ఆయన చేసిన రోలెక్స్ పాత్రకు అయితే ఫ్యాన్స్ ఫిదా అయిపోయారు అని చెప్పవచ్చు.

## ఎంఎస్ సుబ్బలక్ష్మిగా మారిన విద్యాబాలన్

ప్రముఖ లెజెండరీ క్లాసికల్ సింగర్ ఎంఎస్ సుబ్బలక్ష్మి బయోపిక్‌లో బాలీవుడ్ హీరోయిన్ విద్యా బాలన్ నటించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి బాలీవుడ్ చిత్ర పరిశ్రమ వర్గాలు. ఇప్పటికే దివంగత నటి సిల్క్ స్మితా బయోపిక్ డర్టీ పిక్చర్ సినిమాలో నటించి బ్లాక్ బస్టర్ అందుకున్న విద్యాబాలన్ మళ్లీ మరో బయోపిక్‌లో నటించబోతున్నట్లు తెలుస్తుంది.నేడు లెజెండరీ క్లాసికల్ సింగర్ ఎంఎస్ సుబ్బలక్ష్మి 108వ జయంతి. ఈ సందర్భంగా ఎంఎస్ సుబ్బలక్ష్మికి నివాళులు అర్పిస్తూ.. తనలాగే రెడీ అయ్యి విద్యాబాలన్ ఫొటోలు దిగింది. అచ్చం ఎంఎస్ సుబ్బలక్ష్మిలా ఉన్న విద్యా ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అయితే ఈ ఫొటోలు చూసిన నెటిజన్లు విద్యాబాలన్ ఎంఎస్ సుబ్బలక్ష్మి బయోపిక్ ఏమైనా ప్లాన్ చేస్తుందా అని కామెంట్లు పెడుతున్నారు. నా చిన్నప్పటి నుంచి ఉదయం నిద్ర లేవగానే నేను వినే మొదటి గొంతు సుబ్బులక్ష్మి గారిది. ఆమె ఓ ఆధ్యాత్మిక శక్తి. ఆమెకు ఇలా నివాళులర్పించడం చాలా ఆనందంగా, గౌరవంగా ఉంది అంటూ విద్యాబాలన్ రాసుకోచ్చారు.



## ముంబైలో లగ్జరీ ఫ్లాట్ కొనుగోలు చేసిన

# పృథ్వీరాజ్ సుకుమారన్



ప్రముఖ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ముంబైలోని బాంద్రా పాలి హిల్ ప్రాంతంలో అత్యంత విలాసవంతమైన డూప్లెక్స్ అపార్ట్‌మెంట్ కొనుగోలు చేశారు. తన ప్రొడక్షన్ హౌస్ పృథ్వీరాజ్ ప్రొడక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట ఈ ప్రాపర్టీని ఆయన ఏకంగా రూ. 30.6 కోట్లు చెల్లించి సొంతం చేసుకున్నారు. ఇదే ప్రాంతంలో పృథ్వీరాజ్ ఆయన భార్య సుప్రియా మీనన్‌లు రూ. 17 కోట్ల విలువైన మరో అపార్ట్‌మెంట్ కలిగిఉన్నారు.ఇక నటుడు కొనుగోలు చేసిన లగ్జరీ అపార్ట్‌మెంట్‌లో 3, 4,5 బీహెచ్‌కే అపార్ట్‌మెంట్స్ అందుబాటులో ఉన్నాయి. పృథ్వీరాజ్ డూప్లెక్స్ 2971 ఎస్ఎఫ్‌టీలో విస్తరించిఉంది. ఈ అపార్ట్‌మెంట్‌కు నాలుగు కారు పార్కింగ్ స్పేసెస్ కేటాయించారు. సెప్టెంబర్‌లో ఈ లగ్జరీ అపార్ట్‌మెంట్‌ను పృథ్వీరాజ్ కొనుగోలు చేశారు. రిజిస్ట్రేషన్ ఫీజుతో పాటు స్టాంప్ డ్యూటీ కింద ఆయన రూ. 1.84 కోట్లు చెల్లించారు. బాంద్రాలోని పాలి హిల్ ప్రాంతం బాలీవుడ్ సెలబ్రిటీలు నివసించే అత్యంత ఖరీదైన ప్రాంతంగా పేరొందింది. గత కొద్ది నెలలుగా ఈ ప్రాంతంలో రణ్‌వీర్ సింగ్, తృప్తి డిమ్రీ, అథియా శెట్టి వంటి సినీ సెలబ్రిటీలతో పాటు క్రికెటర్ కేఎల్ రాహుల్ వంటి ప్రముఖులు ఖరీదైన అపార్ట్‌మెంట్‌లను కొనుగోలు చేశారు. ఇక సినిమాల విషయానికి వస్తే సలార్‌కు కొనసాగింపుగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సలార్ 2లో పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్నారు.










Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com